సంపుటి : 3
సంచిక : 9
పుటలు : 52
రు. 20/-లు
తెనాలి


1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు

డిసెంబరు 2017



సంప్రదాయ విజ్ఞానం
భాషకు ఊపిరి

ఫొటో: తమ్మా శ్రీనివాసరెడ్డి

భారతీయ భాషల ఎడల కొరవడిన జాతీయ దృక్పథం

'చెయ్యెత్తి జైకొట్టిన' తెలుగోడు - వేములపల్లి శ్రీకృష్ణ



"చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా!/ గతమెంతో ఘనకీర్తి కలవోడా! / సాటిలేని జాతి-ఓటమెరుగని కోట/నివురుగప్పి నేడు నిదురబోతుందాది/జై కొట్టి మేల్కొలుపు తెలుగోడా!/గతమెంతో ఘనకీర్తి గలవోడా"-అంటూ తెలుగుజాతి పౌరుషాగ్నిని చాటిన కవి వేములపల్లి శ్రీకృష్ణని ఇప్పుడందరూ మరచి పోయారేమో! ఇది ఆయన శతజయంతి సంవత్సరం అనే సంగతి మాత్రం ఎవరికీ గుర్తున్నట్లు లేదు.

తెలుగుజాతి చైతన్యం కోసం తపనపడిన ప్రజాకవి వేములపల్లి శ్రీకృష్ణ, రష్యన్ సోషలిస్టు విప్లవం జరిగిన 1917లో గుంటూరు జిల్లా రేపల్లె సమీపంలోని బేతపూడిలో మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించారు.(పుట్టినతేదీ సరిగా తెలియదు) రేపల్లె హైస్కూలులో చదివారు. అక్కడ సీనియర్లయిన మాకినేని బసవపున్నయ్య, మోటూరు హనుమంతరావు, కంఠంనేని వెంకటరత్నం పరిచయం, నాటి జాతీయోద్యమం, అతివాద సాహిత్యం శ్రీకృష్ణపై ప్రభావం చూపాయి. 1935 - 36లో కమ్యూనిస్టు పార్టీ ఆర్గనైజరీ సెల్‌లోకి ప్రవేశించారు.

1937లో గుంటూరు ఏసీ కాలేజీలో డిగ్రీలో చేరిన కొద్ది రోజులకే కాలేజీలో జరిగిన చారిత్రాత్మక సమ్మెలో పాల్గొన్నారు. కొత్తపట్నంలో జరిగిన రాజకీయ పాఠశాలకు హాజరై, ప్రభుత్వ నిషేధాజ్ఞలను ధిక్కరించి లాఠీఛార్జికి గురైనవారిలో శ్రీకృష్ణ కూడా ఉన్నారు. ఆ మరుసటి సంవత్సరమే కోల్‌కటాలో జరిగిన 'అఖిల భారత విద్యార్థి సమాఖ్య' (ఏఐఎస్ఎఫ్) జాతీయ మహాసభల్లో, ఆంధ్ర విద్యార్థి ప్రతినిధి వర్గంలో సభ్యుడుగా శ్రీకృష్ణ పాల్గొన్నారు.

చీరాలలో ఐఎల్‌టీడీ కార్మికులు సమ్మె పోరాటంలో ఉన్నప్పుడు వారికోసమని 'కన్యాశుల్కం' నాటకాన్ని ప్రదర్శించి, వచ్చిన డబ్బంతా కార్మికులకు అందజేశారు. బీఏ పూర్తి చేశాక 1939లో బందరులో మ్యూచువల్ ఇన్సూరెన్స్ కంపెనీలో ఉద్యోగంలో చేరారు. ఆరునెలలకే గుంటూరు నుండి కామ్రేడ్ శివయ్య పిలుపుతో ఉద్యోగం వదిలేసి, గుంటూరు చేరుకొని తిరిగి పార్టీ రహస్య యంత్రాంగ నిర్వహణ బాధ్యతల్లోకి వెళ్లారు. 1942 - 43 లో సోవియట్‌పై దాడి చేసిన హిట్లర్ సైన్యాలను మాస్కో వద్ద రెడ్ ఆర్మీ అటకాయించి తిప్పి కొడుతున్న రోజుల్లో 'మాస్కో పొలిమేరల్లోనా' అనే కోలాటంపాట, బెంగాల్ కరువుపై 'బ్రహ్మపట్నం పోదామంటే' అనే పాట, కయ్యూరు వీరులపై 'జెండాను చేతబట్టి / జాయేంగే...కయ్యూరు జాయేంగే' పాటనూ రాశారు. 1943లో తెనాలిలో తాపీ ధర్మారావు అధ్యక్షతన జరిగిన ప్రథమాంధ్ర అభ్యుదయ రచయితల సంఘం (అరసం) మహాసభల్లో క్రియాశీల పాత్రను పోషించారు. 1948లో కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన శ్రీకృష్ణ, ఆ పార్టీపై తీవ్ర నిర్బంధం కొనసాగుతున్న కారణంగా రహస్య జీవితం గడిపారు. 'కాగడా' పత్రికలో 'చరిత్ర చిందులు'అన్న శీర్షికన గిరీశం పేరుతో, 'నగారా'లో 'లోకం పోకడ' శీర్షికన 'సాక్షి' అనే కలంపేరుతోనూ వ్యాసాలు రాస్తూ వచ్చారు.

1951 అక్టోబరులో సాయుధ పోరాట విరమణతో అజ్ఞాతవాసం నుంచి బయటకొచ్చిన శ్రీకృష్ణ, గుంటూరు నుండి వస్తున్న 'నగారా' పక్షపత్రికకు సంపాదక బాధ్యతలు చేపట్టారు. 1952లో మద్రాసులో జరిగిన అఖిలాంధ్ర సదస్సుకు హాజరైన తర్వాత, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరిగిన ఆంధ్ర అభ్యుదయ ఉత్సవాలకు శ్రీకృష్ణ హాజరయ్యారు. ఆమరణ దీక్షలో ఉన్న 'అమరజీవి' పొట్టి శ్రీరాములు డిసెంబరు 15న తుదిశ్వాస విడిచారు. రైళ్లు బందవటంతో ఆయన విశాఖలోనే ఉండిపోయారు. అప్పుడు మద్రాస్‌లో జరిగిన వైజ్ఞానిక మహాసభల కోసమని బి.గోపాలం కోరగా, శ్రీకృష్ణ రెండు రోజులు కూర్చొని 'చేయెత్తి జై కొట్టు తెలుగోడా' గేయాన్ని రాయగా, బి.గోపాలం బాణీని కట్టారు. ఏదోఒక రాజకీయపార్టీకి నిబద్ధుడైన కవి రచించిన గేయంలా కాకుండా సర్వజనుల అంగీకారాన్ని పొందిందీ గేయం. కాంగ్రెస్ నాయకులు ఈ గీతాన్ని పాడుకోవటానికి అభ్యంతరం లేదన్నారు. సాహిత్య అకాడమీ, ఆంధ్ర విశ్వవిద్యాలయం గేయ సంకలనాల్లో ఈ గేయాన్ని ప్రచురించాయి. అనేక సిద్ధాంత గ్రంథాలు, సాహిత్య వ్యాసాల్లో పేర్కొనబడి, తెలుగు నేల నలుచెరగులా విశేష ప్రచారాన్ని పొందిందీ గేయం.

1952లోనే బాపట్ల నుంచి, 1962, 1972లలో మంగళగిరి నుంచి శ్రీకృష్ణ రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. 1964-65లో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ఉద్యమం సందర్భంగా తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. 1967-72 మధ్యకాలంలో విశాలాంధ్ర దినపత్రికకు ప్రధాన సంపాదకుడు. 1972లో శాసన సభలో ప్రతిపక్ష నాయకుడు. అప్పట్నుంచి వరుసగా ఆరేళ్లపాటు పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ ఛైర్మన్. 1962లో ఆంధ్ర విశ్వవిద్యాలయం సెనేట్ సభ్యుడిగా, 1972 తర్వాత నాగార్జున విశ్వవిద్యాలయానికి, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయానికి సిండికేట్ సభ్యుడుగా పనిచేశారు.

సోవియట్ యూనియన్, బల్గేరియా,అమెరికా, కెనడా దేశాల్లో పర్యటించినపుడు అక్కడి సామాజిక స్థితిగతులను వివరిస్తూ, పర్యటన అనుభవాలను వ్యాసాలుగా రాశారు. డాక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నట్టు 'ఒక్క గేయంతో దేశమంతా ప్రఖ్యాతి నొందిన కవి' శ్రీకృష్ణ 2000 ఏప్రిల్ 8న కన్ను మూశారు.

\- మహతి

- తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
- తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
- ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి



డిసెంబరు 2017

రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి. 2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి *editorammanudi@gmail.com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు. 3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము. 4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము. **అమ్మనుడి** లో ప్రచురణైన తరువాత ఇతర పత్రికలలోగాని, సోషల్ మీడియాలోగాని ప్రచురించేట్లయితే – **అమ్మనుడి** నుంచి తీసుకున్నట్లు తప్పక పేర్కొనాలి.

లోపలి పుటలలో....

రేఖా చిత్రాలు : **చిదంబరం** కార్టూన్లు : **సరసి, శేఖర్**

ముఖచిత్రం : **తమ్మా శ్రీనివాసరెడ్డి** కంప్యూటరీకరణ : **లంకె జనార్దన్**

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* e-mail : editorammanudi@gmail.com

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

తెలుగుజాతి పత్రిక
అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు

చందా వివరాలు

		వ్యక్తులకు	సంస్థలకు	విదేశీయులకు
శాశ్వత చందా	:	రూ.5000	రూ.7500	--
5 సం॥	:	రూ.1000	రూ.1500	150 డాలర్లు
3 సం॥	:	రూ. 700	రూ.1000	75 డాలర్లు
1 సం॥	:	రూ. 240	రూ. 400	25 డాలర్లు

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.
AMMA NUDI - AXIS BANK, TENALI
అకౌంట్ నెం. **915020010550189**
IFSC Code : UTIB0000556
ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

డా॥ సామల లక్ష్మణబాబు, ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.

చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

'అమ్మనుడి' ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. <u>హైదరాబాదు</u> **- 27.** ఫోన్ :040-24652387

మైత్రీ బుక్‌హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

మణి బుక్‌స్టాల్, షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు**-1. ఫోన్:7386223538.

<u>అమ్మభాష తెలుగును కాపాడుకొనే</u>
<u>ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలుపు</u>

కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదళ్ళని తాకి కదిలింపజేసి ఆలోచనలలో ముంచెత్తేట్టు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకునేట్టు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురించాలని సంకల్పించాం.

ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల్లో ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు. ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషికంగా 500రూ. ఇవ్వబడుతుంది.

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.
- తరువాత ఈ కథానికలతో ఒక సంకలనాన్ని తెస్తాం.
- ప్రముఖ కథానికారచయిత **డా.వేదగిరి రాంబాబు** ఈ శీర్షికను **అమ్మనుడి** కోసం నిర్వహిస్తున్నారు.
- మన భావాలకు శాశ్వత రూపాన్నిచ్చే మన మాతృభాష కేంద్రంగా మీరు పంపే కథానికల కోసం ఎదురు చూస్తుంటాం. అమ్మభాష కోసం నిర్వహిస్తున్న ఈ వినూత్న శీర్షికకు విలువైన మీ కథానికలను పంపాల్సిన చిరునామా:

సంపాదకుడు, **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520 004. కార్యాలయం ఫోన్ : 0866-2439466. సంపాదకుడు : 9848016136. e-mail : editorammanudi@gmail.com

<u>గమనిక :</u> కథలను అనుఫాంట్స్‌లో గాని, యూనికోడ్‌లో గాని టైప్ చేసి, పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి.ఫైల్సులోపంపించాలి. చేతివ్రాతలో పంపేట్లయితే వ్రాసిన దానిని స్కాన్ చేయించిపంపాలి. లేదా వ్రాతప్రతిని పోస్టులో గాని, కొరియర్‌లో గాని పంపించాలి.

ప్రపంచ తెలుగు మహాసభలు - 2017
ముమ్మర ఏర్పాట్లు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2017 డిసెంబర్ 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఐదు రోజులపాటు హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో ప్రపంచ తెలుగు మహాసభలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించటానికి సర్వసన్నాహాలు చేస్తున్నది. 2014 జూన్ 2వ తేదీన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తరువాత తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న తొలి ప్రపంచ తెలుగు మహాసభలు ఇవి. తెలంగాణలోని భాష, సాహిత్యం, సంస్కృతి, ఇతర కళల్లోని ప్రాచీనతను, విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పే విధంగా ఈ మహాసభల్లోని కార్యక్రమాలు రూపుదిద్దుకుంటున్నాయి. ఈ డిసెంబర్ 15వ తేది శుక్రవారం సాయంకాలం ప్రారంభమయ్యే ఈ సభలు 19వ తేది రాత్రికి ముగుస్తాయి.

లాల్ బహదూర్ స్టేడియం ప్రధాన వేదికగా, రవీంద్ర భారతి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియం, తెలంగాణ సారస్వత పరిషత్తు ఉపవేదికలుగా కార్యక్రమాలు జరుగుతాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాహితీ సదస్సు, చర్చాగోష్ఠులు, కవి సమ్మేళనాలు, శతావధానాలు, అష్టావధానాలు, గ్రంథావిష్కరణలు ఉంటాయి. సాయంకాలం నుంచి రాత్రి వరకు వివిధ శాస్త్రీయ సంగీత, నృత్య కార్యక్రమాలు, నాటకాలు, జానపద కళారూపాలు ప్రదర్శించబడతాయి. వీటితో పాటు తెలుగు సాహితీ రూపకాలు కూడా ఏర్పాటవుతాయి. వీటిల్లో తెలంగాణ రాష్ట్రంలోని రచయితలు, కవులు, విమర్శకులు, పరిశోధకులు, కళాకారులతోపాటు ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల వారు కూడా పాల్గొంటారు.

ఈ మహాసభలలో సుమారు ఐదు నుంచి పదివేల మంది వరకు తెలుగువారు పాల్గొంటారని అంచనా. ఇతర దేశాల నుంచి సుమారు 60 మందిని, ఇతర రాష్ట్రాల నుంచి 60 మంది లబ్ధప్రతిష్ఠులైన కవులు, రచయితలు, కళాకారులను ప్రభుత్వం అతిథులుగా ఆహ్వానించింది. వీరికి రానుపోను ప్రయాణ ఖర్చులు ప్రభుత్వమే భరిస్తూ స్థానికంగా వారికి సముచితమైన వసతి, భోజన, రవాణా సౌకర్యం కల్పిస్తుంది. ప్రారంభోత్సవ సభలో కొందరు ఇతర భాషల జ్ఞానపీఠ అవార్డు గ్రహీతలను, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు పొందిన తెలుగు కవులు, రచయితలను ప్రధానవేదికపై సత్కరిస్తారు. ఈ సందర్భంగా మహాసభ ప్రాంగణంలో వివిధ హస్త కళ వస్తు ప్రదర్శనలు, పుస్తక ప్రదర్శనలు, చిత్ర, శిల్పకళా ప్రదర్శనలు కూడా ఏర్పాటవుతాయి. లాల్ బహదూర్ స్టేడియం ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద, ఇతర ప్రవేశ ద్వారాల వద్ద నగరంలోని ప్రధాన కూడళ్ళలో తెలంగాణలోని ప్రాచీన, ఆధునిక కవులు, రచయితలు, సంఘ సంస్కర్తలు వంటి ప్రముఖుల పేరిట స్వాగత ద్వారాలు, తోరణాలు నెలకొల్పుతారు.

ఈ సందర్భంగా నవంబర్ 9 నుంచి 13 వరకు మండల స్థాయి, 15 నుంచి 22 వరకు జిల్లా స్థాయి, 29, 30 తేదీలలో రాష్ట్రస్థాయిలో తెలంగాణ రాష్ట్రం అంతటా పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయిలలో విద్యార్థులకు తెలుగు భాషా సాహిత్యాల్లో కవితా రచన, వ్యాస రచన, వక్తృత్వం, సంగీతం, నృత్యం, చిత్ర లేఖనం వంటి అంశాలలో పోటీలు నిర్వహించారు, నిర్వహిస్తున్నారు. అంతేగాక విశ్వవిద్యాలయ పరిశోధనలస్థాయి విద్యార్థులకు తెలుగుభాషా సాహిత్యాలపై ముఖ్యంగా తెలంగాణ భాషా సంస్కృతులపై వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలలో విజేతలైన వారికి మహాసభలలో బహుమతులు అందజేస్తారు. పాల్గొన్న విద్యార్థుందరికీ ప్రశంసా పత్రాలిస్తారు.

మహాసభలలో పాల్గొనాలనే ఆసక్తి వున్నవారందరూ మహాసభలకు రావచ్చు. అయితే ప్రతినిధులుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి ఐదు రోజులపాటు ఉచిత భోజన సదుపాయం, స్థానికేతరులకు వసతి, స్థానిక రవాణా సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తుంది. మహాసభల కిట్టు, బ్యాడ్జి, ప్రవేశానికి ప్రత్యేకమైన పాసు ప్రతినిధులకు అందజేస్తారు. తెలంగాణ రాష్ట్రంలోని వారికి రూ. 100/-, ఇతర రాష్ట్రాల్లోని వారికి రూ. 500/-, ఇతర దేశాలవారికి రూ. 1000/- లేదా దానికి సమానమైన అమెరికన్ డాలర్లు ప్రతినిధి రుసుముగా నిర్ణయించారు. ప్రతినిధులుగా తమ పేరు నమోదు చేసుకోవాలనుకునేవారు హైదరాబాద్ రవీంద్ర భారతిలోని ప్రపంచ తెలుగు మహాసభల కార్యాలయంలో స్వయంగా వచ్చి చేసుకోవచ్చు లేదా ఆన్‌లైన్ ద్వారా చేసుకోవచ్చు. వెబ్‌సైట్ ఐడి, ఈమెయిల్ ఐడి ఈ క్రింద ఇవ్వడమైంది.

Web Site: www.wtc.telangana.gov.in
Email ID: wtchyd2017@telangana.gov.in
wtchyd2017@gmail.com

ఏనుగు నరసింహారెడ్డి, కార్యదర్శి
తెలంగాణ సాహిత్య అకాడమి,
రవీంద్రభారతి - హైదరాబాద్

హైదరాబాదులో డిసెంబరు 15 నుండి 19 వరకు జరుగనున్న
ప్రపంచ తెలుగు మహా సభల ప్రాంగణంలో
తెలుగుజాతి (ట్రస్టు) పుస్తక ప్రదర్శన / విక్రయశాలకు విచ్చేయండి

అమ్మనుడి' పత్రికకు ఇక్కడే చందాను చెల్లించవచ్చు

నడుస్తున్న చరిత్ర' 'అమ్మనుడి' పాత పత్రికలు కూడా విడిగాను, సంపుటులు (వాల్యూమ్సు) గాను లభిస్తాయి.




చందా వివరాలు

		వ్యక్తులకు	సంస్థలకు
శాశ్వత చందా	:	రూ.5000	రూ.7500
5 సం॥	:	రూ.1000	రూ.1500
3 సం॥	:	రూ. 700	రూ.1000
1 సం॥	:	రూ. 240	రూ. 400

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

లభించు పుస్తకాలు

స,వెం.రమేశ్ రచన




ఎల్లలు లేని తెలుగు
వెల : రు.200/-లు

శ్రీగారపాటి ఉమామహేశ్వరరావు రచచలు



తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం
వెల :రు. 100/-



ద్రావిడ, మంగోలు భాషల జన్యుసంబంధం
వెల : రు.350।-

భాషాభిమానులు, రచయితలు, భాషోద్యమకారులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు, ఆసక్తిగల వారంతా ఈ ప్రచురణలను కొనుగోలుచేసి, ప్రోత్సహించగోరుతున్నాము.

తెలుగుజాతి (ట్రస్టు) – హైదరాబాదు, విజయవాడ

విక్రయశాల నిర్వాహకుడు : డా॥ సామల లక్ష్మణబాబు (9440448244)

సంపుటి : 3 సంచిక : 10
అమ్మనుడి
డిసెంబరు 2017

సంపాదక హృదయం

మంత్రి నారాయణగారూ...రామయ్యగారి పాఠాలు వినండి

విద్యా వ్యాపార సామ్రాజ్యాన్ని ఏలుతున్న తెలుగువారిలో మొదటి వరుసన చెప్పుకోదగిన వ్యక్తి నారాయణ విద్యాసంస్థల అధిపతి శ్రీ పి. నారాయణ. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గంలో ఎక్కువ పలుకుబడి కలిగిన మంత్రి ఆయన. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారి ఇష్టసఖుడుగా పేరుబడిన మంత్రి. కాకపోతే, ఆయనను విద్యాశాఖకు కాకుండా, పురపాలక శాఖకు మంత్రిని చేశారు. అంటే – ఆయన నిర్వహణా దక్షత, కార్యసాధనా కుశలతలను బేరీజు వేశారన్న మాట. మరి, రాజధాని నిర్మాణం వంటి గురుతర బాధ్యతల్లో సమర్థులైన వారి చేదోడు కావాలి గదా! అయినా, వృత్తిరీత్యా ఆయన విద్యారంగ నిర్వహణలో ఆరితేరినవారు గనుక తన శాఖ క్రింద వున్న పాఠశాలల దుస్థితిని – పోటీ పరీక్షల్లో విద్యార్థులు సాధించవలసివున్న లక్ష్యాల దృష్ట్యా – చూస్తూ వూరకుండలేక పోయారు! తనకు తెలిసిన ఒక్క సూత్రాన్నీ – ఇంగ్లీష్ మీడియం మంత్రాన్ని అడ్డగోలుగా జపించడంతో. అది కాస్తా వికటించి, చివరకు అల్లరిపాలయ్యారు.

జి.ఒ.నెం:14 అనే బ్రహ్మాస్త్రాన్ని ఈ ఏడాది జనవరి 2న ప్రయోగించి మునిసిపల్ పాఠశాలలన్నిటినీ ఒక్క పెట్టున ఇంగ్లీష్ మీడియంలోకి మార్చేశారు. పసివాళ్లు పాఠశాలలో అడుగు పెట్టగానే వాళ్లు తమ అమ్మనుడిని వదిలిపెట్టి – ఇంగ్లీషునే వినాలి, తినాలి, అరిగించుకోవాలి; ఇంగ్లీషులోనే మాట్లాడాలి, ఆడాలి, పాడాలి! వందమంది మెకాలేలు కలిసినా అంత ప్రజావ్యతిరేక చర్యకు పాల్పడి వుండరు. దీన్ని వ్యతిరేకిస్తూ ఈ ఏడాదంతా ఉపాధ్యాయ సంఘాలు, ప్రజలు, భాషోద్యమకారులు ఉద్యమబాట పట్టారు. ఈ ప్రభుత్వం తెలుగుకు వ్యతిరేకమని బాగా ప్రచారంలో కొచ్చింది.

నవంబర్ 21న ఆంధ్రప్రదేశ్ శాసనసభలో మంత్రి నారాయణగారి ప్రకటనను చూస్తే ఆయనకు తెలుగంటే ఎంత చిన్నచూపో – ఇట్టే అర్థమై పోతుంది. అందుకే పాలకపక్షానికి చెందిన వారితో సహా పలువురు సభ్యులు ఆయనపై మండిపడ్డారు. మళ్లీ వారం తిరక్కుండానే 27 న శాసన మండలిలో పెద్దలు నిలదీశారు. జి.ఒ. 14 ని వారం రోజుల్లో ఉపసంహరించుకుంటామని ఆయన చెప్పినా, వారు నమ్మలేదు. వెంటనే ఆ మేరకు హామీ ఇవ్వవలసి వచ్చింది. అయినా, ఎవరికీ ఇంకా నమ్మకం కుదరడంలేదు. ఆయన చెయ్యబోయేదేమిటంటే తెలుగు, ఇంగ్లీషు మాధ్యమాలు రెండింటినీ సమాంతరంగా నడుపుతామంటూ మరొక జి.ఒ.ను తేవడం. తర్వాత తెలుగు మాధ్యమంలో ఎవరూ చేరకుండా నిరుత్సాహపరుస్తూ, అడ్డంకులు కలిగిస్తూ – చేరేవారు లేరు గనుక – వీలైనంత త్వరగా తెలుగు మాధ్యమానికి పూర్తిగా గోరీ కట్టడం. పాఠశాల విద్యలో బోధనా భాషకు సంబంధించిన ప్రభుత్వ విధానం ఇదే అనుకోవాలి!

కనీసం ప్రాథమిక విద్యను మాతృభాష మాధ్యమంలో బోధించాలనే శాస్త్రీయ సిద్ధాంతాన్ని త్రోసిరాజనడం, ఇంగ్లీషు లేకపోతే చదువే లేదన్నట్లుగా విధాన నిర్ణయం చెయ్యడం – కచ్చితంగా జాతి వ్యతిరేక చర్యే.

పాఠశాలల్లో అన్ని వసతులను ఏర్పరచి, పటిష్టంగా విద్యాబోధనకై సమర్థులను నియమించి, పట్టుదలగా నడిపితే, తెలుగు మాధ్యమ విద్యార్థులే ఆంగ్ల మాధ్యమ విద్యార్థులను మించి తమ ప్రతిభను నిరూపించుకోగలరు.


రాంకులొస్తేనే చదువన్నట్లు, విదేశీ చదువులకు వెళ్తేనే భవిష్యత్తన్నట్లు, ఈ దేశంలో, రాష్ట్రంలో ఉద్యోగావకాశాలే లేనట్టు మాట్లాడుతూ, భ్రమలు కల్పించేవారి మోసపు విధానాలను ప్రభుత్వ స్థాయిలో చేపట్టడం తగదు. తెలుగు భాష దండుగమారిదని, ఇంగ్లీషుతోనే మనుగడ అనే తప్పుడు అవగాహనను కలిగించేట్లుగా మంత్రి నారాయణ చట్ట సభల్లోనూ బయటా మాట్లాడడాన్ని సహించకూడదు. ఇదే విధంగా నారాయణగారు ముందుకు సాగితే, వచ్చే ఎన్నికలనాటికి ప్రభుత్వ వ్యతిరేకతతోపాటు, తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకత కూడా పెరిగి, తనకు నష్టదాయకం కాగలదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుగారు గ్రహించాలి.

చివరగా మంత్రి నారాయణగారికి చిన్న సలహా – అయ్యా, తొంబయ్యేళ్ల వయసూ, ఎంతో బోధనానుభవం కలిగిన విద్యావేత్త డా॥చుక్కా రామయ్యగారిని వెంటనే సంప్రదించండి. ఆయన చేత పాఠాలు చెప్పించుకోండి; వారి వ్యాసాలు చదివినా చాలు...ఇప్పుడు గందరగోళంగా ఉన్న మీ మానసిక స్థితిని చక్కబరచుకోవడానికి ఇది ఎంతైనా అవసరం. దయచేసి ఇప్పటికి ఈ వెనుక పుటలో వున్న డా॥ చుక్కా రామయ్యగారి వ్యాసాన్ని కూడా చదవండి.

సామల రమేష్‌బాబు

తేదీ : 28-11-2017

మాతృభాషతోనే పిల్లల్లో వికాసం



డా॥ చుక్కా రామయ్య

జ్ఞాన సముపార్జనలో మాతృభాషదే కీలక పాత్ర. తల్లి గర్భంలో ఉన్నప్పటి నుంచే శిశువు అవ్యక్తంగా భాషను నేర్చుకుంటాడని అనేక శాస్త్ర పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా ప్రాథమిక స్థాయిలో పిల్లవాడు ఏ వాతావరణం నుంచి వచ్చాడో, ఏ సామాజిక నేపథ్యం నుంచి వచ్చాడో ఆ పరిసరాల భాషే క్రమంగా అతన్ని తీర్చి దిద్దుతుంది. ఏ విద్యార్థి అయినా తన మాతృభాష ద్వారా విద్యను నేర్చుకోవడం విద్యార్థి హక్కు అని ఈ సందర్భంగా నా మనవి. ఒకటో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు తెలంగాణ రాష్ట్రప్రభుత్వం తెలుగు తప్పనిసరి చేయడం అభినందనీయం. విద్యా మనో విజ్ఞాన శాస్త్రాన్ని పరిశీలించినా, విద్యారంగంలో భాషపై జరిగిన పరిశోధనల్ని గమనించినా కనీసం సెకండరీ స్థాయి విద్య వరకన్నా విద్యార్థికి మాతృభాషలోనే బోధన జరగాలని శాస్త్రవేత్తలు, పరిశోధకులు నిర్ధారించారు.

జ్ఞానానికి సంబంధించిన మౌలిక భావనల్ని విద్యార్థి లోతుగా అధ్యయనం చేయడం మాతృభాష ద్వారానే సాధ్యమవుతుంది. నేను హైదరాబాద్‌లో ఐఐటీ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నప్పుడు మౌలికాంశాలకు వచ్చేసరికి తెలుగులో విడమరిచి చెబితే వారికి సులువుగా అర్థమయ్యేది. తొందరగా ఆ భావాలను గ్రహించేవారు పాఠశాల స్థాయిలో విద్యార్థులపై అదనంగా విషయ భారానికి తోడు భాషాభారం ఉండకూడదు. తెలుగు మాతృభాషగా ఉన్న విద్యార్థులకు గణితం, సైన్సు వంటి సబ్జెక్టులను అన్యభాషలో బోధించడం వల్ల విషయానికి సంబంధించిన 'కాన్సెప్ట్' అర్థంకాక జవాబులను బట్టీ పడుతున్నారు. అవి కూడా యాంత్రికంగానే కాబట్టి విద్యార్థి ఎంత మేధావి అయినా అతని ప్రతిభ కొరగాకుండా పోతుంది. పై తరగతులకు వెళ్లేకొద్దీ చదువు జ్ఞాపకశక్తి పై కాకుండా అవగాహనా సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. అందువల్ల పిల్లవాడి సహజాతాలు వికసించాలంటే మాతృభాషే శరణ్యం.

మనదేశం భిన్న జాతులు, భాషలు, సంస్కృతుల సమ్మేళనం. దేశంలో ఒక్కో ప్రాంతానికి, జాతికి వాటివాటి భాషలు, సంస్కృతులు ఉన్నాయి. ఏ ప్రజలు కూడా తమ చరిత్రను, సంస్కృతిని ధ్వంసం చేసుకొనేందుకు ఇష్టపడరు. అది శాస్త్రీయం కూడా కాదు. కొన్ని వేల సంవత్సరాలుగా వస్తున్న ఆ సంస్కృతి, సంప్రదాయాన్ని నిక్షిప్తం చేసుకున్నది కూడా భాషే. కాబట్టే సంస్కృతి పరిరక్షణలో అంటే విలువలు, వికాసం విషయంలో భాషే కీలక పాత్ర పోషించింది. పోషిస్తుంది. కాబట్టి మాతృభాష ద్వారానే సంస్కృతి నిలుస్తుంది. భవిష్యత్ తరాలకు తెలుస్తుంది. ఆర్థిక సరళీకృత విధానాలు, ప్రపంచీకరణ ప్రభావం దేశీయ భాషల్ని, సంస్కృతుల్ని ప్రభావితం చేసిన మాట వాస్తవం. విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాల పేరిట మాతృభాష స్థానంలో 'ఇంగ్లీష్'ను మాధ్యమంగా చేయడం పిల్లల ప్రాథమిక హక్కును కాలరాయడమే అవుతుంది. సంపాదన పెరగవచ్చుగానీ సంస్కృతి అంతరించే ప్రమాదం ఉంది. ఆ పరిణామాలు ఇప్పుడిప్పుడే మనకు కనబడుతున్నాయి కదా! చదువు లక్ష్యం కేవలం ఆర్థిక ప్రయోజనం ఒక్కటే కాదు. విస్తృత జ్ఞాన సముపార్జన. ఆయా రంగాలకు సంబంధించిన మౌలిక పరిశోధనలు జరగాలంటే ఇంటర్మీడియట్ వరకు 'తెలుగు' కొనసాగినప్పుడే మరెన్నో కొత్త ఆవిష్కరణలు జరిగే అవకాశం ఉంది. సాంకేతిక పరిజ్ఞానం పెరిగినా అందులోని మూలతత్వాన్ని తెలుసుకోవాలి. పరిచయం వేరు, పరిజ్ఞానం వేరు. సాంకేతిక విజ్ఞానానికి సంబంధించిన మూలతత్వం సుబోధకం కావాలంటే అది మాతృభాష ద్వారానే సాధ్యమవుతుంది. అది లోపించడం వల్లనే ఇక్కడ వినియోగదారులు పెరిగారు. కానీ ఉత్పత్తిదారులు పెరగలేదు. ఈ లోపాన్ని విద్యారంగం ద్వారానే సరిదిద్దాలి.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల భాగస్వామ్యం పెరగాలంటే మాతృభాషే కీలకం. ఒకనాడు చదువంటే కేవలం అక్షరమే. ఇవాళ చదువంటే ఒక ఆలోచన. ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు భాషే ఓ మాధ్యమం. ప్రజలకు అర్థంకాని భాషలో శాసనాలు చేసినా, చట్టాలు రూపొందించినా, పాలన కొనసాగించినా అది చెవిటివాని ముందు శంఖం ఊదిన చందంగానే ఉంటుంది. అందుకే తెలుగు శాసనభాషగా, పాలక భాషగా చెలామణి కావాలంటే ముందు బోధన భాషగా సమర్థవంతంగా, సక్రమంగా అమలు కావాలి. తెలుగంటే కేవలం సాహిత్యానికే పరిమితమైన భాషగా కాకుండా ప్రజా జీవితంతో ముడిపడి ఉన్న అన్ని రంగాలకూ దాన్ని విస్తరింపజేయాలి. ఆ దిశగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చారిత్రకంగా దొర్లిన ఓ లోపాన్ని సవరిస్తూ ఒకటో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు 'తెలుగు'ను ఒక సబ్జెక్టుగా తప్పనిసరి చేస్తూ ఆదేశాలివ్వడం సంతోషకరం. (ప్రజాశక్తి 25-11-2017 సౌజన్యంతో)

పెండ్యాల సత్యనారాయణ
సెల్: 98664 42034

భారతీయ భాషల ఎడల కొరవడిన జాతీయ దృక్పథం

నవంబరు 26 : రాజ్యాంగ దినోత్సవం

భారత దేశంలోని మైనారిటీ లేక అల్ప సంఖ్యాకులను రాజ్యాంగం ప్రధానంగా రెండు తరగతులుగా వర్గీకరించింది. ఒకటి – మత పరమైన మైనారిటీ లేక అల్ప సంఖ్యాకులు, రెండు – విలక్షణమైన భాషనుగాని, లిపినిగాని లేక సంస్కృతినిగాని కలిగి ఉండే మైనారిటీ లేక అల్ప సంఖ్యాకులు. అయితే, ఈ విధంగా వర్గీకరించి ప్రకటించే అధికారాన్ని రాజ్యాంగం కేంద్ర ప్రభుత్వానికి సంక్రమింపచేసింది. ఆ క్రమంలో, ముస్లిం, క్రిస్టియన్, శిక్కు, బౌద్ధ, పార్సీ మతాలను మైనారిటీ మతాలుగా కేంద్ర ప్రభుత్వం 1969లో గుర్తించి నోటిఫై చేసింది. చాలా కాలం తర్వాత 2014 సంవత్సరంలో జైన మతాన్ని కూడా మైనారిటీ మతంగా కేంద్ర ప్రభుత్వం గుర్తించి నోటిఫై చేసింది. అల్ప సంఖ్యాక వర్గాలకు రాజ్యాంగం కొన్ని ప్రత్యేక రక్షణలు, అదనపు ప్రయోజనాలను 29 మరియు 30 అధికరణాల ద్వారా కల్పించింది. పర్యవసానంగా ఆ ఐదు మతాలకు చెందిన పౌరులు, రాజ్యాంగంలోని 29,30 అధికరణాలవలన లభించే ప్రయోజనాలను పొందగలుగుతున్నారు. ఆ రెండు అధికరణాలు ఈ క్రింది విధముగా ఉన్నాయి:

అధికరణం 29 : అల్ప సంఖ్యాక వర్గాల ప్రయోజనాల పరిరక్షణ :

1) భారత భూభాగంలో ఏదో ఒక ప్రదేశంలో ఉన్న కొందరు పౌరులు (any section of citizens) ఒక లక్షణమైన భాషనుగాని, లిపినిగాని లేక సంస్కృతినిగాని (distinct language, script or culture of its own) కలిగి ఉన్నట్లయితే, వారు ఆ భాష, లిపి, సంస్కృతిని పరిరక్షించుకునే హక్కును కలిగి ఉంటారు (right to conserve the same).

2) ప్రభుత్వంచే నిర్వహించబడే విద్యాలయాలలోగాని, లేక ప్రభుత్వ నిధులనుండి ఆర్థిక సహాయం పొందే విద్యాలయాలలోగాని పౌరులను (విద్యార్థులను) చేర్చుకునే విషయంలో కేవలం మతం, జాతి, కులం, భాషల ప్రాతిపదికపై వివక్షత చూపరాదు. అనగా, కేవలం ఆ కారణాలపై విద్యాలయ ప్రవేశాన్ని నిరాకరించరాదు.

అధికరణం 30 : విద్యాలయాలను స్థాపించి, నిర్వహించుకొనుటలో అల్ప సంఖ్యాక వర్గాల హక్కులు :

1) మతపరమైన అల్ప సంఖ్యాక వర్గాలవారా, లేక భాషా పరమైన అల్ప సంఖ్యాక వర్గాలవారా అనే తారతమ్యం లేకుండా, అల్ప సంఖ్యాక వర్గాలవారందరూ తమకు తోచిన విధంగా విద్యా సంస్థలను స్థాపించుకుని నిర్వహించుకోవచ్చు.

1–ఎ) క్లాజు(1)లో ఉదహరింపబడిన అల్ప సంఖ్యాక వర్గాల వారిచే స్థాపించబడి, నిర్వహించబడుతున్న విద్యా సంస్థలు ఆస్తులను తప్పనిసరిగా కలిగియుండుటకు సంబంధించిన శాసనములను రూపొందించే సందర్భములో, సదరు ఆస్తుల విలువను నిర్ధారించ టంలోగాని, నిర్ణయించటంలోగాని క్లాజు (1) క్రింద అల్ప సంఖ్యాక వర్గాలకుగల హక్కులకు ఎటువంటి భంగము కలుగరాదు.

2) విద్యా సంస్థలకు ఆర్థిక సహాయాన్ని అందజేసే క్రమంలో అల్ప సంఖ్యాక వర్గాలచే నిర్వహించబడే విద్యాసంస్థల యెడల ఎటు వంటి వివక్షతనూ చూపరాదు. ఆ విద్యాసంస్థ మతపరమైన అల్ప సంఖ్యాక వర్గానికి చెందినా, లేక భాషాపరమైన అల్ప సంఖ్యాక వర్గానికి చెందినా ఇదే నియమం వర్తిస్తుంది.

ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం జాతీయ మైనారిటీల కమిషన్‌ను కూడా ఏర్పాటు చేసింది.

అయితే, పైన ప్రస్తావించబడిన ఐదు మతాలకు ఇవ్వబడిన మైనారిటీ హోదా ఆచరణలో ఒక విచిత్రమైన పరిస్థితికి దారితీసింది. లక్ష ద్వీప్, మిజోరాం, నాగాలాండ్, మేఘాలయ, జమ్ము కాశ్మీర్, అరుణాచల ప్రదేశ్, మణిపూర్, పంజాబ్ రాష్ట్రాలలో (మొత్తం ఎనిమిది రాష్ట్రాలు) పైన ప్రస్తావించబడిన మైనారిటీ మతస్తులు మెజారిటీలో ఉన్నారు. మెజారిటీ మతస్తులుగా పరిగణింపబడుతున్న హిందువులు మైనారిటీలుగా ఉన్నారు. ఉదాహరణకు లక్ష ద్వీప్‌లో ముస్లింలు 92.20 శాతం, హిందువులు 2.5 శాతం. మిజోరంలో హిందువులు 2.75 శాతం. నాగాలాండ్‌లో హిందువులు 8.75 శాతం. మేఘాలయలో హిందువులు 11.53 శాతం. జమ్ము కాశ్మీర్‌లో హిందువులు 28.44 శాతం. అరుణాచల్ ప్రదేశ్‌లో హిందువులు 29 శాతం. మణిపూర్‌లో హిందువులు 31.9 శాతం. పంజాబ్‌లో హిందువులు 38.40 శాతం. అదే సమయంలో జమ్ము కాశ్మీర్, అస్సాం, పశ్చిమ బెంగాల్, కేరళ, ఉత్తర ప్రదేశ్, బీహార్‌లలో ముస్లింలు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. మిజోరాం, మేఘాలయ, నాగా లాండ్ రాష్ట్రాలలో క్రిస్టియన్లు మెజారిటీ. అరుణాచల ప్రదేశ్, గోవా, కేరళ, మణిపూర్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో క్రిస్టియన్లు గణనీయ సంఖ్యలో ఉన్నారు. ఈ నేపథ్యంలో పైన పేర్కొన్న ఎనిమిది రాష్ట్రాలలో హిందువులు మైనారిటీ అయినప్పటికి, రాజ్యాంగంలోని 29, 30 అధికరణాలక్రింద పొందవలసిన మైనారిటీ ప్రయోజనాలను పొందలేకపోతున్నారు. ఆ రాష్ట్రాలలో మెజారిటీగా ఉన్న క్రిస్టియన్, ముస్లిం, శిక్కు మతస్తులు రాజ్యాంగంలోని 29, 30 అధికరణాల క్రింద పొందవలసిన మైనారిటీ ప్రయోజనాలను పొందుతున్నారు. లోపం ఎక్కడున్నది?

లోపం కేంద్ర ప్రభుత్వ విధానాలు, అవగాహనా రాహిత్యంలో ఉన్నది. ఇంకా వాస్తవంగా చెప్పాలంటే కేంద్రంలో 70 సంవత్సరాలుగా పరిపాలన సాగించిన, పరిపాలన సాగిస్తున్న జాతీయపార్టీల ఆలో చనా విధానంలో ఉన్నది. దేశం మొత్తం జనాభాలో ఏ మతస్తులు ఎంతమంది ఉన్నారన్నది ప్రాతిపదికగా మెజారిటీ మతం, మైనారిటీ మతం అన్న వర్గీకరణ జరిగింది. అంతే తప్ప ఏ ప్రాంతం లేక రాష్ట్రంలో ఏ మతానికి చెందినవారు మెజారిటీగా ఉన్నారు, ఏ మతానికి చెందినవారు మైనారిటీగా ఉన్నారు అన్న అంశాన్ని కేంద్ర

ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు. అందుకే ఇటువంటి విచిత్ర పరిస్థితి ఏర్పడింది.

ఈ నేపథ్యంలో అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ అనే అడ్వొకేట్ గత నెలలో (అక్టోబర్) సుప్రీంకోర్టులో ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (రిట్ పిటిషన్) దాఖలు చేశారు. పైన ప్రస్తావించబడిన విపరీత పరిస్థితుల వలన ఎనిమిది రాష్ట్రాలలో మైనారిటీలుగా ఉన్న హిందువులు, రాజ్యాంగం ప్రసాదించిన మైనారిటీ ప్రయోజనాలను పొందలేకుండా ఉన్నారని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి, ప్రాథమిక హక్కులకు విరుద్ధమని, అందువలన ఆ ఎనిమిది రాష్ట్రాలలో హిందువులను మైనారిటీలుగా గుర్తించవలసిందిగా కోరుతూ ఆ పిల్ దాఖలయింది. అయితే, ఆ రిట్ పిటిషన్‌పై విచారణ జరిపితే ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతాయని, తన పరిస్థితి ఇరకాటంలో పడుతుందని సుప్రీం కోర్టు భావించింది. అందువలన ఈ అంశానికి సంబంధించి జాతీయ మైనారిటీ హక్కుల సంఘాన్ని ఆశ్రయించవలసిందిగా పిటిషనర్‌కు సలహా ఇస్తూ ఆ పిల్‌కు మంగళం పాడింది. ఆ విధంగా సుప్రీం కోర్టు తెలివిగా తనను తాను రక్షించుకుంటూ కేంద్ర ప్రభుత్వాన్ని కూడా రక్షించింది. ఎందుకంటే జాతీయ మైనారిటీ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తే కాలయాపన తప్ప ఎటువంటి ప్రయోజనం ఉండదని సుప్రీం కోర్టుకు బాగా తెలుసు. జాతీయ మానవ హక్కుల కమిషన్ నిరర్థకమైన, పనికిమాలిన సంస్థ అన్నది బహిరంగ రహస్యమే. ఇప్పటి వరకు ఆ కమిషన్ చేసింది ఏమీ లేదు. మహా అయితే కేంద్ర ప్రభుత్వానికి లేక రాష్ట్ర ప్రభుత్వానికి ఒక సలహా లేక సిఫార్సు చేస్తుంది. ఆ సలహాను విధిగా కేంద్ర ప్రభుత్వం లేక రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయవలసిన అవసరం లేదు. ఇవన్నీ తెలిసే సుప్రీం కోర్టు పైవిధంగా పేర్కొన్నది.

ఇదంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే, దేశంలోని చాలా ప్రాంతాలలో మెజారిటీగా ఉన్న హిందువులు కొన్ని ప్రాంతాలలో (రాష్ట్రాలలో) మైనారిటీలుగా ఉన్నందువలన ఎటువంటి పరిస్థితి తలెత్తిందో, చాలా రాష్ట్రాలలో మైనారిటీ భాషలు మాట్లాడేవారి విషయంలోనూ అటువంటి పరిస్థితే తలెత్తింది. భాషా ప్రయుక్త రాష్ట్రములు ఏర్పడిన తర్వాత, చాలా రాష్ట్రాలలో అల్ప సంఖ్యాక భాషల సమస్య తలెత్తింది. ఒక రాష్ట్రంలో, ఎక్కువమంది మాట్లాడే భాష ఆ రాష్ట్ర అధికార భాష అయింది. అదే రాష్ట్రంలో, ఆ రాష్ట్ర అధికార భాషకు చెందని మైనారిటీ భాష లేక భాషలు మాట్లాడే మైనారిటీ పౌరులు ఉంటున్న పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి ప్రాంతీయంగా ఉండే మైనారిటీ భాషలను లింగ్విస్టిక్ మైనారిటీలు అంటారు. ఉదాహరణకు తమిళనాడులో మెజారిటీ తమిళులే అయినా, అధికార భాష తమిళమే అయినా, అక్కడ ఉన్న అల్ప సంఖ్యాకులైన తెలుగు ప్రజల మాతృభాష తెలుగు కనుక అక్కడ మైనారిటీ భాష తెలుగు అవుతుంది. మన రాష్ట్రంలో అధికార భాష తెలుగు. తమిళులు మైనారిటీ కనుక తమిళం మైనారిటీ భాష అవుతుంది. చాలా రాష్ట్రాలో అనివార్యంగా ఇటువంటి పరిస్థితే ఉంటున్నది. రాజ్యాంగంలోని 29 మరియు 30 అధికరణాలలో ఏవిధముగా ఉన్నప్పటికి, స్థానికంగా ఉండే మైనారిటీ భాషల అభ్యున్నతికి, పరిరక్షణకు అటు కేంద్ర ప్రభుత్వం కాని, చాలా రాష్ట్ర ప్రభుత్వాలుకాని ఎటువంటి చర్యలను తీసుకోవటం లేదు. పర్యవసానంగా తమిళనాడులో మైనారిటీగా ఉన్న తెలుగు ప్రజలు అనివార్యంగా ప్రాథమిక స్థాయి నుండి తమిళ భాషనే నేర్చుకోవలసి వస్తున్నది. అందువలన తెలుగు భాష కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతున్నది. ఈ నేపథ్యంలో ప్రాంతీయ మైనారిటీ భాషలకు సంబంధించి రాజ్యాంగంలో ఏమి పేర్కొనబడిందో తెలుసుకోవటం అవసరం.

రాజ్యాంగంలోని పదిహేడవ విభాగంలోని రెండవ అధ్యాయం ప్రాంతీయ భాషలకు చెందినది. ఆ అధ్యాయంలోని 345 అధికరణం ప్రకారం రాష్ట్రాలు, ఒకటి లేక అంతకన్నా ఎక్కువ భాషలనుగాని, లేక హిందీనిగాని తమ రాష్ట్ర అధికార భాష, లేక భాషలుగా ప్రకటించుకోవచ్చు. అధికరణం 347 రాష్ట్రములలో అల్ప సంఖ్యాక భాషలకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చుటకు సంబంధించినది. ఆ అధికరణం ప్రకారం "ఏదైనా ఒక రాష్ట్రములో గణనీయమైన సంఖ్యలో ఉన్న ప్రజలు కనుక తాము మాట్లాడే భాషను కూడా ఆ రాష్ట్ర ప్రభుత్వము గుర్తించవలసిందిగా రాష్ట్రపతిని కోరవచ్చు. వారి కోర్కెను రాష్ట్రపతి ఆమోదించినట్లయితే, ఆ భాషను కూడా రాష్ట్రమంతటా అధికారికంగా గుర్తించవలసిందిగా రాష్ట్రపతి సదరు రాష్ట్ర ప్రభుత్వమును ఆదేశించవచ్చు". రాజ్యాంగంలోని అదే విభాగములోని నాల్గవ అధ్యాయము ప్రత్యేక ఆదేశములకు సంబంధించినది. ఆ అధ్యాయములోని 350–ఎ అధికరణం అత్యంత కీలకమైనది, ముఖ్యమైనది. ఆ అధికరణం ఈ క్రింది విధముగా ఉన్నది:

"అధికరణం 350–ఎ : భాషాపరమైన మైనారిటీలకు ప్రాథమిక స్థాయిలో మాతృభాషలో విద్యా బోధన:

భాషాపరమైన అల్పసంఖ్యాక వర్గాలవారికి ప్రాథమిక స్థాయిలో వారి మాతృ భాషలోనే విద్యాబోధన జరిగేందుకు అవసరమైన అన్ని సదుపాయాలను, అవకాశాలను కల్పించటం స్థానిక రాష్ట్ర ప్రభుత్వాల, స్థానిక సంస్థల బాధ్యత. ఇందుకు సంబంధించి రాష్ట్రములకు రాష్ట్రపతి తగు ఆదేశములను జారీ చేయవచ్చు".

భాషాపరమైన అల్ప సంఖ్యాక వర్గాల ప్రజలు అల్ప సంఖ్యాకులే అయినా, వారి మాతృ భాషపై వారికి మక్కువ ఉంటుంది. అంతే కాకుండా ఆ భాషలు కూడా మన సంస్కృతిలో ఒక భాగం. అటువంటి చాలా భాషలకు రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూలు ద్వారా అధికారిక గుర్తింపు కూడా లభించింది. మాతృభాషలో విద్యాబోధన వలన విద్యార్థులలో అవగాహనా శక్తి పెరుగుతుందని, విషయాలను సులభంగా అర్థం చేసుకోగలరని శాస్త్రీయంగా కూడా నిరూపణ అయింది. అందువలన అటువంటి అల్ప సంఖ్యాకులకు వారి మాతృ భాషలోనే ప్రాథమిక స్థాయిలో విద్యాబోధన అవసరం అని భావించి, 1956లో, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు సందర్భంగా జరిగిన ఏడవ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ అధికరణం అదనంగా చేర్చబడింది. అదే రాజ్యాంగ సవరణ ద్వారా 350–బి అధికరణం కూడా అదనంగా చేర్చబడింది. ఆ అధికరణం ఈ క్రింది విధముగా ఉన్నది.

'అధికరణం 350–బి: భాషాపరమైన మైనారిటీల కొరకై ప్రత్యేక అధికారి నియామకము :


(1) భాషాపరమైన మైనారిటీల కొరకై ఒక ప్రత్యేక అధికారిని రాష్ట్రపతి తప్పనిసరిగా నియమించి తీరవలెను:

(2) భాషాపరమైన మైనారిటీల హక్కుల పరిరక్షణకై ఈ

రాజ్యాంగములో పొందుపరచబడిన ఏర్పాట్లకు సంబంధించిన అంశ ములపై పరిశీలన జరిపి రాష్ట్రపతికి నివేదించుట ఆ ప్రత్యేక అధికారి బాధ్యత. రాష్ట్రపతి ఆ రిపోర్టులను పార్లమెంటుకు సమర్పించవలెను. ఆ రిపోర్టు ప్రతులను సంబంధిత రాష్ట్ర ప్రభుత్వములకు కూడా పంపవలెను'.

వివిధ రాష్ట్రాలలో ఉన్న భాషాపరమైన మైనారిటీల హక్కుల పరిరక్షణకు, ప్రత్యేకించి ప్రాధమికస్థాయి వరకు వారి మాతృభాష లోనే విద్యాబోధన జరుగవలెనన్న రాజ్యాంగపరమైన ఆదేశాలకు అటు కేంద్ర ప్రభుత్వం కాని, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు కాని ఏమాత్రం విలువ ఇవ్వకుండా చెత్త బుట్టలో పారేశాయి. ఇది గత 70 సంవత్సరాల చరిత్ర. ఇందుకు సమాధానం చెప్పవలసిన బాధ్యత ప్రధానంగా జాతీయ పార్టీలపై ఉన్నది. వివిధ రాష్ట్రాలలోని ప్రాంతీయ, స్థానిక మైనారిటీ భాషలు, ఆ భాషలను మాట్లాడే మైనారిటీ ప్రజల మనోభావాలకు, మాతృభాషాభిమానానికి తగిన న్యాయం చేయ కుండా జాతీయ పార్టీలు బుద్ధి పూర్వకంగానే కప్పదాటుడు విధానాన్ని ఎంచుకున్నాయి. ఇంతకన్నా దౌర్భాగ్యం ఏమిటంటే, మన దేశంలో మైనారిటీ భాషలపై ఒక జాతీయ విధానమే లేదు. దీనికి బాధ్యత మన జాతీయ పార్టీలదే. ఒక రాష్ట్రంలోని మైనారిటీ భాషలకు, ఆ భాషను మాట్లాడే ప్రజలకు న్యాయం చేస్తే, ఆ రాష్ట్రంలోని మెజారిటీ భాష మాట్లాడే ప్రజలకు ఎక్కడ కోపం వస్తుందో, ఓట్లు పడవేమోనన్న భయంతో, సంకుచిత, స్వార్థపూరిత ఓట్ బ్యాంకు రాజకీయాలకు అనుగుణంగా జాతీయ పార్టీలు వ్యవహరిస్తున్నాయి. ఇదే సమ యంలో, కారణాలు ఏమైనప్పటికి జాతీయ పార్టీలు కనుమరుగై ప్రాంతీయ పార్టీల శకం ఆరంభమయింది. కులోన్మాదం, భాషా దురభిమానం ఎజెండాగా పుట్టుకొచ్చిన కొన్ని ప్రాంతీయ పార్టీలు, బుద్ధి పూర్వకంగా స్థానిక మైనారిటీ భాషలను అణగద్రొక్కుతున్నాయి. ఏదో ఒక ప్రాంతీయ పార్టీ నీడలో బతకాల్సిన జాతీయ పార్టీలు మైనారిటీ భాషల పరిరక్షణ ఎడల అనివార్యంగా మౌనం వహిస్తు న్నాయి.

మొత్తం మీద సమీక్షించుకుంటే, మితిమీరిన ప్రాంతీయ భాషా దురభిమానం, జాతీయ సమైక్యతా ధోరణి కనుమరుగు కావటం, ఓటు బ్యాంకు రాజకీయాలు తదితర అనేక కారణాల పర్యవసానంగా 350-ఎ, 350-బి అధికరణాలు నిర్వీర్యం అవుతున్నాయి. పర్యవ సానంగా తమిళనాడులో అల్ప సంఖ్యాకులుగా ఉన్న తెలుగు బాల బాలికలు కనీసం ప్రాధమిక స్థాయి వరకుకూడా తెలుగులో విద్యా బోధనకు దూరం అవుతున్నారు. ఇటువంటి పరిస్థితి పోవాలంటే తెలుగు భాషాభిమానులంతా ఉద్యమించాలి. మైనారిటీ భాషల పట్ల ఒక జాతీయ విధానాన్ని రూపొందించే విధంగా కేంద్ర ప్రభుత్వంపై, అన్ని జాతీయ పార్టీలపై ఒత్తిడి తీసుకురావాలి. 350-ఎ, 350-బి అధికరణాలను అమలుచేయవలసిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీం కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయటంతోసహా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలనూ తెలుగు భాషాభిమానులు వినియోగించుకోవాలి. రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తెలుగు భాష పట్ల తమకున్న అభిమానాన్ని, నిబద్ధతను మాటలలో కాకుండా ఆచరణలో చూపాలి.



చర్చ

తెలుగులిపి-సంస్కరణ

నేటి తెలుగు లిపిలో మార్పులు రావలసిన అవసరాన్ని అప్పుడప్పుడు కొందరు మేధావులు చర్చిస్తూనే ఉన్నారు. 'నడుస్తున్న చరిత్ర'లో లోగడ ఇలాంటి చర్చల్ని ప్రచురించాము.

ఒకనాటి వాడుక భాషోద్యమం వల్ల సాహిత్యంలోనూ, శాస్త్ర సాంకేతిక విజ్ఞాన గ్రంథాల్లోనూ, పరిపాలన, పత్రికా ప్రసారమాధ్యమాల వంటి ఇతర ఆధునిక రంగాలన్నింటిలోనూ, పరిపాలన, పత్రికా ప్రసార మాధ్యమాల వంటి ఇతర ఆధునిక రంగాలన్నిటిలోనూ సరళమైన తెలుగు వినియోగంతోనే భాషాభివృద్ధి ముడిబడివుందని పదేపదే స్పష్టం అవుతున్నది. పరబాషల మాటల్ని తప్పనిసరిగా అక్కర పడినప్పుడు వాటిని తెలుగుదనంతో తీర్చిదిద్ది కలుపుకోవచ్చుననే సామాన్య సూత్రాన్ని మనం మరువ కూడదు. ఈ దారిలో నడిస్తే – మనం ఇప్పుడు వాడుతున్న కొన్ని అక్షరాలతో అట్టే అవసరం ఉండదు. అంతేగాక, కంప్యూటర్లను పూర్తి వినియోగంలోకి తెచ్చుకోవలసి వుండడమూ, ఆధునిక భాషలకు దీటుగా తెలుగు బోధనను సరళం చేయవలసి వుండడమూ – మన లిపికి తగు సంస్కరణలను తప్పనిసరి చేస్తున్నాయి.

ఈ అంశంపై చర్చకోసం మీ అభిప్రాయాలను వ్రాసి పంపండి. స్పష్టంగా, క్లుప్తంగా వ్రాయండి. వ్యక్తి దూషణ, ఎదుటివారిని నిందించే ధోరణికి తావులేదు. ఈ చర్చలో పాల్గొనవలసిందిగా భాషా శాస్త్రజ్ఞులను, పండితులను, రచయితలను, అన్ని స్థాయిలలోని అధ్యాపకులను, సాధారణ ప్రజలను అందరినీ కోరుతున్నాం.

ప్రసిద్ధ రచయిత్రి, మార్క్సిస్టు మేధావి, రంగనాయకమ్మగారు పంపిన "తెలుగు 'అక్షరమాల'ని కొంత సంస్కరించుకోవాలి!" అనే వ్యాసాన్ని ముందుగా ఇప్పుడు ప్రచురిస్తున్నాం.

– సంపాదకుడు

తెలుగు'అక్షర మాల'ని కొంత సంస్కరించుకోవాలి!

– రంగనాయకమ్మ
040-40130914

తెలుగు "అక్షర మాల' లో, అచ్చుల్లోనూ, హల్లుల్లోనూ కూడా, అనవసరపు అక్షరాలు కొన్ని ఉన్నాయి. ఇంకా సరిగా చెప్పుకుంటే, వాటిని, "తర్కంలేని అక్షరాలు"అనికూడా అన వచ్చు.

"అక్షర మాల" ని సంస్కరించాలంటే, అందులో వున్న అచ్చుల్నీ, హల్లుల్నీ, ఎలా వున్నాయో, మొదట చూడాలి.

1."అచ్చుల్ని" మొదట చూద్దాం. వాటిని రాసి విద్యార్థులకు చూపించే పద్ధతి, ఎలా వుండాలి? అక్షరాల శబ్దాల జతలు పిల్ల లకి చక్కగా అర్థంఅయ్యేటట్టు వుండాలి. కానీ, దారానికి పూసలు గుచ్చినట్టు, అక్షరాలన్నిటినీ, వాటి మధ్య ఖాళీలు లేకుండా ఒకే వరసగా పెట్టేస్తారు.

ఒకటో తరగతి తెలుగు వాచకంలో, అచ్చుల వరస అంతా కిక్కిరిసిపోయి, ఇలా పెడతారు:

అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఌ ౡ ఎ ఏ ఐ ఒ ఓ ఔ అం అః

ఈ అక్షరాల్ని చూస్తే పిల్లలకి ఏం అర్థం అవుతుంది? అప్పుడే బడికి వచ్చి, జడుస్తూ చదువు ప్రారంభించిన అమాయ కులు వాళ్ళు!

అచ్చు అక్షరాలు, కొన్ని జతలుగా ఉండాలి. ఏ రెండేసి అక్ష రాలు ఒక జతగా వున్నాయో, అలా ఆ జతల్ని విద్యార్థులకు విడి విడిగా చూపించాలి. అలాగాక, ఒకే వరసగా, మొదటి అక్షరం వెంట ఇతర అక్షరాల్ని అంటించి రాస్తే, అక్షరాల జతలు ఎలా అర్థం అవుతాయి?

"అ ఆ" లను చూస్తే, ఈ 2 అక్షరాలకూ వున్న శబ్దం ఒకే రకం. రెండూ "అ" శబ్దాలే. మొదటి అక్షరం, పొట్టి శబ్దం. రెండో అక్షరం, పొడుగు శబ్దం. ఈ 2 అక్షరాలూ కలిసి, ఒక జత. ఇవి, ఒక జంట శబ్దాలు. కాబట్టి, ఈ 2 అక్షరాల్నీ ఒక "జత" గా వున్నట్టు రాసి చూపించి, పిల్లలకి చెప్పాలి. అలాగే, **"ఇ ఈ"** లు కూడా ఒకే రకం శబ్దాలు గల జత. మొదటిది పొట్టీ, రెండోది పొడుగూ. అలాగే, **"ఉ ఊ"** లు కూడా ఒకే శబ్దాలు గల జత. అలాగే, మిగతావీ.

పిల్లలకి, అక్షరాల్ని చూపించేటప్పుడు, ఏ జతకి ఆ జత వేరు వేరుగా అర్థం అయ్యే లాగ వాటిని రాయాలి.

"అ ఆ – ఇ ఈ – ఉ ఊ" ఈ రకంగా. ఈ జతల్ని చూపిం చవలసిన పద్ధతి, అచ్చుల్లోనే కాదు, హల్లుల్లోనూ వుంది. అది తర్వాత. – "అచ్చుల" సంగతులు ఇంకా కొన్ని చూడాలి.

2. "అచ్చులు" అనే వాటిలో, **"ఋ ౠ"** (రు, రూ) అనేవీ, "ఌ ౡ " (లు, లూ) అనేవీ; వుంటాయి. ఇవి, అసలు, అచ్చులు కాలేవు. ఎందుకు? –**"అచ్చు అక్షరం"** అంటే, అందులో ఒక్క శబ్దమే వుండాలి. **"అ"** లో చూడండి, ఒక్క శబ్దమే! **"ఆ"** లో

కూడా ఒక్క శబ్దమే. **"ఇ"** లో గానీ, **"ఉ"** లో గానీ, **'ఎ'** లో గానీ, ఒక్కొక్క శబ్దాలే. కానీ, **"ఋ"** ని చూస్తే, దీన్ని **"రు"** అని చద వాలి. **"రు"** అంటే, **"ర్.ఉ=రు"** అవుతుంది. అంటే, "ఋ" లో, 2 శబ్దాలు వున్నట్టు అవుతుంది. 2 శబ్దాలు వుంటే, అది అచ్చు అక్షరం కాలేదు. "ఋ" ని, "అరు" అని కూడా చదువుతారు. అలా చదివితే, అది "అ+ర్+ఉ=అరు' గా, 3 శబ్దాలుగా అయి పోతుంది!

" ఌ " ని చూస్తే, దీన్ని **"లు"** అని చదవాలి. "లు" అంటే, "ల్+ఉ=లు" అవుతుంది. దీన్ని "అలు" అని కూడా చదువుతారు. అలాగైతే, అది 3 శబ్దాలు అవుతుంది. ఇలాంటి అక్షరాలు, అచ్చులు ఎలా అవుతాయి? కాబట్టి, "ఋ ౠ" లు గానీ, "ఌ ౡ" లు గానీ, అచ్చు అక్షరాలు కాలేవు. – ఈ 4 అక్షరాల్నీ అచ్చుల్లో నించి తీసి వెయ్యాలి. ఇప్పటికే, ' ఌ ౡ ' లు లేవు. కానీ, **'ఋ'** అనేది ఇంకా వుంది అక్షర మాలలో! వీటిని అచ్చుల్లో నించి తీసివేసినా, ఇవి హల్లుల్లో పెట్టడానికి కూడా పనికిరావు. అది ఎందుకో తర్వాత చూద్దాం.

3. "హల్లుల" సంగతి: "క" ని హల్లు అంటాం. "క" లో శబ్దాల్ని చూడండి! "క్+అ=క". ఈ శబ్దాల్లో, "క్" అనేది మాత్రమే హల్లు! ఇది నిండు శబ్దం కాదు; సగం శబ్దమే. ఈ సగం శబ్దానికి, ఏదైనా ఒక "అచ్చు శబ్దం" చేరితేనే అది నిండు శబ్దం అవు తుంది. "క్" కి, "అ" అచ్చు శబ్దం చేరడంవల్లే అది, "క" అయింది. "క్" కి, "ఆ" శబ్దం చేరితే, "కా" అవుతుంది. "ఇ" శబ్దం చేరితే, "కి" అవుతుంది.

క్ + అ=క	**గ్ + అ=గ**
క్ + ఆ=కా	**గ్ + ఆ=గా**
క్+ ఇ = కి	**గ్ + ఇ =గి**
క్ +ఈ = కీ	**గ్ + ఈ =గీ**

ఏ అచ్చు శబ్దమూ చేరకుండా, సగం శబ్దంతో వుండిపోయే అక్షరమే హల్లు! అది నిండుగా పలకాలంటే, దానికి అచ్చు శబ్దం చేరవలిసిందే.

4. "ఋ" అక్షరం, అచ్చు అవదని చూశాం. అది, హల్లు అయినా అవుతుందో లేదో చూడాలి.

"ఋ(రు)" అనేది, సగం శబ్దం తోనే వుందా? సగం శబ్దం తోనే కాదు; "అ, ఆ" ల లాగ ఒక్క శబ్దంతో అయినా కాదు; "ర్+ఉ" గా, 2 శబ్దాలతో వుంది. అలాంటి అక్షరం, హల్లు కూడా అవదు.

"క"లో నించి "క్" అనే హల్లు రూపాన్ని తీసినట్టు, "ఋ"లో నించి "ఋ్" అనే హల్లుని తియ్య గలమా? – 'ఋ్' లాంటి హల్లు అక్షరం వుందా? లేదు. తర్వాత," ఌ " ని చూద్దాం.

" ఌ " సంగతి కూడా "ఋ" లాంటిదే. " ఌ " ని "లు" అనాలికదా? అంటే, ఇది, "ల్+ఉ"గా, 2 శబ్దాలతో వుంటుంది. ఇది, "క్" లాంటి హల్లు ఎలా అవుతుంది? " ఌ" ని హల్లు రూపం తో చెయ్యడం సాధ్యమే కాదు. అంటే, "ఋ ౠ"లు గానీ, " ఌ ౡ "లు గానీ, అచ్చులు కానట్టే, హల్లులు కూడా కాలేవు.

5. అసలు, ఒక "అక్షరం" అంటే అది, అచ్చుల్లోకి గానీ, హల్లుల్లోకి గానీ, చేరేదిగా వుండాలి. అలా కానిది అయితే, అది అసలు "అక్షరమే" అవదు. అది, తర్కం లేకుండా, తప్పుగా తయారుచేసిన గీతలు మాత్రమే అవుతుంది.

మరి, ఆ రకం గీతల్ని "అక్షరాలు"గా "అక్షర మాల"లో ఎందుకు పెట్టారు? ఏమో! వెనకటి పండితులు అలా ఆలోచిం చారు.

6. తెలుగులో, "రుషి" అని రాయగలిగే మాటని, "ఋషి" అని రాస్తూ వుంటారు. అంటే, "ఋ" అనే అక్షరానికి "రు" శబ్దం వున్నట్టే కదా? "ఋ"కి, "రు" శబ్దమే వుంటే, "రు" శబ్దం, అచ్చుల్లోకి గానీ, హల్లుల్లోకి గానీ, చేరేది అవుతుందా? ఆ 2 చోట్లా వుండడానికి వీలు కాని అక్షరం, అసలు 'అక్షంమాల'లో వుండగల అక్షర మేనా?

"ఋ" అనే అక్షరానికి "రు" శబ్దమే వున్నప్పటికీ, "ఋషి" అన డానికీ, "రుషి" అనడానికీ, ఆ "రు" శబ్దాల్లో, చాలా తేడాలు వున్నట్టు చెపుతారు! ఆ తేడాలు, సంస్కృతం శబ్దాల్లో ఏమైనా వుంటే వుండొచ్చు. ఆ తేడాలు అక్కడ వుంటాయేమో గానీ, తెలుగులో వుండవు. అలాంటి సంస్కృతం శబ్దాలు, తెలుగుకి ఎందుకు? (చాలా సంస్కృత శబ్దాలూ, మాటలూ, తెలుగులో కూడా వుంటాయి. ఆ సందర్భాలు వేరు.)

తెలుగు భాష నేర్చుకునే పిల్లలకి, "రు" వుండగా, "ఋ"ని కూడా చూపించి, "ఋ"ని కూడా "రు"గానే చెప్తే, (ఆ "రు" శబ్దాల్ని ఎంత తేడాగా చెప్పినా), విద్యార్థులు గందరగోళ పడి పోతారు. ఆ శబ్దాల్ని తేడాలతో పలకలేరు.

7.హల్లుల్లోనించి కూడా నాలుగైదు అక్షరాల్ని తీసివె య్యాలి. మొదట "ఙ, ఞ" అనే అక్షరాల్ని చూడాలి. "ఙ"ని "ఇన్య అని చదువుతాం. "న్య" అంటే, అది సంయుక్తాక్షరం. "ఇన్య"లో వున్న మొత్తం శబ్దాల్ని చూస్తే, "ఇ+న్+య్+అ" గా, 4 శబ్దాలు అవుతాయి. 4 శబ్దాలతో వుండే అక్షరం, హల్లు అక్ష రమా?– నవ్వాలి!

"ఞ"ని అయితే, "ఇణి" అని చదవాలి. ఇందులో శబ్దాల్ని చూస్తే, "ఇ+ణ్+ఇ" – ఇవి 3 శబ్దాలు. ఏమిటీ ఈ అక్షరాలు? పిల్లలకి నేర్పేటప్పుడు, "క, చ, ట, త, ప" లాంటి తేలిక అక్ష రాల్ని నేర్పినట్టుగా, "ఙ, ఞ"ల్ని నేర్పడం సాధ్యమేనా? సాధ్యమా కాదా – అని కాదు. అసలు అవి, హల్లులుగా వుండే అక్షరాలా? అవి, అలా వుండడానికి పనికిరాని అక్షరాలు. కాబట్టి, **"అక్ష రమాల"** నించీ, ఈ అక్షరాల్ని కూడా తీసివెయ్యాలి.

8. అంతే కాదు. హల్లులభాగంలో, "క్ష, త్ర" అనే అక్షరాలు

కూడా వుంటాయి. అవి ఇప్పుడు లేకపోయినా, ఈ అక్షరాలు మా చిన్నప్పుడు వుండేవి. ఇవి, సంయుక్తాక్షరాలు. "వాచకం"లో వున్న పాఠాల్లో చిట్ట చివరికి వెళ్ళాకే సంయుక్తా క్షరాల్ని చదవడం జరగాలి. అలాంటి అక్షరాల్ని తెచ్చి అక్షంమాలలో ఎలా పెట్టారో ఆశ్చర్యం! అక్షంమాలని సంయుక్తాక్షరాలతో నింపాలంటే, ఇంకా లక్ష సంయుక్తాక్షరాల్ని తెచ్చి అక్షంమాలలో పెట్టవచ్చు! అది ఎంత హాస్యాస్పదమో, "క్ష, త్ర" ల్ని పెట్టడం కూడా అలాం టిదే. కాబట్టి, ఈ రెంటినీ కూడా, హల్లుల్లో ఇంకా వుంటే, తీసి వెయ్యాలి.

9. తర్వాత, "ఱ"ని చూడాలి! దీన్ని "బండీ ర" అంటాం. తెలుగులో, "ర" వుండగా, ఈ "ఱ" ఎందుకు? "గుర్రము" అని రాస్తే, అది గుర్రం కాకుండా పోతుందా? "గుఱ్ఱం" అని రాస్తే గానీ, అది "గుర్రం" అవదా? తెలుగు శబ్దాల్లో "ర"కీ, "ఱ"కీ, తేడా ఏమిటో పిల్లలకి బోధించగలమా? – బోధించినా, ఆ బోధన దండగే. ఆ బోధన అక్కరలేదు. కాబట్టి, "ఱ"ని కూడా తీసివెయ్యాలి. – ఈ రకంగా, కొన్ని అక్షరాల్ని వదిలివేస్తే, "అక్షర మాల" తేలిక అవుతుంది. పిల్లలు హాయిగా చదువుకుంటారు.

10. "కి కీ, గి గీ, చి చీ" – ఇలా, హల్లుల మీద అచ్చు శబ్దాల గుర్తులు వచ్చేటప్పుడు, అన్ని హల్లు లకూ 'ఒకే నియమం' వుండాలి కదా! "మ" విషయం చూడండి; "య" విషయం కూడా చూడండి!

'మ' మీద, 'ఇ ఈ' శబ్దాలు రావాలంటే, "**మి, మీ**" అని రావాలి. కానీ, "**మి మీ**" అని వస్తాయి. 'కీ' లాగే 'మీ' రావాలి కదా? కానీ, 'మీ' అని వస్తే, 'మ' మీద 'ఇ' గుర్తు ఒక చోటా, 'ఈ' గుర్తు ఇంకో చోటా వచ్చినట్టు అవదూ? అంతే గాక, 'ా' అనే గుర్తు, 'ఆ' గుర్తు అవుతుంది గానీ, 'ఈ' గుర్తు ఎలా అవుతుంది? – పిల్లలకి, శబ్దాల గుర్తుల్ని నేర్పడం, అస్తవ్యస్తంగా వుండొచ్చా?

'య' మీద, 'ఇ, ఈ' గుర్తులు ఎలా రావాలి? 'క' కి ఎలా వస్తాయో అలాగే రావాలి కదా? 'య' మీద, 'ఇ' గుర్తు రావా లంటే, తలకట్టు తీసేసి అక్కడ బోడిగా వుంచడమా; అక్కడ 'గుడి' పెట్టడమా? **'యి', 'యీ'** అని రావాలి.

నెత్తి మీద 'గుడి' రాకపోతే, అది 'ఇ' శబ్దం ఎలా అవు తుంది. 'య' హల్లుకి తలకట్టు తీసేసి, చివర్లో 'ా' గుర్తు పెడితే, అది 'ఈ' శబ్దం అవుతుందని పిల్లలకి నేర్పాలా?

అప్పుడే అక్షరాలు నేర్చుకోడం మొదలుపెట్టిన పిల్లలకి, అక్షరాల మధ్య ఒకే నియమాలు లేకుండా ఎలాబడితే అలా చెప్తే, వాళ్ళు ఎలా అర్థం చేసుకోవాలి. పదో తరగతి పిల్లలకి కూడా అక్షరాలు సరిగా రాకపోవడానికి ఇలాంటి కారణాలు బోలెడు వున్నాయి!

11. ఇంకో ఇబ్బంది వుంది. ఒక హల్లు అక్షరానికి "ఒ" శబ్దం రావా లంటే, అన్ని హల్లుల దగ్గిరా ఒకే నియమం ఉండాలి కదా? "కొ, గొ, రొ, లొ" – ఇలా. కానీ, "మ" దగ్గిరా, "య" దగ్గిరా కూడా, అలాగే ఎందుకు ఉండవు?

"మ"కి, ఒ – శబ్దం రావాలంటే, "**మొ**" అని రావాలి కదా? కానీ, అలా రాదు. "మొ" అని వస్తుంది. "కొ, గొ" లుగా అన్నిటికీ వుండే నియమం ఏమైంది? అది, "మ"కి ఎందుకు రాదు?

"**య**"కి, ఒ – శబ్దం రావాలంటే, **యొ** – అని రాదు. "యొ"గా వస్తుంది. అన్ని అక్షరా లకీ ఒకే నియమం వుండ కుండా దాన్ని దాటవేసే పద్ధతి ఎందుకు? ఇది, విద్యార్థుల్ని ఇబ్బంది పెడు తుందా, తేలిక చేస్తుందా?

12. హల్లుల్లో ఏ అక్షరాల్ని అయినా ఒత్తుతో రాయాలంటే, హల్లులన్నిటికీ ఒకే నియమం ఉండాలా లేదా? ఉండాలి కదా? "చ ఛ" ల్ని చూస్తే, ఏం తెలుస్తోంది? మొదటిగా వున్న "చ" – తేలికగా పలికే అక్షరం. రెండో "ఛ" – బరువుగా పలికే అక్షరం. తేలిక అక్షరానికి ఒత్తు పడితే, అది బరువు అక్షరం అయిపో యింది! అప్పుడు, ఆ 2 అక్షరాలూ ఒకే జతగా, "చ ఛ" లుగా, ఒకే రూపంతో ఉంటాయి. వాటిలో మొదటిది తేలిక శబ్దం; రెండోది బరువు శబ్దం! ఇలాగే, చక్కగా ఇదే నియమంతో ఇంకా కూడా వున్న అక్షరాల జతల్ని చూడండి!

"ప ఫ; డ ఢ; ద ధ; బ భ" – ఈ జంటలన్నిటికీ ఒత్తుల నియమాలు ఒక్కలాగే వున్నాయి. తేలిక అక్షరానికే ఒత్తు పెడితే, అది బరువు అక్షరం (బరువు శబ్దం) అయిపోతుంది. అయితే, "**భ**" విషయంలోమాత్రం, తలకట్టుగా ఒక అదనపు గీత కలి సింది, చూడండి! తేలిక అక్షరం ఎలా వుందో, రెండో అక్షరం కూడా అలాగే వుంటూ, దానికి ఒత్తు మాత్రమే రావాలి. అది బరువు శబ్దం అవుతుంది. అంతే కదా? తేలిక "బ"కి తలకట్టు లేదు. బరువు "**భ**"కి తలకట్టు ఎందుకు? ఒత్తు పెడితే, "**భ**" అవదా? "**బ, భ**" అంటే, మొదటిది తేలికా, రెండోది బరువూ! తేలిక దానికి లేని తల కట్టుని, రెండో దానికి పెడితే, అది కొత్త రూపం అయిపోదూ? అక్షరాలకు గీతలు ఎంత తక్కు వగా వుంటే, వాటిని నేర్పడం, అంత తేలిక కదా? "**భ, భ**"లలో ఏది రాయడం తేలిక? "భ"యే తేలిక. "భ"లో తర్కం వుంది. "భ" లో తర్కం లేదు. ఎలా బడితే అలా చెప్పి, – పిల్లల్ని పీడించ డమే చెయ్యాలా?

13. "ఒత్తు" అక్షరం గురించి ఇంకో విషయం. "చ"కి ఒత్తు పెడితే, "ఛ" అయింది. రెండూ "చ ఛ" రూపాలతోనే అయ్యాయి. "క" విషయం అలాగే ఎందుకు వుండకూడదు? అన్ని అక్షరాలకీ ఒకే నియమం వుండాలి కదా? "క"ని బరువు చెయ్యాలంటే, "క క" అని రాయకూడదా? "క ఖ"గా రాయడం ఎందుకు? "క" పక్కన, "ఖ" అని కొత్త ఆకారంతో, కొత్త అక్ష రాన్ని తెచ్చి పెడితే, ఇది "కొత్త నియమం" అయిపోదూ? "క"ని, బరువుగా పలకాలంటే, దానికే ఒత్తు పెడితే చాలదా? "చ ఛ – లాగే, క క"– లు ఎందుకు రాయ కూడదు?" – అని పిల్లలు

అడిగితే, టీచరు ఏం చెప్పాలి? అసలు, వాళ్ళని అలా అడగమని వాళ్ళకి టీచరే నేర్పాలి కదా? పిల్లలు అలా అడిగితే, టీచరు తెల్ల మొహం వెయ్యాలా? వాళ్ళని "నోళ్ళు ముయ్యండి!" అనాలా? – ఈ రెండూ చెయ్య కూడదు కదా?

తర్వాత, "గ" సంగతి చూడండి! 'ఛ' ని రాసినట్టుగా, 'గ' ని ఒత్తుతో రాయాలంటే, ఒత్తు గీతని 'గ' మీద, అడ్డంగానో, నిలువుగానో, ఎలా వీలయితే, అలా చెయ్యవచ్చు.

'గ' ఇలా! లేదా, 'గ' ఇలా. ఇది, నేర్చుకునే వాళ్ళకి ఎంతో తేలిక. ఇలా గాక, 'ఒత్తూ గ' ని, వేరే ఆకారంతో, 'ఘ' అని రాస్తే, అది, "గ" శబ్దంతోనే వున్నట్టు కనపడదు. కాబట్టి, బరువు అక్షరానికి కూడా, తేలిక అక్షరానికి వుండే రూపమే వుండాలి. కాబట్టి "గ ఘ" అని కాకుండా, "గ గ" అని రాస్తే ఎంత తేలికగానో అర్థం అవుతుంది. 'గ' ని చూపించి, "ఈ అక్షరం ఏమిటి?" అని అడిగితే, పిల్లలు ఉత్సాహంగా, "బరువు–గ" అని అరుస్తూ చెప్పేస్తారు. కానీ "ఘ" ని చూపిస్తే, నోళ్ళు విప్పరు.

14. "ట" సంగతీ, "త" సంగతీ, "జ" సంగతీ, కూడా చూడండి! "చ ఛ" నియమం ప్రకారమే వాటిని కూడా చేస్తే? – ట ట, త త, జ జ – ఇలా వస్తాయి.

ఇలా వుంటే, పిల్లలు, మొత్తం అక్షరాల్ని వారం రోజుల్లో నేర్చేసు కుంటారు. కానీ, కొత్త నియమం వల్ల ఎంత కష్టం! అప్పుడు ఇలా వుంటాయి: ట ఠ, త థ, జ ఝ – ఇలా!

"థ"నీ, "ఝ"నీ, చూపించి, "ఈ అక్షరాలు ఏమిటి?" అని పదో క్లాసు పిల్లల్ని అడగండి, చెప్పగలరేమో! "ఠ" ని చూపిస్తే, "ర, ర" అంటారు. అలాగాక, "ట, ట" ల్ని, చూపిస్తే? "త, త" ల్ని, "జ, జ" ల్ని, చూపిస్తే? అతి తేలిగ్గా చెప్పేస్తారు. తేలిక అక్షరమూ, బరువు అక్షరమూ, "ఒకే రూపంతో వుండడంలో" ఒక తర్కం వుంది! ప్రతీ అక్షరానికీ, ఒకే నియమం పాటిస్తే, అక్షరాలు నేర్చుకోడం అతి తేలిక.

15. "కథ" అనే మాటని మనం అలాగే అంటాం. సంస్కృతంలో అయితే, "కథ" అంటారేమో! అది మనకెందుకు? "థ" ని ఒక్కదాన్నే విడిగా రాసి చూపిస్తే, దాన్ని చాలా మంది పెద్దవాళ్ళు కూడా "త" శబ్దంతో చదవరు. దాన్ని "ధ" అనేస్తారు.

"ఝ" ని చూపిస్తే, దాన్ని పిల్లలు, "ఒత్తూ జ" గా అనుకుంటారా? కంగారు పడతారు. ఎవరైనా కొంచెం అనుమానంగా చదివితే, దాన్ని "జు, జు" అంటారు. "ఝూన్సీ" అనే మాటని, పిల్లలు "జూన్సీ" అని చదవడం చూశాను. పిల్లలే కాదు, నేనే అలా చదువుతాను! ఆ అక్షరం తెచ్చే సమస్య అది!

"ఝ" ని రాసేటప్పుడు, ఆ అక్షరానికి పెట్టే ఒత్తు, ఎక్కడ వుండాలో ప్రతీసారీ అనుమానం వస్తుంది పిల్లలకి. నాకు కూడా! ఆ ఒత్తు, "ర" దగ్గిర వుండాలా, కొమ్ముల మధ్య వుండాలా? అసలు ఎన్ని కొమ్ములు వుండాలి? రెండా, మూడా?–అన్నీ అనుమానాలే! **"జ ఝ"** లు అయితే అనుమానాలే రావు కదా?

16. పిల్లలకి చదవడం – రాయడం, చక చకా రాకపోవడానికి కారణం, అక్షరాల్లో వున్న ఇబ్బందులే. ఇంగ్లీషు భాషలో అయితే, స్పెల్లింగుల్లో బోలెడు తలనొప్పులు వున్నాయి అనుకుంటాం. తెలుగులోనూ అలాంటి తల నొప్పులే వున్నాయి.

ప్రారంభ కాలంలో, అక్షరాల్ని కనిపెట్టిన వాళ్ళు, కొన్ని పొరపాట్లు చేసి వుండవచ్చు. తర్వాత కాలం వాళ్ళు, వాటిని సరిచేసుకోకూడదా?

17. అయితే ఒక ప్రశ్న వస్తుంది. "ట ఠ" ల్ని, "ట ట" లుగా ఇప్పుడు మార్చుతామనుకుందాం. అలాగే, ఇతరమార్పుల్ని కూడా! అయితే, మార్చిన కొత్త పద్ధతిలో చదివే పిల్లలు, ఇంతకు ముందు వున్న పుస్తకాలు చదివేటప్పుడు, వాటిల్లో, అక్షరాల్ని వేరే రకంగా చూస్తారు కదా? ఒక పుస్తకంలో, "కంఠము" అని చూస్తారనుకుందాం. కానీ, వాళ్ళకి "ఠ" తెలీదు. ఆ మాటని కొత్త పద్ధతి ప్రకారం, "కంటము" అని నేర్చు కుని వుంటారు. వాళ్ళు "కంఠము"ని ఎలా చదవగలరు? అలాగే, ఆ పుస్తకాల్లో, వాళ్ళకి తెలియని "థ, ఝ, ఙ, ఞ, ము, యి" అనే అక్షరాలు కూడా వుంటాయి. ఆ అక్షరాలు తెలియనివాళ్ళు, ఆ మాటలు ఎలా చదవాలి? – ఇదీ ప్రశ్న.

జవాబు: కొత్త పద్ధతి ప్రకారమే నేర్పేటప్పుడు, "పాత అక్షరాలు ఇలా ఇలా వుంటాయి. వాటిని చూసి కంగారు పడ కూడదు" అని చెపుతూ, పాత అక్షరమాలలో వుండే పాత అక్షరాలన్నిటినీ కూడా, చూపిస్తాము. కొన్నిసార్లు అలా చూపించి చెప్తే చాలు. ఇతర పుస్తకాలు చదివేటప్పుడు వాటిల్లో, "కంఠము, ముఖము, ఝాన్సీ" వంటి మాటల్ని చూస్తే, వాటిని కూడా చదవ గలరు. కానీ, తమ క్లాసు చదువుల్లో, ఆ పాత అక్షరాలు రాయ వలసిన అవసరం వుండదు పిల్లలకి. **"కఠినము"** అని కనపడ్డప్పుడు, "ఓ హో! ఇది, **'కటినము'** అన్నమాట! ఇది వరకు అలా "ఠ" తో రాశారు" అని దాన్ని అర్థం చేసుకుంటారు.

18. తెలుగు "అక్షర మాల" ని సంస్కరించాలంటే, దానికి 2 మార్పులు జరగాలి. **(1)** అచ్చుల్లో నించి 4 అక్ష రాల్నీ, హల్లుల్లో నించి కూడా కొన్ని అక్షరాల్నీ, తీసివెయ్యాలి. అప్పటి నించీ అక్షర మాల అనవసరపు, తప్పు అక్షరాలు లేకుండా తేలిక అవుతుంది. **(2)** ఒత్తు అక్షరాల్ని రాసే విషయంలోనూ, కొన్ని శబ్దాల్ని రాసే విషయంలోనూ, హల్లుల్లో ప్రతీ దానికీ, ఒకే నియమం పాటించాలి. – ఈ 2 మార్పులూ చేసుకుంటే, పిల్లలు, తెలుగు నేర్చు కోవడం చురుగ్గా చేస్తారు. "వెనకటి కాలపు విషయాల్ని మార్చనే కూడదు" అనుకోకూడదు.

19. నేను, **"ఒకటవ తరగతి తెలుగు వాచకము"** రాసినప్పుడు, "అక్షర మాల'లో నించి 10 అక్షరాలు తీసివేశాను. హల్లుల్లో నించి "ఙ, ఞ" అక్షరాల్ని కూడా. వాటిని అలా తిరస్కరించిన నేను, "జ్ఞానము" అని రాయవలిసి వచ్చినప్పుడు, "ఞ(ఇఞి)ని" అప్పు డప్పుడూ వాడే తప్పు చేస్తూనే వున్నాను.

అదే మాటని కొన్ని సార్లు "గ్న్యానము" అని కూడా రాస్తున్నాను. "జ్ఞానము" అని రాసినా, దాన్ని "జా" శబ్దంతో పలకం. "గా" శబ్దంతోనే మొదలుపెడతాం. "జ్ఞా"లో వున్న శబ్దాలు = గ్+న్+య్+ఆ=గ్న్యా. "జ్ఞా" ని, "గ్న్యా" అని రాస్తే, ఏమీ తప్పుకాదు.

నేను, "ఞ" ని కూడా వదిలేశాను కదా? కానీ దాన్ని "జ్ఞా" అని రాసేటప్పుడు వాడుతున్నాను. "నువ్వు వదిలేసిన అక్షరం తోనే ఆ మాట ఎందుకు రాస్తున్నావు?" అని నన్ను ఇప్పటి వరకూ ఎవ్వరూ అడగలేదు. ఎవ్వరూ అడగక పోయినా, నన్ను నేనే అడుగుకుంటున్నాను. అది పాత అలవాటు, అంతే! అంతే గానీ, "ఞ (ఇణి)"ని అక్షర మాలలో వుంచాలని కాదు. ఇక, "ఞ"ని వాడడం మానేస్తాను. అంటే, "జ్ఞా" ని అలా రాయడం మానెయ్యాలి.

20. "మ్రుగము" అనే మాటలో, 'మ్రు'ని చూడండి. ఇది, సంయుక్తా క్షరం. 'మ్రు' లో శబ్దాలు, 'మ్+ర్+ఉ.' ఇదే అక్షరాన్ని, "మృ" గా రాసే పద్ధతి కూడా వుంది. "ృ" అనే గుర్తు, "ఋ" అనే అక్షరానికి సంబంధించిన గుర్తు. "ృ" ఈ గుర్తులో శబ్దాలు = ర్+ఉ. అంటే, "మ్రు" అన్నా, "మృ" అన్నా, శబ్దాలు ఒకటే. అయితే, "ఋ" అనే అక్షరాన్ని వదిలేసినప్పుడు, దానికి సంబం ధించిన గుర్తుని ఎలా వాడతాం? అంటే, 'ృ' ఈ గుర్తు వాడకాన్ని కూడా వదిలెయ్యవలిసిందే కదా? కానీ, ఈ గుర్తు వల్ల, అక్షరం పక్కన చోటు తగ్గుతుంది. రాయడం తేలిక అవుతుంది.

గృహము = గ్రుహము

మృగము = మ్రుగము

చంధ్రుడు = చంద్రుడు

కౄరము = క్రూరము

పిల్లలకి ఈ గుర్తుల్ని నేర్పేటప్పుడు ఈ విషయాలన్నీ చెప్పాలి. 'చోటు' సంగతి పట్టించుకోకపోతే, "గ్రుహము" అని రాయడం, పిల్లలకు తేలికగా వుంటుంది. "గృ" అనే అక్షరంలో అర్థాల్ని సరిగా అర్థం చేసుకోకపోవచ్చు.

నాకు, చిన్నప్పట్నించీ వున్న అలవాటు వల్ల, "గ్రుహము" అని గాక, "గృహము" అని రాయడమే ఇష్టంగా వుంటుంది. కానీ, కొత్తగా నేర్చుకునే పిల్లలకి ఇది అనవసరమే. అయితే, ఇప్పటికి వున్న పుస్తకాల్లో పిల్లలు, "గృహము, మృగము" వంటి మాటల్ని కూడా చూస్తారు కాబట్టి, ఈ గుర్తుల గురించి తప్ప కుండా వివరించాలి.

నా పుస్తకాల్లో, "ఖ, ఘ, ఝ" – ల్ని వాడడం మానివేసి, వాటిని, "క, గ, జ" లుగా రాయాలని చాలా ప్రయత్నించాను. కానీ, కంప్యూటర్‌లో కంపోజ్ అయ్యే ఏ రకం టైపులోనూ, నేను అనుకునే కొత్త అక్షరాలు వుండవు – అంటారు, కంపోజ్ చేసే వారు. "ఠ – ని పెట్టగలం గానీ, ట – ని పెట్టలేం" అంటారు. ఈ వ్యాసంలో, శాంపిల్‌గా చూపించడం కోసం మాత్రమే కంపోజి టర్, కొత్త అక్షరాల్ని ఎక్కువ ప్రయత్నాలతో పెట్టింది. మొదట "ట" ని పెట్టి, దానికి ఒత్తు తెచ్చి పెట్టింది. అలా పెట్టవచ్చు గానీ, ఆ అక్షరానికి సైజు మారిస్తే ఒత్తు ఇటో అటో పోతూ వుంటుంది. అసలైతే ఒత్తు అక్షరం కావాలంటే ఒత్తుతో తయారైన అక్షరమే వుండాలి. ట, జ, త లాంటి అక్షరాలు ఒత్తులతో తయారై లేవు కాబట్టి వాటిని ఇప్పుడు పెట్టడం కుదరదు. ఆ టైపుని తయారు చేసినవాళ్ళు, 'ట' కిందనే ఒత్తు పడేలాగ తయారుచేసి వుంచలేదు కాబట్టి. ప్రతీ కొత్త అక్షరం వచ్చినప్పుడల్లా దానికోసం ప్రయత్నిం చాలంటే, అసలు పనే జరగదు. కాబట్టి, "క, థ, ఝ, తు" – ఇలాంటి అక్షరాలు ఒత్తులతో కావాలంటే, ఆ అక్షరాలతో ఒత్తులు కలిసే టైపు తయారై వుండాలి. "అటువంటి ఏర్పాట్లు లేవు" అంటారు కంపోజిటర్లు. చేసే వాళ్ళకి చెయ్యడం సాధ్యం కాన ప్పుడు, పాత "ఠ" ని వదిలేసి, కొత్త "ట" ని పెట్టుకుంటూ నా పుస్త కాల్లో రాయాలని నాకు ఎంత కోరిక వున్నా, అది ఎలా సాధ్యం?

"అక్షర మాల" లో నించి కొన్ని అక్షరాల్ని తీసివేసి, వాటిని వాడడం మానివేశాను గానీ, "ఠ, ఝ" లాంటి వాటిని వదిలె య్యడం సాధ్యం కావడంలేదు. అంటే, సంస్క రణని ఎక్కువ మంది అంగీకరించి, దానికి అవసరమైన ప్రయత్నాలు చెయ్యాలి గానీ, అది ఒంటరి వ్యక్తికి, ఒంటరిగా సాధ్యం కాదు.

దీని కోసం పత్రికల వారూ, ప్రభుత్వ అకాడమీలూ, భాషా శాస్త్రజ్ఞులూ, భాషాబోధకులూ, రచయితలూ, చర్చించి, ఒక అంగీకారానికి వచ్చి ప్రయత్నాలు ప్రారంభిస్తే, కొన్నాళ్ళకి సాధ్యం కావచ్చు. విషయాల్ని మరింత తేలిక చేసుకోవడం ఎంత మంచిది!

"ఝ" అన్నా, "థ" అన్నా, నాకు భలే కోపం! "మొ" మీదా, "యొ" మీదా కూడా ఒళ్ళు మండుతూ వుంటుంది. కానీ, అలాగే రాస్తాను, తప్పదు మరి! అక్షరాల విషయంలో ఒంటరి ఊహలు సాగవు.

డా॥వేదగిరి రాంబాబు
939134916

తెలుగునాడి : శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి



తెలుగుజాతి, భాషలపట్ల అభిమానంతో - సాహిత్య సహకారంతో - విశిష్ట సేవల్ని అందించిన అద్వితీయమూర్తి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, భాషా సాహిత్య సంబంధాలు క్షుణ్ణంగా తెలిసి, ఆ రెండు రంగాల్లోనూ అవిరళంగా జమిలి కృషి చేసిన మహావ్యక్తి ఆయన. "జనులకు స్వవిషయం చెప్పడం - ఆత్మగౌరవం అలవరచటం - సహనం కలిగించడం - సరికొత్త భావాలు మప్పడం - కొత్త ఆశలు రేకెత్తించడం - గతంలో వుండుకున్న సత్యం ఆవిష్కరించడం - భవిష్యత్తుకి కొత్త దారులు కల్పించడం - తన్మూలంగా దేశీయులందరికీ స్వయం నిర్ణయశక్తి కలిగించడం - ఇదీ నా పూనిక. ఇది నిర్విఘ్నంగా, నిరాఘాటంగానూ సాగడం నా లక్ష్యం. జాతికి, ప్రాతిపదికలకు భంగంలేని గమ్యం కనబరచడం నా్రపాప్యం" అంటూ ప్రకటించుకున్నారాయన.

1891 ఏప్రిల్ 23న తూర్పుగోదావరి జిల్లా రామచంద్రా పురం తాలూకా పొలమూరులో మహాలక్ష్మి సోదెమ్మ, లక్ష్మీపతి సోమయాజులు గారలకు జన్మించిన సుబ్రహ్మణ్యశాస్త్రి వైదిక విద్యతో విద్యాభ్యాసాన్ని ప్రారంభించి, స్మార్తం పూర్తిచేసి, పెద్దన్నగారి దగ్గర రఘువంశ పాఠమూ నేర్చారు. ఆయన దగ్గరే ఆ ఊరుకి చెందిన భట్రాజుల కుర్రవాడొకరు 'వసుచరిత్ర' చదువుకోవడం జూసి, నాకూ దీనిని నేర్పమని గురువుగారి నడిగారు. ఆయన ససేమిరా చెప్పనన్నారు.

"సంస్కృత సాహిత్య గ్రంథాలు పూర్తి చేసుకునే దాకా తెనుగు ప్రబంధాలు ముట్టుకోవద్ద"న్నారు. పెద్దన్నగారూ అదే మాటన్నారు. శ్రీపాదవారి మనసు తిరగబడ్డది. "తెనుగులో మంచి పాండిత్యం సంపాదించాలి" అని నిశ్చయించుకున్నారు. జాతి అంతా వ్యవహరించే మాతృభాషలోనే విశిష్ట శక్తి సంపాదించాలనుకున్నారు. రచనలూ చేయాలని నిశ్చయించుకున్నారు.

మాతృభాషలో ప్రాథమిక విద్య గరిపేట్లు చేయడానికి, మధ్య తరగతి ఆడవాళ్ళు ఇళ్ళలో మాట్లాడుకునే భాషలో రచనలు చేయడానికి ఆయనకి గిడుగు రామ్మూర్తిగారి ప్రేరణ ఎంతో ఉంది. గిడుగుతో పర్లాకిమిడిలో కలిసి 36 గంటలు భాష గురించి చర్చించిన ప్రభావం ఆయన మీదెంతో ఉంది. అలాగే కథకచక్రవర్తిగా ఆయన చేసిన కృషి వెనుక గురజాడ అప్పారావుగారి స్ఫూర్తీ ఎంతో ఉంది.

వారాలు చేసుకుంటూ చదువుకునే రోజుల్లో ఓ వృద్ధ వితంతువు కోరిక మీద ఆవిడకు మదనకామరాజు కథల్ని చదివి వినిపించేవారు. ఆ స్ఫూర్తితో ఆ తర్వాత అరేబియన్ నైట్స్ కథలు, చార్ దర్వేష్ కథలు, శుకసప్తతి కథలు, రేచుక్క - పగటి చుక్క వంటివి చదివారు. వాటి ప్రభావం ఆయన మీదెంతో ఉంది. తండ్రికి ఇష్టం లేని సంగీత విద్య మీద శ్రీపాదకి మోజు కలిగింది. వారణాసి సర్వదేవుడు దగ్గర వీణ, శిష్టు సర్వశాస్త్రి దగ్గర వయోలిన్ కొంతకాలం సాధన చేశారు. ఈ అనుభవంతోనే ఆయన ఆ తర్వాత కుమార్తె బాలాశ్రీకి సంగీతంనేర్పారు ఇంట్లోనే. ఎన్నోపాటలకి నొటేషన్స్ రాశారు.

శ్రీపాద వారి రచనా వ్యాసంగాన్ని పరీక్షిస్తే - తెలుగు భాషలో అక్షరాలు నేర్పడం దగ్గర నుంచి పిల్లల కథా పుస్తక రచన, బాల రామాయణం, శతకనీతి, వ్యాసభారతంలో కొన్ని పర్వాలు వచనంలో నేర్పడం వరకూ విస్తృతంగా సాగింది. మొదటి, రెండవ, మూడవ 'వసంతవాచకాల్ని' మధునాపంతుల సత్యనారాయణ, బూదూరు రామానుజుల రెడ్డిగార్ల సహకారంతో తీసుకువచ్చారు. వీటిద్వారా తెలుగు అక్షరాల్ని నేర్పడం దగ్గర నుంచి పదాలు, వాక్య నిర్మాణం, పాటలు, చిన్నకథలు తెలుసుకుంటారని ఆయన భావన. ఆ తర్వాత విజయనగర రాజుల కథలు, చిత్తూరు రాజుల కథలు, ఢిల్లీ చక్రవర్తుల కథలు, గోల్కొండ నవాబుల కథలు, ఓరుగంటి రాజుల కథలు, మర్యాదరామన్న కథలు, భేతాళ కథలు, విక్రమార్కుని కథలు, పురాణ గాథల ద్వారా పాఠశాలలో చదువుకునే వాళ్ళలో భాషపట్ల అభిమానాన్ని పెంచుతూ చరిత్రమీద అవగాహనని పెంచడానికి కృషి చేశారు.

శ్రీపాద నాటకాలు రాయడమే కాదు, శ్రీరామజననంలో సుమిత్ర పాత్ర, బొబ్బిలి యుద్ధంలో తాండ్రపాపారాయుడు, సారంగ ధరలో రాజరాజనరేంద్రుడు పాత్రలు కూడా వేశారు. నాటకాలకు దర్శకత్వం వహించేవారుకూడా. రాజమండ్రిలో, రాయవరం మిత్రులతో కలిసి కళాభివర్ధిని అనే సంస్థని ప్రారంభింపచేశారు. ఆ సంస్థ ద్వారా నాటకాలాడడం, పుస్తక ప్రచు రణ, సాహిత్య సభల్ని నిర్వహిం చడం, సాహితీ ప్రముఖుల్ని సత్కరిం చడం చేసేవారు. సాహిత్య విమర్శలోనూ ఆయనది అందెవేసిన చేయి. తిరుపతి వేంకట కవులు రచించిన పాణిగ్రహీత, శ్రవణా నందం కావ్యాల మీద శ్రీపాద రాసిన విమర్శాగ్రంథం ఆ రోజుల్లో పెద్ద సంచలనాన్ని సృష్టించింది. నిర్భయంగా, నిశితంగా, సప్రమా ణంగా ఉంటాయి ఆయన విమర్శలు.

తన సంపాదనలో సింహభాగం తెలుగు భాషా సాహిత్యాలకే పుస్తక ప్రచురణద్వారా వెచ్చించి, ముఖ్యంగా 'ప్రబుద్ధాంధ్ర' పత్రికను తీసుకురావడానికి ఎంతగానో శ్రమించి వ్యక్తిగతంగా ఎన్నో ఇబ్బందులకు లోనయ్యారు శ్రీపాదవారు, వారి భార్య సీతమ్మగారు.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి చిన్న కథల గురించి ముచ్చటించుకునే ముందు ఆయన సంపాదకత్వంలో, ఆయన వెలువరించిన 'ప్రబుద్ధాంధ్ర' గురించి కొద్దిగానైనా చెప్పుకోవాలి. ఇది కొన్నాళ్ళు పక్షపత్రికగా, కొన్నాళ్ళు మాసపత్రికగా వచ్చింది. మధ్యలో కొన్నాళ్ళు ఆయన అనారోగ్యం వల్ల ఆగిపోయింది. ఆ పత్రిక ఆధునిక తెలుగు సాహిత్యానికి, పరిశోధనకు, భాషకు పెద్దపీట వేసింది. వాడుక భాషని సమర్థిస్తూ ఇందులో ఎన్నో వ్యాసాలు ప్రచురించారు. మొదటి పుట నుంచి చిన్నకథ ప్రచురణ జరిగింది. చాలామంది రచయిత(త్రు)ల్ని ఈ పత్రిక ప్రోత్సహించింది. ని

'ప్రబుద్ధాంధ్ర'లో పద్యరచనల ప్రచురణకు కూడా శాస్త్రిగారు విముఖత చూపించారు. రచయిత (త్రు)లను పద్యాలు పంపవద్దనీ,

వచన రచనలే పంపమనీ ప్రకటన చేశారు. ఆ విధంగా సమాజ ప్రయోజన సిద్ధికి దారిని సుగమం చేశారు. తెలుగు, సంస్కృతం తప్ప ఆయనకు ఆంగ్లం రాకపోవడంతో, నుడికారపు సొంపు పెంపులతో చిక్కటి తెలుగులో రచనలు చేశారు.

మల్లాది రామకృష్ణశాస్త్రిగారు, "శ్రీపాదవారు చిన్న కథలుగా మనకు ఎన్నో కబుర్లు చెప్పారు. శ్రీపాదవారి చిన్న కథలు విని ఉండకపోతే, తెలుగుల ఉనికి అయోమయం. కొన్ని చిన్న కథలనైనా చదివితే తెలుగు కుటుంబాల ఆపేక్ష. అంతఃకరణలు ఎలాంటివో...ఆ మర్యాదలు, మన్ననలు ఎలాంటివో అర్థమవుతుంది. ఆశ్చర్యమేస్తుంది. ముచ్చటౌతుంది. చదువరులకు చదువు చెప్పగలిగినవి ఆయన రచనలు. విద్యాబుద్ధులున్న అహంకారులకు కనువిప్పు కలిగిస్తాయి. ఆయన వచనము తీయదనము. చవులిచ్చిన దాయన శైలి" అన్నారు.

1915లో గ్రంథ ప్రచురణ నిమిత్తం శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు మద్రాసు వెళ్లి ఆంధ్రపత్రిక కార్యాలయంలో బసచేశారట. అప్పటి ఆంధ్రపత్రిక దినపత్రిక సంపాదకులు కోటంరాజు పున్నయ్యగారు 'ఓ గంటలో నాకొక కథ రాసి'వ్వమని శాస్త్రిగారినడిగారట. శాస్త్రిగారు అప్పటికప్పుడు ఆంధ్రపత్రిక కార్యాలయంలో కూర్చుని రాసిచ్చిన కథ 'ఇరువురమొక్కచోటికేపోదము'. ఈ ప్రేమ కథలో ప్రేమికులిద్దరూ ఒకరితర్వాత మరొకరు ఓ నదిలో దూకి మరణిస్తారు. మొదటి కథ కాబట్టి భాషకూడా సరళ గ్రాంధికం. తర్వాత భాష మారింది.

'కొత్తచూపు' చిన్నకథ నిజంగా మనకి కొత్తచూపుని కలిగి స్తుంది. ఆ కథలో మగపెళ్లివారు ఆడపెళ్లివారిని రకరకాల కోరికలు కోరతారు. ఆడపెళ్ళివారు అన్నింటికీ అంగీకరిస్తారు. అప్పుడు పెళ్ళికూతురు అన్నపూర్ణ ఏమని ప్రశ్నిస్తుందంటే "నాకు జవాబు చెప్పండి. ఉత్తర భారత భూముల్లో - భారతీయ స్త్రీలెందరో మానభంగాలకు లోనయ్యారు. ఉత్తరాంధ్ర భూముల్లో మనవాళ్లెందరికో అలాంటిది తటస్థపడుతోంది. తెలుగు స్త్రీలకిది చావుబతుకుల సమస్య. మేమిది చూసీ చూడకుండా విడిచి పెట్టడానికి వల్లకాదు. మరి మీ కళ్ళయెదుట మీ ఆత్మీయులకున్నూ అలాంటిదే తటస్థపడితే, తరవాత మాట యేదయినా, ముందు కళ్ళు మూసుకుని శత్రువుల మీద పడగలరా?"

అంతేకాదు, అన్నపూర్ణ "తెనుగు కన్యలం మేమిప్పుడు చూసుకోవలసిన సరియోగ్యత చక్కదనం కాదు, చదువూ కాదు, ఐశ్వర్యం అసలు కానేకాదు. ఇవన్నీ తెనుగు యువతిని బానిసని చేశాయి. ఈ లక్షణాలున్న తెనుగు యువకులింతవరకు చక్రవర్తులుగా చెలామణి అయ్యారు. ఇలాంటివారు వివాహానికి అర్హులు కారు అనిపిస్తారు కూడా" అంటుంది.

అన్నమంతా పట్టుకు చూడనక్కర్లేదు. ఈ రెండు విషయాలు చాలు, శ్రీపాదవారు ఎంతటి స్త్రీ పక్షపాతో తెలుసుకోవడానికి. స్త్రీలు ఆత్మరక్షణకోసం సాము గారిడీలు లాంటివి నేర్వాలని ఆ రోజుల్లోనే చెప్పారు తమ చిన్న కథల ద్వారా శ్రీపాద. మధ్యతరగతి కుటుంబాలలో స్త్రీలు మాట్లాడుకునే భాషని వ్యావహారిక భాషగా తీసుకుని రచనలు చేశానని ఆయనే చెప్పుకున్నారు.

కుటుంబంలోని ఆపేక్షల్ని చెప్పే చిన్నకథ - కూతుళ్లతల్లి. తల్లి మనసుకి అద్దం ఈ చిన్నకథ.

సమాజంలోని కలుపు మొక్కల్ని ఎత్తి చూపిస్తూ, ఎలా ఏరివేయాలో చెప్పే గొప్ప చిన్నకథ 'కలుపు మొక్కలు'.

శ్రీపాదవారికి వీరేశలింగంగారంటే అపరిమితమైన అభిమానం. ఆ రోజుల్లో బాల్యవివాహాలు ఎక్కువ. ముసలివాళ్లతో పెళ్లిళ్ల జరగడం వల్ల చిన్నవయసులోనే భర్త చనిపోయి పుట్టింటికి చేరేవారు. అక్కడి పరిస్థితులు అంతకన్నా అధ్వాన్నంగా తయారయ్యేవి.

'అరికాళ్లకింద మంటలు' లో ఇలాంటి సమస్యని చిత్రించడమే కాదు, పరిష్కారమూ చెప్పారు.

'ఇలాంటి తవ్వాయి వస్తే...' దళిత వాదాన్ని సమర్థించే చిన్న కథ. దళితులని దూరం పెట్టడం తప్పని - తాగునీరు అందరి సొత్తనీ - అలాంటి చోట్ల వివక్ష పాటిస్తే మత మార్పిడులను ప్రోత్సహించినట్లవుతుందని హెచ్చరించారు, ఈ చిన్నకథతో.

అప్పట్లో కులాంతరాలే× కాదు, శాఖాంతర వివాహాలూ తప్పు. శాఖాభేదం లేదనడమే కాదు, రజస్వలానంతర వివాహాల్ని ప్రోత్సహిస్తూ శాస్త్రిగారు 'జూనియర్ కాదు. అల్లుడు' చిన్నకథని 1924లో రాసారు.

'అన్నంతపనీ జరిగింది' చిన్నకథ మూర్ఖ సమాజానికో మొట్టికాయ. అనవసరమైన విషయాల్లో అతిగా ఆలోచించే వాళ్లకు, వాళ్ళు అనుకున్నంత పనీ జరిగితే ఎలా వుంటుందో అందంగా చెప్పిన చిన్నకథ. తండ్రీ కూతుళ్లిద్దరికీ వేరువేరుగా పునర్వివాహాల్ని జరిపి తమ అభిలాషను వ్యక్తపరుస్తారు శాస్త్రిగారు.

చిన్న కథల్లోలాగే శ్రీపాదవారి నవలలలో కూడా ఎంతో వైవిధ్యముంది. ఆయన రాసిన మొదటి నవల మిథునానురాగము, ఔరంగజేబు కాలంలో జరిగినట్లుగా జనబాహుళ్యంలో వ్యాప్తిలో వున్న కథని కొంతమార్చి రాశారు. రెండవనవల'శ్మశానవాటిక'1917లో రాశారు.

'జాగ్రత్తపడవలసిన ఘట్టాలు'లో కేవలం సంభాషణలతో - పాతతరం అత్తగారికి, కొత్తతరం కోడలుకి అలవాట్లలో, ఆచారాల్లో అభిరుచుల్లో వున్న వైరుధ్యాన్ని చక్కగా చూపించారు.'చలిచీమలు' శాస్త్రిగారి ఆఖరి కథ.

శ్రీపాద వారిది ఎంత దూరదృష్టో వారి చిన్నకథలు మనకి చెబుతాయి. వారు రాసినవన్నీ చదివితే మన మనసు ఎంతో విశాలమవుతుంది. శ్రీపాదవారు రాసిన 75 పైగా చిన్న కథలూ సమాజంలోని పలు కుసంస్కారాల మీద దండయాత్ర చేసేవే! తెలుగు పలుకుబడితో, తెలుగు జీవితాల్ని మనముందుంచేవే!! తెలుగు వాళ్లందరూ చదవాల్సిన చిన్న కథలివి. మాట్లాడే భాషగా, సంభాషణ లతో కథని నడపడం ఆయన ప్రత్యేకత.


★ ★ ★

శ్రీపాదవారు ఓ సందర్భంలో అంటారు - "మొదటి మాటు విశాఖపట్నం వెళ్ళాన్నేను. అప్పటికి నాకు ఒకటే ప్రాణం. రెండో ప్రాణం సంక్రమించినట్టయింది". తరువాత నెల్లూరు వెళ్లాను. మూడో ప్రాణం సంక్రమించింది. హనుమకొండ వెళ్లాను. నాల్గో ప్రాణం సంక్రమించింది. కడప, అనంతపురం, నంద్యాలకు వెళ్లాను. అయిదో ప్రాణం సంక్రమించింది...ఇవాళ చూసుకుంటే అయిదు ప్రాణాల నిండు జీవితమే నాది. నా స్వప్రాంతపు పలుకుబడిలో యెంత జీవశక్తి ఉందో అక్కడక్కడి పలుకుబళ్లలోనూ అంత జీవశక్తి ఉంది". సాటిలేనిది ఆయన నిబద్ధత.

డా॥మధురాంతకం నరేంద్ర
98662 43659

వందేళ్ల కథకు వందనాలు

సాహిత్య ప్రక్రియలన్నింటిలోనూ కథానిక ఆధునికమైనది. ఆదిమ మానవుల్ని ఆకట్టుకున్న తొలి సాహిత్య ప్రక్రియఐన మౌకిక కథ, వో సాహిత్య ప్రక్రియగా మిగిలిన అన్ని ప్రక్రియలకంటే ఆలస్యంగా స్థిరపడడం మానవ జీవితంలోని వైచిత్రి. దాదాపుగా యితర ప్రపంచ భాషలతోబాటుగా – లేకుంటే కొన్ని దశాబ్దాల తర్వాత మాత్రమే – భారతదేశంలో కథానిక పుట్టింది. ఆ తరువాత కొన్ని దశాబ్దాలకే తెలుగు కథానిక పుట్టింది. అయితే తాను పుట్టిన తర్వాత వంద సంవత్సరాలలో తెలుగు కథానిక, మిగిలిన అన్ని తెలుగు ప్రక్రియల కన్నా బలంగా, విశిష్టంగా తయారయ్యింది. కథానికను అమెరికా దేశపు జాతీయ ప్రక్రియగా భావించవచ్చు. అంతే విశిష్టంగా అది తెలుగువారికీ స్వంతమయ్యింది. యీ విశిష్టత ఆధారంగా తెలుగు వాళ్ళకూ, అమెరికన్లకూ మధ్య వుండే స్వామ్యాల్ని తరచి చూసుకోగలిగే అవకాశం గూడా వుంది.



తెలుగు కథ యిలా వందేళ్లుగా నిత్య నూతనంగా విప్పారుతూ, విలిసిల్లుతూ వచ్చిన తరుణంలో ఆ పండుగను తెలుగు కథా ప్రేమికులు, పాఠకులు, విమర్శకులు రకరకాలుగా, తమదైన ధోరణుల్లో జరుపుకున్నారు. సదస్సులూ, సమావేశాలూ జరిగాయి. కొత్త సంకలనాలు వచ్చాయి. అటువంటి అరుదైన సంకలనాల్లో వొకటి యిటీవల విడుదలయ్యింది. దానిపేరు 'వందేళ్లకథకు వందనాలు'. '116 ప్రముఖ కథా రచయితల వైభవ ఆవిష్కరణ' – అనేది దాని వుపశీర్షిక. దాని సంపాదకుడు – గొల్లపూడి మారుతీరావు.

1/4 డెమ్మీ నిడివిలో 1350 పేజీలుండే యీ పుస్తకం బహుశా తెలుగు కథానికా సంకలనాలన్నింటికంటే పెద్దది. పెద్ద వట వృక్షంలా రూపొందిన యింత పెద్ద సంకలనం గూడా చిన్న విత్తనంగానే తన ప్రయాణాన్ని ప్రారంభించింది. 2011 ప్రాంతాల్లో వో పత్రిక శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి 'అరికాళ్ళకింద మంటలు' కథను విశ్లేషించమని గొల్లపూడి మారుతీరావుగారిని కోరిందట. ఆ కథను చదివి, పులకించి, మళ్లీ చదివిన మారుతీరావుగారు అలాంటి కథలు కనీసం వందను విశ్లేషించాలనుకున్నారు. యేదో పనిపైన అటు వెళ్తూ తమ యింటికొచ్చిన హెచ్.ఎం.టీవీ ప్రధాన సంచాలకులు శ్రీరామచంద్రమూర్తిగారితో ఆ విషయాన్ని ప్రస్తావించారట! ఆయన తల వూపగానే యీ పెద్ద పనికి నాందీ ప్రస్తావన జరిగిందట!

అయితే వందేళ్ళకాలంలో వచ్చిన లక్షలాది కథల్లోంచీ కేవలం నూరు కథల్ని యెన్నిక చేయడం అంత సులభమైన పని కాదు. మారుతీరావుగారు చాలా మంది మిత్రుల దగ్గిరి నుంచీ వాళ్ళదైన జాబితాల్ని తెప్పించుకుని, వివిధ పత్రికల్లో వేర్వేరు సందర్భాల్లో వచ్చిన కథల యెన్నికలతో బేరీజు వేసుకుని, రకరకాల కథా సంకలనాల్ని సంప్రదించి – చివరకు తనదైన నూరు కథల్ని యెన్నుకున్నారు. చానల్ సంచాలకులు మరికొంత వుదారతతో సంఖ్యను పెంచడంతో కథలు 116 కు చేరాయి.

యిటువంటి యెన్నిక యేదయినా సమగ్రంగా వుండదనీ, యిటువంటి ప్రయత్నంలో చాలా సర్దుబాట్లూ, సంకోచాలు మిగిలే వుండిపోతాయనీ మారుతీరావుగారికి తెలుసు. యేవేవో కారణాల వల్ల కొన్ని ముఖ్యంగా వుండవలసిన కథానికలు చేరకుండా వుండిపోతాయి. యెంత ప్రయత్నించినా కొన్ని పనులు నెరవేరవు. యిటువంటి యిబ్బందులను తట్టు కుంటూ, తనదైన ధోరణిలో ముందుకెళ్ళినప్పుడే. యే ప్రయత్నమైనా సిద్ధిస్తుంది.

యీ టీవీ కార్యక్రమానికి ముందుగా వో నిర్దుష్టమైన ప్రణాళికను మారుతీరావుగారు యేర్పరచుకున్నారు. ముప్పయి నిముషాలుండే యీ కార్యక్రమంలో ముందుగా ఆనాటి కథకుడి గురించి సంపాదకుడైన మారుతీరావుగారు చిన్న వుపోద్ఘాతం చెప్తారు. తరువాత ఆ రచయితతో చిన్న ముఖాముఖి. ఆ రచయిత కీర్తిశేషుడైనప్పుడు ఆ రచయిత సంతానంతోనో, మిత్రులతోనో ముఖాముఖం వుంటుంది. తరువాత ఆ రచయితో, ఆ రచయితకు సంబంధించిన వ్యక్తులో ఆనాటి కథానికను కొంత చదువుతారు. కథనంతా చదవడం సాధ్యంగాదు కాబట్టి మిగిలిన కథను పూర్తి చేస్తూ సంపాదకుడు ఆ కథనంతా విశ్లేషిస్తాడు. యీ కార్యక్రమానికంతా పతాకగీతాన్ని గొప్ప కథకుల పేర్లన్నీ వచ్చేలా రాంభట్ల నృసింహశర్మగారు రాశారు. మాధవపెద్ది సురేష్‌గారు సంగీతం సమకూర్చగా, ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యంగారు పాడారు".

116 సంచికలు పూర్తయ్యాక మారుతీరావుగారు వాటినలా గాలికి వదిలిపెట్టలేదు. అన్నింటినీ అక్షరబద్ధం చేసి పుస్తకంగా తీసుకురావాలని సంకల్పించారు. సంకల్పమెంత గొప్పదో కార్యమంత కష్టమైంది. మేడా మస్తాన్ రెడ్డి వంటి అభిమానుల తోడ్పాటుతో ప్రసారాలన్నింటినీ కాగితాలకెక్కించి, ఆ కార్యక్రమాలన్నింటిని ప్రసారమైన క్రమంలోనే పేర్చి, యింత పెద్ద పుస్తకం తీసుకురావడం వెనక మారుతీరావుగారి కృషీ, పట్టుదలా మాత్రమేగాదు, తెలుగు కథానికపైన ఆయనకున్న గౌరవాభిమానాలు స్పష్టంగా వెల్లడవుతున్నాయి. టీవీ కార్య క్రమంలో ఆయన ఆయా రచయితల దస్తూరినీ, సంతకాలను గూడా ప్రేక్షకులకు చూపెట్టారు. యిప్పుడీ పుస్తకంలో పాఠకులకు 116 మంది రచయితల సంతకాలు గూడా దొరకుతాయి.

వందేళ్ళ కథా సాహిత్యానికి ప్రాతినిధ్యం వహించే 116 కథల్ని వొకచోట చదవడమన్నది పాఠకులకు విందులాంటిదే! యీ బృహద్గ్రంథంలో కథలతోబాటు దొరికే ఆయా రచయితలతో లేకపోతే ఆయా రచయితలను బాగా తెలిసిన వ్యక్తులతో మారుతీరావుగారు జరిపిన 'ముఖాముఖి' చాలా కొత్త విషయాల్ని పరిచయం చేస్తాయి. గురజాడ అప్పారావుగారి విజయనగరం జీవితం, పురాణం సీతగారు రాసిన సాయిబాబా భజనల పుస్తకం, రాయని భాస్కరుడు దేవులపల్లి

కృష్ణశాస్త్రిగారు తన కొడుకు బుజ్జాయిని సక్రమంగా బడికి పంపక పోవడం, ఎన్నార్ చందూరుగారు రాసిన – మనం మరిచిపోయిన కథలు, తన కథల ముగింపుల గురించి బుచ్చిబాబుగారు తన శ్రీమతి శివరాజు సుబ్బులక్ష్మిగారితో చర్చించే తీరు, కరపత్రాలు రాసే అల్లం రాజయ్యగారు గొప్ప వుద్యమానికంతా ఆలంబనగా మారే కథలు రాసిన వైనం, కొట్టివేతన్న మాటే లేకుండా చిత్తు ప్రతి ప్రసక్తి రాకుండా వొకేసారి మేలిప్రతిగానే కథలు రాసిన హితశ్రీగారు యెప్పుడూ తెలుపు దుస్తులే ధరించడం, రావిశాస్త్రికి తొలి శిష్యులుగా సాహితీలోక మంతా భావించే బీనాదేవిగార్లు తమకాపేరు తెచ్చి పెట్టిన తొలి కథల్ని రాసే ముందు రావిశాస్త్రిని చదవనేలేదని వెల్లడిజేయడం, అద్భుతమైన అచ్చమైన తెలుగుకథలు రాసిన కళ్యాణ సుందరీ జగన్నాథ్‌గారి కథ ల్లోని విషాదానికున్న జీవన మూలాలు – యిలా ప్రతి ముఖాముఖి లోనూ పాఠకులకు ఆసక్తిని రేపేవీ, ఆశ్చర్యాన్ని కలిగించేవీ అయిన విషయాలెన్నో కనబడతాయి.

'మన శరీరమొక దేవాలయంలాంటిది. దానిలోకి తీసుకునే ఆహారం శుభ్రంగా వుండాలి. దాన్లోంచీ బయటకొచ్చే ప్రతిమాటా యెదుటివాడికి ఆనందాన్నే కలిగించాలి అన్నారు గొల్లపూడి మారుతీ రావుగారొక సమయంలో. 'వందేళ్ళ తెలుగు కథకు వందనాలు' అనే పుస్తకం తెలుగు కథా సాహిత్య వైభవాన్ని చాటి చెబుతుందంతే! అందుకే ప్రతి రచయితనూ మారుతీరావుగారు గొప్పగానే పరిచయం చేస్తారు. యే రచయిత గురించి చెప్పినప్పుడు ఆ రచయితే అందరి కన్నా గొప్పవాడనేలా ఆయన పరిచయం చేస్తాడు. కథలు రాసినా, సినిమా రచనలు గావించినా, నటుడుగా ప్రసిద్ధుడైనా, ఆయన మౌలి కంగా మాత్రం నాటక రచయితగానే కనిపిస్తాడు. అందుకే ప్రతివ్యక్తినీ, ప్రతి సంఘటననూ ఆయన గాఢమైన నాటకీయతతోనే పరిచయం చేస్తాడు. ప్రతి పరిచయాన్నీ గొప్ప ప్రేమతో, గౌరవంతో తన్మయ త్వంతో పాఠకుల్ని మురిపించేలాగే చేస్తాడు. ఆయా రచయితలతో తనకున్న వ్యక్తిగతమైన సాన్నిహిత్యాన్ని గుర్తుకు చేసుకుంటున్నప్పుడూ, వృత్తిరీత్యా రేడియోలో పనిచేసినప్పుడు తనకు దొరికిన అరుదైన వ్యక్తుల పరిచయాలను మననం చేసుకుంటున్నప్పుడూ ఆయన ఆనం దంతో పులకరించి పోతాడు. కథలతోబాటుగా ఈ పుస్తకంలో పురి విప్పే వుపోద్ఘాతాలూ, ముఖాముఖాలూ, కథానికా విశ్లేషణల నిండా పరచుకున్న వ్యక్తిత్వమంతా మారుతీరావుగారిదే! వాటిని చదవడ మన్నది పాఠకుడ్ని బృందావనంలో వెన్నెల విహారం చేసినట్లుగా, గొప్ప జీవితానందనోత్సవంలో పాల్గొంటున్నట్టుగా మురిపిస్తుంది.

భారతీయ విమర్శంతా వ్యాఖ్యాన ధోరణిలోనే సాగిస్తున్నట్టుగా తోస్తుంది. పాశ్చాత్యమైన విమర్శలో నిర్మోహత, తులనాత్మక వివేచన యెక్కువగా కనిపిస్తాయి. మారుతీరావుగారిది అచ్చమైన భారతీయ విశ్లేషణాధోరణి. ఆయా కథల్ని విశ్లేషిస్తున్నప్పుడు ఆయన ఆ కథల్లోని గొప్పతనం పైనే దృష్టినంతా కేంద్రీకరిస్తారు. ఇదే మాటను మరోలా చెప్పాలంటే – ఆయనకెప్పుడూ గొప్పతనాలూ, మంచే కనపడతాయి. అది ఆయన స్వభావం. పైగా యిటువంటి పుస్తకంలో అలా విశ్లేషించ డమే ఔచిత్యం, యెప్పుడు యేది యెలా చెప్పాలో, అలాగే చెప్పడ మన్నది మారుతీరావుగారికి వెన్నతో నేర్చిన విద్య.

'కథను చదివించడంలో కొబ్బరినీళ్లలాగా చిన్నరుచిని మప్పి, అతి సులువుగా, అతి వేగంగా అలవోకగా చదివించడంలో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి తర్వాత నిలబెడతాను కొడవటిగంటి కుటుంబ రావుగారిని' అంటాడాయన. అల్లం రాజయ్య 'చిలకా! నువ్వెటు వెళ్ళావు!' ని విశ్లేషిస్తూ 'నన్ను నిలువునా నరుకుతూ, మళ్లీ బతికించే ఒంటరితనం. యిది ఎగ్జిస్టెన్సియలిజమ్. సాత్రే, కామూ, పట్టుకున్న ఎగ్జిస్టెన్సియలిజంను ఒక్క వాక్యంలో చెప్పాడు రచయిత" అన్నాడు. చిన్న పరిధిలో జేమ్స్ జాయిస్ ఫ్లో ఆఫ్ కాన్సియస్‌నెస్‌నీ, డిలాన్ థామస్ కవితల్నీ, మరేవో ఘాటయిన పొయిటిక్ యిమేజెస్‌నీ కల బోసిన ఖరీదయిన డికాక్షన్ స్మెల్ 'ఖాళీసీసాలు' కథానిక అని చెబు తారు. ఇచ్ఛాపురపు జగన్నాధరావుగారి 'గుండుసూది' కథను గురించి చెప్పాక చివరగా 'ఇది చాలా విచిత్రమైన, సరళమైన, అందమైన కథ – ఒక కొత్త కోణాన్ని విశ్లేషించి చెప్పే ముద్దయిన కథ" అన్నప్పుడు ఆ మాట జగన్నాధరావుగారి మొత్తం కథానికా రచనల మౌలిక తత్వాన్నంతా వెల్లడి చేస్తుంది. రాయలసీమ రైతుల విషాద జీవితాన్ని చెప్పే కే.సభాగారి 'పాతాళగంగ' కథను 'చదివినకొద్దీ చవులూరించే అతి రుచికరమైన కథ' అనడానికి యెంతో వివేచన, సాహితీ విమర్శ పరిచయమూ వుండి తీరాలి.

ఒక ఠాగూర్‌కంటే, ఒక ఫేనార్ కంటే, ఒక మేమి కంటే ఎంతో ఎత్తున తెలుగు సాహిత్యంలో ఒక కథని 70 యేళ్ళక్రిందటే నిలబెట్టిన ఒక మహారచయిత కథ 'జీవునియిష్టం' (విశ్వనాథ సత్యనారాయణ గారి కథ) అన్నప్పుడూ, శ్రీశ్రీ 'కోనేటి జన్మ' అనే కథ లాంటి గల్పికను 'నూరేళ్ళ సాహితీ ప్రస్థానంలో కథకు మార్గ సూచినీ, జీవాన్నీ, జవాన్నీ సంతరించిన గొప్ప కథ' అన్నప్పుడూ పులిక్కిపడక తప్పదు. కొందరి కైనా ఈ మాటలు చర్చనీయాంశాలుగానూ, వుత్ప్రేక్షలుగానూ కనబడి తీరతాయి. యే కథకాకథను వో టీవీ యెపిసోడ్‌గా మలుస్తున్నప్పుడు ఆయా రచనల్ని చదివి ఆనందిస్తున్నప్పుడు, యిటువంటి పొగడ్తలు దొర్లడం సహజమే! యిటువంటి వ్యాఖ్యానాలు కొత్త చర్చలకూ, కొత్త అధ్యయనాలకూ దారి తీస్తాయి.

116 టీవీ సంచికలు నిర్వహించడమన్నది తేనెటీగ వొక్కో పువ్వునుంచీ తేనెను తీసుకుని పెద్ద తేనె తుట్టెను నిర్మించడమంత పెద్దపని. మధ్యలో యెక్కడైనా, యెప్పుడైనా నిరాశ, విసుగూ, నిర్వేదం తప్పకుండా వచ్చే వుండాలి. అయితే అటువంటి వాటికి లొంగకుండా, ప్రారంభించినప్పుడున్నంత వుత్తేజం, వుత్సాహంతోనే చివరి వరకూ వుండగలగడం వెనక మారుతీరావుగారికి తెలుగు కథ పై నుండే గౌరవాభిమానాలు స్పష్టంగా వ్యక్తీకరించబడుతున్నాయి. ఆ సంచికలు నాధారంగా యేదేళ్ళు శ్రమించి, యింత పెద్ద పనిని చివరి వరకూ అనుకున్న రీతిలో పుస్తకంగా తీసుకురావడానికాయన శ్రమించిన తీరును ప్రత్యేకంగా ప్రశంసించాలి. యీ పుస్తకానికుండే ప్రత్యేకత లనూ, పరిమితులనూ ఆయన నిక్కచ్చిగా, నిజాయితీగా ముందే చెప్పేశారు. యీ కృషి వెనక యెందరో మహానుభావుల అండదండలూ వున్నాయి. ముఖ్యంగా దీన్ని ప్రచురించిన గోకుల్ చంద్ర, రాహుల్ చంద్ర స్మారక ధర్మనిధి ప్రచురణకర్తను అభినందించి తీరాలి.

వొక గొప్ప సాహిత్యకారుడు తన ప్రణాళికల మేరకు వొక బృహత్తరమైన పనిని యెంత విజయవంతంగా నెరవేర్చవచ్చో చెప్ప డానికి మారుతీరావుగారి 'వందేళ్ళ కథకు వందనాలు' నిలువెత్తు నిదర్శనంగా వుండిపోతుంది.

ప్రసంగవ్యాసం

– సతీష్ చందర్
9866192685

తెలుగులో తిట్టు లేదా? తెలుగు మీద పట్టు లేదా?



అక్టోబర్ 15న హైదరాబాద్‌లో తాపీధర్మారావు పురస్కారాన్ని అందుకొన్న తర్వాత సతీష్ చందర్ ప్రసంగం

'మీరెవరు?'

ప్రశ్నే. సాదాసీదా ప్రశ్నే. ఎక్కడో ఒకచోట, ఎప్పుడో ఒకప్పుడు, ఎవరో ఒకరికి ఈప్రశ్న ఎదురవుతుంది. స్థలమూ, సందర్భమూ సమాధానాన్ని నిర్ణయిస్తాయి.

స్థలం: మనదేశంలోని ఒకానొక గ్రామం. సందర్భం: ఆ ఊరికి కొత్తకావటం. అడిగిన వ్యక్తి: ఆ పల్లెలో ఓ పెద్దాయన.

ఆ కొత్తవ్యక్తినుంచి వచ్చే సమాధానాలు ఏయే రకాలుగా వుండ వచ్చు...

'నేనొక ఇంజనీరుని" 'నేను తెలంగాణరాష్ట్రం నుంచి వచ్చాను.' 'నేను పర్యాటకుణ్ణి'

ఆ పెద్దాయన ఆశిస్తున్నది వీటిల్లో ఏఒక్క సమాధానమూ కాదు.

అప్పుడా కొత్త వ్యక్తి పెద్దాయన ఆంతర్యాన్ని గ్రహిస్తాడు. తన కులం ఏమిటో చెబుతాడు.

ఇలాంటప్పుడే 'నేను తెలుగువాణ్ణి' అని చెప్పివుండవచ్చు కదా.., అని అనిపిస్తుంది. అవును. మనిషికి ఉనికి తన భాష కాదా..? కులమే ఉనికా..? కులంపేరు చెప్పుకుని హెచ్చులకు పోయినట్లు, భాషతో విర్రవీగలేమా..? పలుభాషల భారతం మనది. మరి కులాలూ ఎక్కు వేనే..? భాషల్లో ప్రత్యేకతలుంటాయి 'కులాల్లో అంతరాలు వుంటాయి. ఒక భాష పక్కన మరొక భాష వుంచి పోల్చవచ్చు' కానీ కులాలను (వాటి మూలాలయిన వర్ణాలనయినా సరే!) ఒకదాని కింద ఒక దానిని వుంచాల్సిందే.

అయితే భాష పేరుతో రొమ్ము్మవిరుచుకునే దేశంలో లేరా...? ఇలా అనగానే చటుక్కున మనకి బెంగాలీలూ, తమిళులూ స్ఫురణకు వస్తారు. వారికి తమ భాష గర్వకారణంగా వుంటుందని మనం నమ్మేస్తాం. మనకి కాస్త దిగులుగా కూడా వుంటుంది కూడా. 'చూడండి. ఒక బెంగాలీ మరొక బెంగాలీని ఎలా ప్రోత్సహిస్తాడో..! మనమూ ఉన్నాం. ఒక తెలుగువాణ్ణి చూసి మరొక తెలుగువాడు ఓర్వలేడు'. ఇది మనకు అలవాటయిన ఫిర్యాదు.

ఈ ఫిర్యాదునే పరిశోధనకు తీసుకుని ఎవరయినా ముందుకు వెళ్ళితే బాగుంటుంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడులలో భాష ముందు ఏదో మేరకు కులం చిన్నబోయివుండాలి. ప్రజలు తమను 'ఉనికి'నీ లేదా 'అస్తిత్వాన్ని' చెప్పటానికి భాషను ముందు పెడుతు న్నారు. అన్ని రాష్ట్రాల్లో లాగానే ఈ రెండు రాష్ట్రాల్లోనూ కుల వ్యవస్థ పీఠం వేసుకునే కూర్చున్నది. అనుమానం లేదు. సంస్కరణోద్యమానికి బెంగాలూ, ద్రావిడోద్యమానికి తమిళనాడూ పుట్టినిళ్ళుగా వున్నవన్నది జగమెరిగిన రహస్యం. ఈ రెండు ఉద్యమాలూ సాంఘిక జీవితంలోకి తమ తమ మాతృభాష ద్వారా చొచ్చుకుపోయాయి. ఎలా, ఏమేరకు ప్రభావితం చేసాయీ అని నిరూపించవచ్చు కానీ, ఇక్కడ అప్రస్తుతం.

అందుకే రాష్ట్రం మారినప్పుడు 'మీరెవరు?' అని అంటే 'నేను

బెంగాలీయుణ్ణి' 'నేను తమిళుణ్ణి' అని వారు చెప్పగలిగినట్లుగా మన తెలుగు వాళ్ళు మాత్రం 'నేను తెలుగువాణ్ని' అని చెప్పలేరు. రాష్ట్రమే మిటి...దేశం దాటినా చెప్పలేం. కావాలంటే తెలుగు పేరిట సంఘాలు పెట్టుకుంటాం కానీ, మళ్ళీ అవి కూడా 'కులాన్ని' పట్టి యిచ్చేవిగానే వుంటాయి. అమెరికాలోని అత్యధిక తెలుగు సంఘాలు ఇందుకు 'సుదూర' ఉదాహరణలు.

'మీరెవరు?' అనడిగినప్పుడు నిజంగా 'నేనెవర్ని?' అని కులాల్ని మరచి ప్రశ్నించుకుంటే సమాధానం సుస్పష్టమవుతుంది. 'నేను ఏది అనుభూతి చెందుతానో...నేను ఏది ఆలోచిస్తానో...అదే నేను'. ఆలో చనలూ, అనుభూతులూ అధికశాతం పక్కవారితో పంచుకొనేవే. పంచుకునే కొద్దీ అవి పరిణతి చెందుతుంటాయి. అందుకు భాషే వాహిక. మాట్లాడగా మాట్లాడగా ఈ భాషే ఎలా అనుభూతి చెందాలో, ఎలా ఆలోచించాలో కూడా నేర్పుతుంది. అలా భావాలకు మాతృక అవుతుంది కూడా. అంటే తొలుత నేను ఎత్తుకున్న భాషే, నన్ను ఎత్తుకుంటుంది. అనేక అనేక సమూహాల, అనేకానేక తరాల అను భూతులనూ, ఆలోచనలూ మోసిన భాష నాకు విలాసమవుతుంది' ఉనికి అవుతుంది.

'నీచ' పంపకం!

భావాలను పంచుకోవటానికే భాష ఉందనుకున్నప్పుడు...ఎలా పంచుకుంటున్నామన్న ప్రశ్న కూడా పొడుచుకొస్తుంది. సంపద పంపిణీలో అసమానతలున్నట్టే, భాష పంపకంలోనూ వ్యత్యాసాలుం టాయా? పక్క వారితో పంచుకున్నంతవరకూ భాష ప్రజాస్వామికంగా వుంటుంది. హెచ్చు తగ్గులున్నచోట పై వారు కిందవారితో పంచు కోవాల్సి వుంటుంది. అప్పుడది పంపిణీ కాకుండా, పెత్తనమవుతుంది. పై వాళ్ళ భాషలో పెత్తందారీ భావజాలం అనివార్యంగా వుంటుంది. 'తెల్ల'వాడి భాష 'నలుపు'ని అలాగే చిన్న బుచ్చింది. 'నిజమే కాబోలు తెలుపే అందానికీ, జ్ఞానానికీ చిహ్నం కాబోలు' అని నల్లవాడు కూడా నమ్మేశాడు. మనం మాత్రం తక్కువ తిన్నామా..? 'మాంసాహారాన్ని' శాకాహారం తినే 'పై' వర్ణాల వారు 'నీచు' అనలేదూ..? అలా అనేస్తే ఆ మాటను 'కింది' వర్ణాల వారు శంకించకుండా స్వీకరించేశారు. భాష మహిమ! 'మా అయ్యకు నీచు(సు) లేకుండా ముద్ద దిగదు' అని మురిపెంగా ఇప్పటికీ చెప్పుకుంటారు.

భాషలో భావజాలం వుంటుంది. ఈ వాక్యాన్ని ఒప్పుకుంటే, భాషలో రాజకీయాలు వుంటాయని కూడా ఒప్పుకుని తీరాలి. రాజ కీయానుభూతులూ, రాజకీయానుభవాలూ భాష ద్వారానే బట్వాడా అవుతాయని కూడా నమ్మాలి. రాజకీయాలకు పార్శ్వాలు రెండు: ఆధిపత్యం, ధిక్కారం. రాజకీయాలే సాహిత్యచరిత్రలో అధ్యాయాలను మారుస్తుంటాయి. పురాణ, ప్రబంధ, భావ, అభ్యుదయ, విప్లవ సాహిత్య యుగాలు అలా వచ్చిన యుగాలే. ఇంకా చెప్పాలంటే ఒక ఆధిపత్యం మీద మరొకటి తిరుగుబాటుగా వచ్చింది. ఏ యుగానికా అభివ్యక్తి. తెలుగుభాష ఎప్పటికప్పుడు సరికొత్తగా దర్శనమిస్తూ వచ్చింది.

'ఈతిట్టుకు తెలుగేదీ..?'

గత సహస్రాబ్ది 70వ దశకం వరకూ వచ్చిన ఉద్యమరాజకీయా లకు సరిపోయిన భాష, 80వ దశకం వచ్చేసరికి సరిపోలేదు. అంత వరకూ తెలుగుభాషతో సాముగరిడీలు చేసిన కవులూ, రచయితలూ తమ వ్యక్తీకరణకు భాష సరిపోవటం లేదని ఫిర్యాదు చేశారు. అంత వరకూ వ్యక్తి సమూహంగా మారినవైనమే. అది అభ్యుదయం కావచ్చు, విప్లవం కావచ్చు. కానీ సమూహం నుంచి వ్యక్తి తలెత్తి చూడటం 80వ దశకం నుంచే మొదలయింది. దీనినే 'అస్తిత్వ రాజకీయం' అన్నారు. స్త్రీ తొట్టతొలుత ఈ రాజకీయం మాట్లాడింది. శత్రువులేనిదే అస్తిత్వం వుండదు. పురుషుడూ, పురుషాధిక్య భావజాలమే స్త్రీకి శత్రువు. 'మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే మమ్మల్ని విభజించి పాలిస్తున్నారు' అని తన శత్రువుల్ని పోల్చుకున్నారు స్త్రీ వాద కవి సావిత్రి. ఆగ్రహవ్యక్తీకరణ 'అస్తిత్వ రాజకీయాని'కి ఆయువు. కానీ ఏ తిట్టు తిట్టినా అది తిరిగి స్త్రీకే తగులుతోంది. తల్లినో, చెల్లినో, అక్కనో, ఆలినో నిందించకుండా ఒక్క తిట్టూ లేదు. భాషలోని పురుషాధిక్యం వారికి కొత్తగా అర్థం కావటం ఆరంభమయింది. 'మొగుడు' అంటే 'స్వేచ్ఛా భక్షకుడనీ' 'పెళ్ళి' అంటే 'పెద్ద శిక్ష' అనీ వారు తెంపు చేశారు. ఇప్పటి 'వివాహ వ్యవస్థ'లోని అప్రజాస్వామిక వైఖరిని తప్పు పట్టారు. అంతెందుకు? గౌరవ వాచకాల్లోనూ స్త్రీ 'వైవాహిక స్థితి' ని గుర్తు చెయ్యటాన్ని నిరసించారు. (పెళ్ళయినా, కాకపోయినా పురుషుడి పేరు ముందు 'శ్రీ' పెట్టవచ్చు. కానీ స్త్రీకి అలా కాదు. పెళ్ళి కాకుంటే 'కుమారి' అనీ, పెళ్ళయితే 'శ్రీమతి' అనీ ఆమె పెళ్ళిగుట్టును రట్టు చేస్తారు.) తమ 'లైంగిక బానిసత్వం' మీద నిప్పు చెరిగారు. 'శరీర రాజకీయాల' పై నిస్సంకోచంగా మాట్లాడారు. అవాక్కయిన మగ రచయితలు కొందరు ఈ వ్యక్తీకరణను 'నీలి కవిత్వం'గా ఆడిపోసు కున్నారు.

ఈ దశకంలో తెలుగు భాషకు 'జెండర్' పరీక్షే కాదు' 'మత' పరీక్ష కూడా వచ్చింది. మైనారిటీ మత విశ్వాసం కలిగిన వారు తెలుగు భాషలోని మెజారిటీ మతాధిపత్యాన్ని ప్రశ్నించారు. మహా కవుల్నే తప్పు పట్టారు. శ్రీశ్రీ ఎప్పుడో వెటకారంగా 'కసాయిబు' అనే ప్రయోగం చేశారు. ఇలా అనటాన్ని కవి ఖాదర్ మొహియుద్దీన్ నిల దీశారు. 'మ్లేచ్ఛుడు' 'కిరస్తానీయుడు' వంటివి కూడా ఇలాంటి అధిక్షేప వాచకాలే.

ఎనభయ్యవ దశకం చివరి పాదంలోనూ, 90వ దశకమంత టానూ తెలుగులో దళిత సాహిత్యం తిష్ట వేసింది. అప్పుడు కూడా దళితుల భాష మీద పెద్ద చర్చే జరిగింది. స్త్రీవాదులు అభ్యంతరం చెప్పిన (స్త్రీని కించపరిచే) తిట్లను యధేచ్ఛగా కొందరు దళిత కవులు వాడారు. అదేమంటే తాముద్దేశించింది అగ్రవర్ణ స్త్రీలనన్నారు.(దళిత స్పృహకు మూల విరాట్టయిన అంబేద్కర్ అగ్రవర్ణ స్త్రీని కులవ్యవస్థలో బందీగా చూశారు కానీ, శత్రువుగా ప్రకటించలేదు) ఇది కూడా కవిత్వమేనా – అంటే 'దిగంబర కవులు' వాడలేదా? అన్నారు. శత్రువు ఆయుధాలుగా వున్న పదాలతోనే, శత్రువుని కూల్చగలమా – అంటే ఇదే సందర్భంగా స్త్రీవాదులు విమర్శకు దిగారు. నిజమే కదా...! మనదేశంలో పితృస్వామ్యం, వర్ణవ్యవస్థా పెనవేసుకుని వున్నాయి. కాబట్టి స్త్రీలకూ, దళితులకూ ఈ రెండూ ఉమ్మడి శత్రువులు అవు తాయి. కాబట్టి శత్రువు 'తిట్లు' గా వాడే వాటిల్లో ఇద్దరినీ కించపరిచేవే వుంటాయి. ఇప్పటికీ యథాలాపంగా 'చండాలుడా!' అని 'అదేమిటి? చండాలంగా..!' అని అనే తిట్లు వాడేస్తూ వుంటారు. 'నీచ కులమని'

ఎత్తిపొడవటానికి ఉపయోగించే పదాలివి. ఇదే తిట్టును దళితుడు వాడితే తనని తాను తిట్టుకున్నట్లు వుంటుంది. అందుకే నాలాంటి వాళ్ళు 'మెడకు ముంత కట్టినట్లు నోటికి బూతు కట్టకండి!' అని హెచ్చరించారు.

కొత్త సహస్రాబ్ది తొలి దశకంలోనే తెలంగాణలో ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమం ఊపందుకుంది. మళ్ళీ భాష ప్రస్తావన వచ్చింది. తెలంగాణ భాషను చిన్నబుచ్చుతున్నారూ – అని ఆందోళనలు మొదలయ్యాయి. వీరు సాహిత్యకారుల ప్రయోగాల మీద కాకుండా, ఎక్కువగా మాధ్యమాల్లో వాడే భాష మీద ఎక్కు పెట్టారు. ఆంధ్ర ప్రాంతంలో రెండు మూడు జిల్లాల వాళ్ళు వాడే భాషనే ప్రామాణికంగా ఎలా పరిగణిస్తారు? 'వచ్చాడు' అనటానికి బదులు 'అచ్చిండు' అంటే ఎందుకు నవ్వులాటగా వుంది? సినిమాల్లో ప్రతినాయకుల(విలన్ల) చేతనే తెలంగాణ యాసను ఎందుకు మాట్లాడిస్తున్నారు? దాంతో ఈ ఉద్యమ కాలంలోనే విడుదలయిన 'దూకుడు' చిత్రంలో హీరో (మహేష్‌బాబు) చేతనే తెలంగాణ యాస మాట్లాడించారు. ఇటీవల విడుదలయిన 'ఫిదా' చిత్రంలో అయితే నాయిక(హీరోయిన్) చేతనే తెలంగాణ యాసనీ, మాండలీకాల్నీ మాట్లాడించారు. ఇక తెలంగాణ సాహిత్యమంటేనే తెలంగాణ మాండలీకంలో రాయాలనే స్థాయికి తెలంగాణ కవులూ, రచయితలూ వచ్చేశారు. పాట సరే – వచన కవిత, కథ, నవలలు సైతం తెలంగాణ యాసలోనే నడిచాయి. దిన పత్రికలలో వార్తల శీర్షికలు మారిపోయాయి. తెలంగాణ టీవీ చానెళ్ళలో అయితే ఈ మార్పు ప్రస్ఫుటంగా కనిపించింది.

అలా 1980 నుంచి నేటి వరకూ నడిచిన అస్తిత్వ ఉద్యమాల శకంలో కవులూ, రచయితలూ భాషలోని ఆధిపత్య స్వభావాన్ని ప్రశ్నించారు.

ఉత్పత్తి నుంచే వ్యుత్పత్తి!

పద సృష్టికీ వస్తూత్పత్తికీ సంబంధం వుంటుంది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే 'వ్యుత్పత్తి'కీ 'ఉత్పత్తి'కీ సంబంధం వుంటుంది. ఉత్పత్తి అంటే వస్తు సేవల సృష్టి, రవాణా ఇవన్నీ వస్తాయి. పారిశ్రామిక విప్లవం తర్వాత ఇంగ్లీషులోకి ఎన్నో కొత్త జాతీయాలు వచ్చి చేరిపోయాయి.(cog in the wheel అనే మాట అలాంటిదే) యంత్రాలతో తయారు చేసిన వస్తువులను ఇతర దేశాలకు ఓడలలో తరలించే వారేమో...నావికాయానంలో వుండే పలు పదాలు భాషలో కీలక స్థానం సంపాదించాయి (ఉదా: tip of the iceberg). బ్రిటిష్ వలస పాలకులు పారిశ్రామిక ఉత్పత్తులను పరిచయం చేశాక కూడా భారతీయ భాషల్లో వ్యవసాయ, వ్యవసాయాధారిత వృత్తుల నుంచే పద సృష్టి జరుగుతూ వచ్చింది.

అసలు ఈ వృత్తుల వెలుపల దళితులూ, స్త్రీలూ ఉండిపోయారు. ఒకరు ఊరు వెలుపల ఉండిపోతే, ఇంకొకరు వంటింట్లో ఉండిపోయారు. అందుచేత ఉత్పత్తి నుంచి ఆవిర్భవించే పదజాలానికి వారు దూరంగా పెరిగారు. భాష వెలుపల వుండిపోయిన వారిని సంబోధించే 'నిందావాచకాల' సృష్టితో కూడా వారికి ప్రమేయం లేదు. 'వెధవా' 'ముండా' అని అంటున్నప్పుడు కూడా ఈ పదాలు ప్రత్యేకించి తమను కించపరచటానికి మాత్రమే సృష్టించారన్న ఎరుక కూడా ముందు వారికి కలిగేది కాదు. దాంతో తాము చేసినదే పద సృష్టి అని 'వ్యవసాయ, అనుబంధ వృత్తుల'తో సంబంధం వున్నవారు మాత్రమే కాదు, తెలుగు సమాజం మొత్తం భావించింది.

దాంతో, ఎప్పుడయితే స్త్రీలు, దళితులు తమ ఉనికిని చెప్పే ప్రయత్నం చేశారో, ఉన్న పదాలు వారికి సరిపోలేదని తొలుత భావించారు. కానీ వారూ ఇంతకు మించి పదసృష్టి చేసిన అంశాన్ని తర్వాత తర్వాత గ్రహించారు. సమాజం భావిస్తున్నట్లు వారు ఉత్పత్తికి దూరంగా లేరు. అసలు పారిశ్రామిక ఉత్పత్తి అంటే ఏమిటి? ముడి సరుకును, సంపూర్ణమైన వస్తువుగా మార్చటమే కదా! అలాంటి పిండిని రొట్టె చేస్తే అది ఉత్పత్తి కాదా..! స్త్రీవాద కవి అన్నట్లు 'గరిట తిప్పటమే' స్త్రీ ప్రధాన వృత్తిగా చేశారు కానీ, దానిని ఉత్పత్తిగా గుర్తించలేదు. అందుకే ఇప్పటికీ స్త్రీల శ్రమ 'స్థూల జాతీయోత్పత్తి'(జి.డి.పి)లో భాగం కాలేక పోయింది. ఇంత ఉత్పత్తి జరుగుతున్నప్పుడు ఎంత పదసృష్టి జరుగుతుందీ..! పదసృష్టే కాదు..వారి సంభాషణల్లో ఎన్నెన్ని సొంపైన వాక్యాలు వచ్చిపడుతుంటాయి? శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి స్త్రీల సంభాషణలను వినే కదా అంత పఠనీయమైన తెలుగును తన కథల్లో రాశారు? చలం మాత్రం తక్కువ తిన్నారా? ఉరకలు, పరుగు తీసే వాక్యసృష్టి చేశారు. ఎక్కడనుంచి తెచ్చారు. స్త్రీల జీవితాల నుంచే. తర్వాత తర్వాత పురుషులు చేపట్టే అన్ని వృత్తులను వారూ చేపట్టారు. ఇప్పుడు 'ప్రధాన స్రవంతి'గా ఊరేగుతున్న తమ భాషను చూడగలిగారు.

దళితుల్ని ఊరువెలుపలికీ, వ్యవసాయోత్పత్తి వెలుపలకీ నెట్టేసి మూడువేల యేళ్ళయ్యాక, వారిలో వారు ఏం మాట్లాడుకున్నారు? ఇది తేలాలంటే వారు ఏ వృత్తులు చేశారు? ఇతరులు భయపడే (తలారి, కాటికావరి వంటి) వృత్తులూ, ఇతరులు చీదరించుకునే (మృత కళేబరాలను శుభ్రం చెయ్యటం వగైరా) వృత్తులు మాత్రమే చేసినట్లు పైకి కనిపిస్తారు. జాగ్రత్తగా కనిపిస్తే ఊరులో వుండే సమస్త వృత్తుల్నీ వారు నిర్వహించారు. ఒక రకంగా చెప్పాలంటే గ్రామ ఆర్థిక వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా వాడ ఆర్థిక వ్యవస్థను తయారు చేసుకున్నారు. కాబట్టే ఇన్నేళ్ళు సజీవంగా వుండగలిగారు. తమ మంచాలు తామే చేసుకుని, తమ కంచాలు తామే సమకూర్చుకుని, తమ శిరోజాలను తామే కత్తిరించుకుని, తమస్థాయిలో తమ పంటలు తామే పండించుకుని, తమ పెళ్ళిళ్ళకు తామే పౌరోహిత్యం వహించుకుని, తమ బాజా భజంత్రీలు తామే మోగించుకున్నారు. ఇతర కులాల వారికి తమ కులవృత్తి మాత్రమే వస్తే, వీరికి పలు వృత్తుల మీద పట్టు వుంటుంది. ప్రత్యామ్నాయ వస్తు సృష్టి వున్నప్పుడు, ప్రత్యామ్నాయ పదసృష్టి తప్పకుండా వుంటుంది. ఈ పదసంపదతో కావ్యసృష్టి జరుగుతుంటే తెలుగు సాహిత్యం ఎంత పరిపుష్టం అవుతుందో చెప్పలేం. దానికి తోడు వీరు ప్రధాన పారిశ్రామికోత్పత్తిలో భాగమయ్యారు. పట్టణాలకు, నగరాలకు వలసపోయి విద్యావంతులయ్యారు. ఆఫ్రో – అమెరికన్ రచయిత ఇంగ్లీషుకీ, శ్వేత జాతీయులైన అమెరికన్ల ఇంగ్లీషుకీ తేడా వుంటుంది. ఆఫ్రో – అమెరికన్ రచయితల ఆంగ్ల పదసృష్టి అమెరికన్ సాహిత్యానికే కొత్త సొబగులు అద్దింది. ఆంగ్ల వాక్యమూ అంతే. ఒకనాటి అలెక్స్ హెయిలీ (రూట్స్) నుంచి ఇప్పటి టోనీ మారిసన్ (సాంగ్ ఆఫ్ సొలోమోన్) వరకూ ఎన్నో కొత్త జాతీయాలనూ, పదాలనూ భాషలో ప్రవేశపెట్టారు. తెలుగులో

దళిత రచయితలు కూడా ఆ దారిలోనే పయనించి, భవిష్యత్తులో కొత్త సంపదనిస్తారు.

ఇన్ని వర్గాల, వర్ణాల, సమూహాల పదసృష్టిని గౌరవించి, స్వీకరించిననాడు తెలుగు ప్రజాస్వామికమవుతుంది. తమ ఉనికిని ప్రకటించ టానికి ప్రయత్నించిన సమూహాలే, తెలుగు భాష అస్తిత్వాన్ని గుర్తు చేశాయి. తమకు భాష సరిపోవటంలేదని ఫిర్యాదు చేసినవారు తామూ పదసృష్టికర్తలమే అని గ్రహించారు. ఇదే ప్రయాణం ఇలాగే కొనసాగితే...తెలుగుభాష కొత్త కాంతులీనుతుంది.

అప్పుడు తెలుగు రాష్ట్రాల వెలుపల 'మీరెవరు?' అని ప్రశ్నిస్తే (ఫలానా కులం వాళ్ళం అని కాకుండా) 'తెలుగు వాళ్ళం' అని గర్వంగా చెప్పుకోగలం. భాష విషయంలో బెంగాలీల్లాగా, తమిళుల్లాగా ఎంతో కొంత విర్రవీగగలం! అ

పెద్దిభొట్ల సాహిత్యస్ఫూర్తి 6వ పురస్కార ప్రదాన సభ

అందరికీ ఆహ్వానం

విజయవాడ మొగల్రాజపురంలోని మధుమాలక్ష్మి కల్చరల్ సెంటర్లో డిసెంబర్ 13న సా॥6 గం॥ గంటలకు జరుగుతుంది.

పురస్కార గ్రహీతలు

ప్రఖ్యాత రచయిత

శ్రీ మహమ్మద్ ఖదీర్‌బాబు

ఉత్తమ బాలసాహిత్య రచయిత్రి

శ్రీమతి డి.సుజాతాదేవి

పురస్కార గ్రహీతలకు రూ. 10,116/- చొప్పున నగదు, శాలువ మరియు జ్ఞాపికలతో సత్కారం జరుగుతుంది.

1955లోనే తాపీ ధర్మారావుగారి హెచ్చరిక



*'**అధి**కార బలంతో, రాజకీయ ప్రాబల్యంతో ఎంత నిషేధించినా వ్యావహారికం నాలుగు దిక్కులా ప్రజలలో ప్రబలి ప్రచండరూపంతో పెద్ద ఉప్పెనలా నిలువెత్తునా లేచి, ఎదిరించిన వారందరినీ తుడిచిపెట్టిపోతుంది. ఏకముఖానికి వస్తున్న వ్యావహారిక భాషా రూపాల్ని తీర్చిదిద్ది, అన్ని ప్రాంతాలవారు ఒక్క భాషనే ఉపయోగిస్తూ రాష్ట్ర సమైక్యతకు పెట్టనికోటగా స్థిరపడనీయండి.*

ఇతర భాషా సంస్కృతి సాహితీ సంపదలనుండి విజ్ఞానాన్ని తెలుసుకుని తెలుగులోకి తీసుకువచ్చి తెలుగు ప్రజలకు తెలియ చేయండి. అంతేగాని ఆ భాషలను తర్జుమాల రూపంలో దిగుమతి చేసి, తెలుగుతనం, తెలుగునుడికారం, తెలుగు మాటల శక్తి, తెలుగు స్వాతంత్ర్యాన్ని తెరమరుగు చేయవద్దు.

తెలుగు భాషను, తెలుగుజాతిని కించపరిచే ప్రయత్నం ఆపివేయండి" అని 1955లోనే ధర్మారావుగారు తెలుగు వ్యతిరేకులను హెచ్చరించారు - "హెచ్చరిక" అనే పేరుతో.

"పరభాషా సంస్కృతి, సాహిత్యాన్ని గౌరవించాలి; తెలుసుకోవాలి. అది తప్పుకాదు. అవసరం కూడా. అందరూ ప్రోత్సహించాలి కూడా. నేరుగా తర్జుమాలరూపంలో దిగుమతిచేసి మన తెలుగుభాషను నిరాదరణకు గురిచేస్తున్నాము. అరవవాళ్ళ పాటి చేయరా తెలుగువాళ్ళు. అరవవాళ్ళకున్న భాషాభిమానం తెలుగువారికి ఎందుకు లేదు" అని ఆవేదనతో ధర్మారావుగారు తెలుగువారిని ప్రశ్నించారు. తన కొత్తపాళీ అనే పుస్తకంలో...

ఈ ప్రశ్నకు సమాధానం ఈనాటివరకూ కూడా దొరకలేదని నా అభిప్రాయం. ఈనాడు కూడా ప్రసార మాధ్యమాలు అన్నీ పరభాషా కథలతో నిండిపోతోంది. ఇంగ్లీషు రానివాళ్ళు మూర్ఖులు అనేవారు కూడా వున్నారు. ఇంగ్లీషు రానివారిని చులకనగా చూసే మన తెలుగువారు చాలామంది వున్నారు మన సమాజంలో. పరభాషే గొప్పది మన భాష తక్కువ అని చులకనగా చూడడం ఆపివేసి, మన సంస్కృతి సాహిత్యాలకు, మన భాషా భావాలకు ఇప్పటినుండైనా పట్టం కట్టడానికి పూనుకుందాము. ఇప్పటినుండైనా ధర్మారావుగారి ప్రశ్నకు సమాధానం వెతికి పట్టుకుందాము.

"ప్రజల జీవనం పిడికిట పట్టుక ప్రకటించేదే రాతా॥
కూపస్థం వలె గుడ్డి పాఠములు కూటికి రాస్తే రోతా॥
మంచీ చెడుల జంకులేక ప్రేమించి చెపితేనే రాతా॥
ఏవో పుక్కిట పురాణములతో వల్లె వేసుకుని తెల్పేదైతే రోతా॥

ఆనాడు ధర్మారావుగారు ఉదహరించిన ఉదాహరణలు, ఆవేదనా ఈ రోజున కూడా సమాజంలో బయటకు రాలేనంతగా పాతుకు పోయాయి.

భాషా ప్రేమికులందరూ నడుంకట్టి మన భాషను బ్రతికించే ప్రయత్నం చేయాలి.



(అక్టోబరు 15న జరిగిన తాపీ ధర్మారావు పురస్కార సభలో ఆత్మీయ అతిథిగా పాల్గొన్న శ్రీమతి విమలా సోహన్ (తాపీ ధర్మారావుగారి మనుమరాలు- తాపీ మోహనరావుగారి కుమార్తె) ప్రసంగం.


శిరంశెట్టి కాంతారావు
94924 34222

బిగిసిన పిడికిళ్ళు

ఆ రోజు కార్తీక పున్నమి. ఫణిగిరి గ్రామానికి మకుటంగా వున్న గుట్ట మీదుగా పుట్టుకొచ్చిన పున్నమి చంద్రుడు చూస్తుండగానే పైకి ఎదిగివచ్చి వెండివెన్నెల కాంతిని విరజిమ్మసాగాడు. ఆ వెండి వెన్నెల్లో గుట్టతోపాటు దాని పరిసరాలన్నీ తమను తాము మరిచిపోయి పున్నమి చంద్రుణ్ణి ఆస్వాదించసాగారు.

ఆ రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో గుట్టమీదినుండి కదిలివచ్చిన చల్లగాలి తరంగాలకు నడిపూరిలో దొరల గడీ నానుకునివున్న రాములవారి చిన్న కోవెల ధ్వజస్థంభం మీది చిరుగంటలు మృదురవళికి మేలుకున్న గాలిగోపురంలోని అడవి పావురాలు సంతోషంతో పొంగిపోతూ గుగ్గూ...గుగ్గూ...మ్మని గుహూకారాలు వెలువరిస్తూ రప, రపమని రెక్కలు అల్లార్చుతూ లేచి ఆ ధ్వజస్థంభం చుట్టూ ప్రదక్షిణలు తిరుగుతూ వచ్చి మళ్ళీ తమ తమ స్థావరాల్లో కుదురుకుని కునుకులు వెయ్యసాగాయి.

ప్రతి తావుకూ ఒక యాస వుంటది. ఆ తావున పెరిగిన మనిషి ఆ తావు యాసనే మాట్లాడ్తడు. అంతమాత్రాన ఆ యాసే మిగిలిన యాసలకన్న గొప్పదనుకుంటే తప్పు. అందుకే తావును బట్టియాస, కులాన్నిబట్టి బాస అంటరు.



సరిగ్గా అదే సమయంలో ఆ కోవెలకు వెనుక దిక్కు వాయవ్య మూలగా వున్న గట్టు పాపయ్య ఇంటిలో...వాళ్ళ చిన్న కూతురు అనసూయకు తొలి చూలు పురిటినొప్పులు మొదలయ్యాయి.

వెంటనే నెత్తికి రుమాల చుట్టుకుని, కాళ్ళకు చెప్పులు తొడుక్కుని, మూలకున్న పట్టుడు కర్ర కుడిచేత అందుకుని, మంగలి వాడలో వున్న మంత్రసాని మల్లవ్వ ఇంటికి బయలుదేరాడు.

పాపయ్య వెళ్లి తలుపుకొట్టగానే తీసిన మల్లవ్వ అతణ్ణి చూడగానే ఏంది పటేలా! గింతనేత్రిపూట వస్తివేంది? అంటూ ప్రశ్నించింది.

మల్లవ్వ మాటలు వింటూనే ముఖం మీద మొలకనవ్వులు మొలుచుకొస్తుంటే ఇంత రాత్రప్పుడు ఎవ్వలైన మంత్రసాని మల్లవ్వ ఇంటికి ఎందుకొస్తరు? అన్నాడు పాపయ్య.

అనిశమ్మ పటేలమ్మ నొప్పులు తీస్తుందా ఏంది పటేలా? అంటూ సంతోషంగా అడిగింది మల్లవ్వ.

ఔ అంటూ విషయాన్ని వివరించాడు పాపయ్య.

వెంటనే ఇంట్లోకెళ్లిన మల్లవ్వ పురుడు పొయ్యడానికి వెళ్లేటప్పుడు తనతోపాటు తీసుకుపొయ్యే చేతి సంచిని అందుకుని బయట కొచ్చి పోదాంపా పటేలా! అంటూ పాపయ్య కన్నా ముందే సరసరా అడుగు లేసింది.

మల్లవ్వ, పాపయ్యలు పాపయ్య ఇంటికి వెళ్లేసరికి వాళ్ల ఇంటిల్లిపాది ఏదో తెలియని ఒక తియ్యటి ఆందోళనతో మల్లవ్వ కోసం ఎదురు చూస్తూ కన్పించారు.

మల్లవ్వను చూస్తూనే రా!రా!మల్లవ్వా! రా! బిడ్డబాద జూస్తుంటే నా పానం అల్లడ తల్లడైతుంది. కొండకెదురుజూస్తున్నట్టు నీ కోసమే ఎదురుజూస్తున్నం అంటూ మల్లవ్వ చెయ్యిపట్టుకొని ఇంట్లోకి తీసుకుపోయింది పాపయ్య భార్య బుచ్చమ్మ.

ఔ పటేలమ్మా! అట్లనే వుంటది. ఆడి పుట్టుకంటెనే అట్లుంటది. కాన్పుకాన్పుకూ కత్తి మీద సాముజేసినట్టేగాదు? ఆడిజాతి అంత

బాదబడి బిడ్డల్ని గంటది గాబట్కే తన సంతు పట్ల కొసదాన్క జీతులు దీస్కుంటది అను కుంటూ లోపలికెల్లిన మల్లవ్వ వెంటనే తన పని మొదలు బెట్టింది.

అక్కన్నుండి ఒక గంటపాటు సంపూ ర్ణంగా వైద్య విద్యను ఔపోశనబట్టిన వైద్యు రాలి మాదిరిగా తనపనిలో నిమగ్నమై పోయిన మల్లవ్వ ఇద్దరు కవల పిల్లలకు పురుడు పోసి బొడ్డుతాడు కోసింది.

అప్పటిదాకా ఆందోళనతో తల వాకిట తండ్లాడుతూ నిల్చున్న పాపయ్యకు ఇద్దరు మనుమలు అని తెలియడంతో అప్పటి దాకా పడిన ఆందోళన క్రమంగా మాయమై పోతూ దాని స్థానంలో సంతృప్తతతో కూడిన సంతోషం నడిమింటిని వున్న పున్నమ చంద్రుని కాంతిని మించిపోతుంటే ఒక దీర్ఘ నిశ్వాసాన్ని వెలువరించాడు...

★ ★ ★

ఆ రోజు పాపయ్య చిన్న కూతురు అనసూయ కవలకొడుకులకు బారసాల. ఆ కార్యక్రమానికి ఆవిడ అత్తవారింటి వాళ్ళతో పాటు అటు జగ్గయ్యపేట నుండి పాపయ్య పెద్ద కూతురు లక్ష్మీబాయమ్మ ఇటు మహ బూబాబాద్ నుండి నడిపి కూతురు పద్మా బాయమ్మ కూడా వచ్చారు.

ఊళ్లో వున్న చుట్టబంధువుల సమ క్షంలో ఆ సాయంత్రం బాలింత బాయినీళ్లకు వెళ్ళడంతో బారసాల కార్యక్రమం ముగిసింది.

అక్క మాటలు విన్న అనసూయ కొంతసేపు తన్లోతను తను ఏదో ఆలోచించు కొని అక్కా! నా కొడుకు నీ కొడుకు కాడా? ఇద్దర్లో ఒకడు నీ కాడ పెరిగితే అంద్లకాదనే టందుకేముంది? కాకుంట అగో ఆడమీ మరి దున్నడు. ఆయినెమ్మటే వాల్ల అమ్మనాయి న్లున్నరు. వాల్లను కనుక్కో వాళ్లు ఒప్పుకుంటె నా నొప్పుకున్నట్టే అంటూ తన సమ్మతిని తెలియజేసింది.

భార్యమాటలను విన్న అనసూయమ్మ పెనిమిటి వెంటనే కల్పించుకొని అయ్యో! ఇండ్ల నన్నడిగేదేముంది? ఎట్లా తొలుసూలు మనిషి ఇద్దరు పిల్లగాల్లను సూసుకొనుడంటె శానా కష్టమైతది. ఒక పిల్లగాన్ని తీస్కపొయ్యి సాదుకుంటమంటె నాకేం ఇబ్బంది లేదు అంటూ తన సమ్మతిని తెలియజేశాడు.

వాళ్ళకండ్లల్లో కదలాడుతున్న తృష్ణను గమనించిన పాపయ్య మీరు మీ యాసను దాని గొప్పతనాన్ని ఎదుటోల్లముందట గొప్ప జేసి సూపెట్టాలనుకుంటున్నరుగాని మీ తల్లి బాసకు, యాసకూ వస్తున్న అసలు ముప్పును గురించి పట్టిచ్చుకునుడు మర్సిపోయింద్రు అన్నాడు గంభీరంగా.

అంతే! ఆ అక్కా, చెల్లెల్ల అవగాహ నకు, అనుబంధానికి ముచ్చటపడ్డ సుట్ట బంధువులు తోడబట్టి నోల్లంటె ఇట్లుండాలె అనుకుంటూ సంతోషపడ్డారు.

అనుకున్న ప్రకారం ఆ మూడోనాడు మంచి రోజు చూసుకుని చిన్నపిల్లవాణ్ణి తీసు కుని లక్ష్మీబాయమ్మ జగ్గయ్యపేట వెళ్లి పోయింది.

పెద్ద కొడుకుతోపాటు అనసూయమ్మ ఫణిగిరిలోనే వుండిపోయింది.

★ ★ ★

పాతిక సంవత్సరాల తరువాత

ఒక రాష్ట్రం రెండు రాష్ట్రాలుగా విడి పోయిన తరువాత కూడా ఒక పక్క రెండు రాష్ట్ర ప్రభుత్వాలూ.

కన్న తల్లికి గంజిపొయ్యలేనోడు, పింతల్లికి పరమాన్నం పెడతానన్నట్టు. మాతృభాషకు ఇవ్వాల్సినంత గౌరవం ఇవ్వక పోగా అన్నింటా ఆంగ్ల భాషకు అధిక ప్రాధా న్యత ఇస్తుంటే ఇంకొక పక్క రెండు రాష్ట్రాల ప్రజలు ఎక్కడ పడితే అక్కడ ఏ వేదిక దొరికితే ఆ వేదిక మీద మా యాస గొప్పది అంటే లేదు లేదు మా యాసే గొప్పది అంటూ తమలో తాము భాషా భేదాలను దాటి యాసా భేదాలతో కొట్టుకోసాగారు.

ఈ యాసా ద్వేషాలతో రగిలిపోతున్న ఉభయరాష్ట్రాల ప్రజలను గమనిం చిన నిజ మైన తెలుగు భాషా ప్రేమికులు బాధతో కది లిపోతూ యాసలు వేరైనా మన అమ్మభాష తెలుగుభాష. ప్రపంచ వ్యాప్తంగానే అనేక మంది ప్రజల అమ్మభాషల మీద ఇంగ్లీష్ భాష ఆధిపత్యానికి పాలకులు సాగిల బడుతు న్నారు. వాళ్ళ లొంగుబాటును అడ్డుకోవా లంటే ఇప్పటి యువతరం, యాసల ద్వేషాలను వదిలిపెట్టి తల్లి భాషను కాపాడు కోడానికి ప్రభుత్వాలతో కొట్లాడాల అంటూ మాతృభాషా పరిరక్షణకు పాకులాడ సాగారు.

తల్లి భాషా ప్రేమికుల ఆందోళనను ఏమాత్రం పట్టించుకోని ఒక రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడికక్కడ తల్లి భాషామతల్లికి అన్యాయం చేస్తూ ఆంగ్లభాషకు అందలం వెయ్యసాగింది.

ఇక మరొక రాష్ట్ర ప్రభుత్వం గుడ్డిలో మెల్ల అన్నట్లు అన్ని స్థాయిలలోని విద్యా సంస్థ ల్లోనూ తెలుగును ఒక బోధనాంశంగా పెట్టు కోవచ్చు అంటూ ఉదారంగా ప్రకటించింది.

అటువంటి సందర్భంలో ...

ఫణిగిరి గట్టు పాపయ్యగారి చెల కలో వున్న కల్లం బండ మీది దుర్గమ్మ గుడిలో దసరాపండుగకు బోనాలు తియ్యాలన్జెప్పి బిడ్డలందరినీ పండుగకు తీసుకొచ్చారు.

అప్పటికి అనసూయమ్మ కొడుకు రామారావు ఉస్మానియా యూనివర్సిటీలో ఎం.ఎ.సోషియాలజీ చేసి ఒక స్వచ్ఛంద సంస్థ లో పనిచేస్తున్నాడు.

ఇక లక్ష్మీబాయమ్మ కొడుకు లక్ష్మణ రావు విశాఖపట్టణం ఆంధ్రా యూనివర్సి టీలో ఎం.ఎ.సోషియాలజీ చేసి ఒక స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తున్నాడు.

ఇక లక్ష్మీబాయమ్మ కొడుకు లక్ష్మణ రావు విశాఖపట్టణం ఆంధ్రా యూనివర్సిటీ లోఎం.ఎ.తెలుగు తరువాత పి.హెచ్.డి చేస్తు న్నాడు.

చాలారోజుల తరువాత తమ బిడ్డలు, అల్లుల్లు, కొడుకులు, కోడల్లు, మనుమలు, మనుమరాల్లు ముదిమమనుమలు, మనుమ రాల్లు దుర్గమ్మ బోనాలకు కదిలి రావడంతో ముదివగ్గులైపోయిన పాపయ్య బుచ్చమ్మలు ఆనందంతో కదిలిపోసాగారు.

సద్దుల బతుకమ్మకు దేవునిగుట్ట మీదికి వెళ్ళొచ్చిన తరువాత అంతా కూర్చుని అన్నాల్లు తింటున్నప్పుడు మాటల సందర్భం లో ఉమ్మడి రాష్ట్ర విభజనమీద మొదలైన చర్చ క్రమంగా ఆంగ్ల తెలుగు భాషా మాధ్య మాల మీదుగా యాసల మీదికి మరలింది.

అన్నా! నువ్వు నూరు చెప్పు, వెయ్యి చెప్పు మా కృష్ణా గుంటూరు జిల్లాల తెలుగే అసలు సిసలు తెలుగు భాష. మీ తెలంగాణా లోని తెలుగుభాష మా భాషతో పోల్చు కుంటూ ఎంతో మోటుగా వుంటుంది. చాలా

మొండిగా బల్లగుద్ది వాదించసాగాడు లక్ష్మణ రావు.

కాదు, కాదు అసలు సిసలు కావ్య భాష మీ తెలంగాణా తెలుగు భాషే అంటూ మరింత గట్టిగా బదులిచ్చాడు రామారావు.

యాస కోసం రెండు వర్గాలుగా విడి పోయి వాదించుకుంటున్న మనుమల్ల వాద నను చాలా సేపటి నుండి చూస్తూ కూర్చున్న పాపయ్య ఆఖరికి కల్పించుకుంటూ, అరే రామన్నా! లక్ష్మన్న ల్లారా! అసలు విషయాన్ని వదిలేసి, అవసరంలేని విషయం మీద మీరి ద్దరూ అనవసరంగా పంచాయితీకి దిగడం బాగ లేదు బిడ్డా! అన్నాడు.

తాత మాటలతో కొంత వెనక్కి తగ్గిన మనవళ్లిద్దరూ అసలు విషయమేంటో నువ్వు చెప్పరాదు? అన్నట్టు అతని దిక్కు చూశారు.

వాళ్ళ చూపుల్లోని ప్రశ్నను అర్థం చేసుకున్న పాపయ్య తన బోసినోటితో ముసి, ముసిగా నవ్వి, తెల్లటి మీసాలను ఎడమచేత దువ్వుకుంటూ సూడండ్రి బిడ్డా! నిజానికి మీరి ద్దరూ నా చిన్నబిడ్డ అనసూయమ్మకు కలిగిన కవలబిడ్డలు. అట్ల మీరిద్దరూ ఒక్క తల్లి బిడ్డ లన్నమాట. ఆనాడు మగపిల్లలు లేని లక్ష్మీ బాయమ్మ చిన్న కొడుకైన లక్ష్మణరావును సాదుకుంటానని ఆంధ్రాకు తీస్కపొయ్యి అక్కడే సాదుకుంది. అక్కడ పెరిగిన మన లక్ష్మణ్ణ అక్కడి యాస వంటబట్టింది. దాంతో అతను తన ప్రాంతపు భాషే. తన ప్రాంతపు యాసే నిజమైన భాషా, యాసా అన్న భ్రమలో మునిగిపోయిండు. అట్లనే ఇక్కడ పెరిగిన రామన్న ఇక్కడి భాషే, ఇక్కడి యాసే అసలు సిసలు తెలుగన్న భ్రాంతిలో పడిపోయిండు. ఎవని తల్లివానికి ఎంత గొప్పనో, ఎవని యాస వానికి అంతే గొప్ప. అట్ల అనుకు నుడులగూడ తప్పలేదు. కాకుంటే అక్కడ కావాలనే మాట్లాడడం ఆపివేసిన పాపయ్య మనుమలిద్దరి ముఖాల్లోని భావాలను చదివే ప్రయత్నం చెయ్యసాగాడు.

ఐతే!? ఏంటో చెప్పు అన్నట్టు తాత ముఖంలోకి చూడసాగారు మనుమలిద్దరూ.

వాళ్ళకండ్లల్లో కదలాడుతున్న తృష్ణను గమనించిన పాపయ్య మీరు మీ యాసను దాని గొప్పతనాన్ని ఎదుటోల్లముందట గొప్ప జేసి సూపెట్టాలనుకుంటున్నరుగాని మీ తల్లి బాసకు, యాసకూ వస్తున్న అసలు ముప్పును గురించి పట్టిచ్చుకునుడు మర్సిపోయింద్రు అన్నాడు గంభీరంగా.

తాత మాటల్లోని వాస్తవమేదో అన్న దమ్ముల మెదడులో జొరబడడంతో వాళ్లిద్దరూ విస్తుబోతూ తాత దిక్కు చూడసాగారు.

ఇక మనవళ్ళిద్దరికీ బోధించవలసిన చివరిఅంకం దగ్గరికొచ్చిందన్నట్టుగా తలపం కిస్తూ మీ ఇద్దరినీ కన్నతల్లి ఒక్కతే. కొన్ని కారణాల వల్ల చెరొక తావున పెరిగింద్రు. ప్రతి తావుకూ ఒక యాస వుంటది. ఆ తావున పెరిగిన మనిషి ఆ తావు యాసనే మాట్లాడ్తడు. అంతమాత్రాన ఆ యాసే మిగి లిన యాసలకన్న గొప్పదనుకుంటే తప్పు. అందుకే తావును బట్టియాస, కులాన్నిబట్టి బాస అంటరు. యాసలు ఏరైనా మీ తల్లిబాస ఒక్కటే. అటువంటి తల్లి బాసను మింగెయ్య నికి ఆంగ్లబాస వచ్చి మీ నెత్తిన గూసుంది. మనసు ఏలుతున్న మారాజులంత తల్లి బాసను గాదని ఆ పరాయిబాసకు పట్టం గడ్తుండ్రు. దాని దెబ్బకు మన తల్లిబాసకు తద్దినం బెట్టే రోజులు కనుసూపు మేరలనే కనబడుతున్నై. అందుకే మనమంత ముందల మన తల్లిబాసను కాపాడుకునేటందుకు రాజ్యంతోటి లడాయికైనా తయ్యారు గుండాలే. ఐటెంక ఎవల యాస గొప్పదో మనలో మనం తేల్చు కోవచ్చు అంటూ మనవళ్ళిద్దరినీ దగ్గరికి తీసుకుని వెన్నులు నిమర సాగాడు పాపయ్య.

తాత భావమేంటో సరిగ్గా అర్థం చేసుకున్న మనవలిద్దరూ మనకు మన యాసకన్నా మన తల్లి భాషే ముఖ్యం పరాయిభాషను నేర్చుకునే క్రమంలో మన తల్లిభాషను నిర్లక్ష్యం చెయ్యగూడదు అన్న సంకల్పాన్ని తమ బిగుసుకున్న పిడికిళ్ళ ద్వారా తెలియజేశారు. అ

కవిత

తెలుగువాడు

- గుర్రాల రమణయ్య,
9963921943

గాలికి గాంధర్వం నేర్పినవాడు
దిక్కులతో జుగల్బందీ కూచున్నవాడు
స్వరమాంత్రికుడు, గాత్రతాంత్రికుడు
వీడు మా తెలుగువాడే
త్యాగరాజు శిష్యతరానికి వారసుడు!
బాల్యంలోనే సప్త స్వరాల మురళిని మార్దవంగాఊది
మౌనభాషని పాటగా పలికించినవాడు
సంగీత బృందావనంలో
సరికొత్త రాగాల సృష్టికర్త బాల మురళీకృష్ణుడు
థిల్లానా పాడితే త్రిలింగదేశం
మోహన కళ్యాణిలో మోకరిల్లినవాడు
వీడు మా తెలుగువాడే
జనక రాజకృతి మంజరిని సృష్టించినవాడు
పలుకును బంగారం చేసి
శృతిలయల సాగరంలో ఈదినవాడు
రాగయాగాన్ని నిరవధికంగా నిర్వహించినవాడు
సంగీత ధన్వంతరిగా వైదిక గీతాన్ని
వైద్యగీతంగా ఆలపించినవాడు
వాడు మా తెలుగువాడే!
స్వరం, రాగం, తరంగం, గమనం, ఏదైనా
విశ్వ కళ్యాణానికే ఆలపించినవాడు
సంగీత ప్రపంచంలో వసుధైక కుటుంబం సాధించిన వాడు
వీడు మా తెలుగువాడే!

–"శక్తి"శివరామకృష్ణ
94414 27977

సంప్రదాయ విజ్ఞానం భాషకు ఊపిరి

బతుకుతెరువులు పట్టించుకోకుండా భాషను బతికించుకోలేం. తీరప్రాంత మత్స్యకారులు సముద్రంలో ఆయా తావులకు వాడే పదాలకు జి.ఐ.యస్ (జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం) ద్వారా జి.పి.యస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం) తో అనుసంధానం.

సంప్రదాయ జ్ఞానం భాషకు ఉపిరి వంటిది. ఆ ఊపిరి తగ్గుతున్న కొద్దీ, రచయితలు, భాషాభిమానులు కృత్రిమ శ్వాస కల్పిస్తూ, కొత్త జ్ఞానానికి అలవాటు చేస్తుంటారు.

ఒకనాటి భాషా పరిశోధకులు వృత్తి పదకోశాలు ప్రచురిస్తూ, ఆ పద సంపదను, పాలకవర్గం ప్రోత్సహించే పాశ్చాత్యజ్ఞానం, పరిభాషలతో మేళవించి ప్రచారంలోకి తేవాలని కోరుకున్నారు. ఆ లక్ష్యం వారి జీవితకాలంలో నెరవేరలేదు సరిగదా, 1960లోనే తయారైన వాటి అచ్చే పూర్తి కాలేదు. తరువాత వారి శిష్యులకూ పట్టలేదు. కొత్త జ్ఞానానికి తగ్గట్టు పదాలు సృష్టించి ప్రచార సాధనాల ద్వారా, జనం మీద రుద్దసాగారు. ప్రభుత్వం కూడా 'ప్రామాణిక' పద సంపదను బోధనలో ప్రవేశపెట్టి జనానికి దూరం కాసాగింది,

జ్ఞానంలో అన్ని సంప్రదాయాలు ఒకటే. కానీ ఒక్కో కాలంలో, ఒక్కో దేశంలో ఒకో నాణెం చలామణిలో ఉంటుంది. అలా మార్పు కోవ దానికి సాయపడే కృషి, భాష అస్మితను సజీవంగా ఉంచుతుంది. భూమిమీద స్థలాల పేర్లు అవసరం కాబట్టి కొన్నైనా వాడుకలో ఉంటాయి కానీ, సముద్రంలో ఆ యా తావుల పేర్లు వేటకు పోయే వారికి తప్ప, ఎవరికీ అవసరం లేదు. ఆ తావు పేరు చెపితే తప్ప, వారికైనా అక్కడి పరిస్థితి అంటే లోతు (బారలు), కదలికలు(అలలు, కెరటాలు), జీవజాలం ఉనికి (నమ్మ– బురద; నాచు, చేపలు వగైరా), ప్రమాదాలు (రాతి/కొండ తగుళ్ళు, మోదు, కొర్రులు) స్ఫురించవు.


భారత సర్వేక్షణ, తమపటాలలో స్థానికులువాడే కొన్ని స్థలాల పేర్లన్నా, కొండగుర్తులుగా పేర్కొంటారు కాని, సముద్రాన్ని అక్షాంశ, రేఖాంశాలలోనే ఉదహరిస్తారు. జి.ఐ.యస్.ద్వారా తీసిన కొలతలను జి.పి.యస్.కు అనుసంధానం చేస్తారు. ఉపగ్రహం ద్వారా సమాచారం సేకరించి అందజేస్తారు.


ఐతే, మత్స్యకారుల వాడుకలోగల తావులపేర్లు పేర్కొనకుండా చాలామంది శాస్త్ర వేత్తలు ప్రశ్నావళిద్వారా, చర్చల ద్వారా సంప్రదాయ జ్ఞానాన్ని సేకరిస్తుంటారు. ఆ నిర్ధారణలు గురికి బెత్తెడు దూరంలో ఉంటాయి. అది సంప్రదాయజ్ఞానంలో లోపం/ పరిమితిగా వారు తీర్మానిస్తుంటారు.

1990 తరువాత ప్రపంచీకరణ ప్రయత్నాలు, జ్ఞానంలో వివిధ కోణాలను గుర్తించే కృషి ఊపందుకుంది. ఇంతకాలం సహజవనరులు కొల్లగొట్టటంలో చేతులు కలిపిన పాలకవర్గాలు, శాస్త్రవేత్తల దృష్టి; సంప్రదాయ జ్ఞానం, మేధో సంపత్తి హక్కులు, ఉమ్మడి వనరుల వాడుక, హక్కుల గుర్తింపువైపుగా మళ్ళింది. 2002లో జీవ వైవిధ్య చట్టం, 2006 అటవీ హక్కులగుర్తింపు చట్టం వచ్చాయి.

మన రాష్ట్రంలో గిరిజనసాహిత్యం, జ్ఞానం మీద పరిశోధన చేసిన 'శక్తి' , గిరిజనోద్యమరంగంలో అప్పటికే పనిచేస్తుండడంవల్ల, వారు అటవీ హక్కులగుర్తింపులో ప్రభుత్వంతో చేసిన కృషి, ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా ఉన్నదని, ఉన్నతాధికారి యన్.సి. సక్సేనా తన నివేదికలో పేర్కొన్నారు. ఆ దిశలో చెంచులు, కొండరెడ్లు రాసుకున్న బతుకు కథలను నడుస్తున్న చరిత్ర, అమ్మనుడి పత్రికలు ప్రచురించాయి.

అడవిలోవలెనే సముద్ర తీర మత్స్యకారుల వాడుకలను 5 కి.మీ వరకు గుర్తించేందుకు ఒక ముసాయిదా బిల్లును 2009లోనే భారత ప్రభుత్వం పంపిణి చేసింది. ఈ 5 కి. మీ ఎక్కడి వరకో వారికి తెలియదు.





'ప్రళయ కావేరి' కథలలో '. జల్లల దొరువు, పునమాలతిప్ప. రాగన్న పట్టెడ, దిగులు తిప్ప. ఆటగాని తిప్ప. కసరేద్ది పాలెం. చెరువు కండ్రిగ, దావాది గుంటలు. కొరిడి, పేములపొద దొరువు, కొల్ల పట్టుదీవి. తోటకట్ల. పంటరంగం, చిన్నతోట. పెద్దతోట, పాముల తేరి, నలగ మూలలు. పడవ దీవి, గొల్లపాలెం, కట్టుపాలెం, నిమ్మడి తిప్ప. ఓడపాలెం, ఓటుకుప్పం, పంబలి, నిడిగుర్తి, మొన పాలెం, బుసపాలెం, రాయిగుంట పాలెం, బండ్లరేవు, కొక్కుపాలెం, పల్లంపర్తి, మల్లం. కాకరమూల, తేవల తెరికట్ట, నక్కదొరువు. చిన మంగోడు, పేద మంగోడు. దోనిరేవు. నొచ్చుకుప్ప, బీములోరిపాలెం' ఈ పేర్లు తగులుతాయి.

మత్యకారుల దేశ, కాలజ్ఞానం తెలుసుకునేందుకు, నేను, స.వెం.రమేశ్ ప్రళయకావేరి వెళ్లి అక్కడి పదాలు సేకరించాం, గాని వాటి పటం గీయలేకపోయాం.ఆ వివరాలు అమ్మనుడి ప్రచురించింది. మా సేకరణలో పై పదాలలో కొన్ని తగలలేదు.

ఈ కృషికి కొనసాగింపుగా, విశాఖజిల్లా పాయకరావుపేట మండలంలో తాండవనది సముద్రంలో కలిసే పెంటకోట గ్రామం ఎన్నుకొన్నాం. మా సహచరులు అక్కడి సముద్రవనరుల పటం గీశారు. మత్స్యకారులు, అనాదిగా కొన్ని గ్రామాల వారు ఒక సంఘంగా తమకట్టుబాటులను పాటిస్తుంటారు. అటువంటి 33 గ్రామాలలో పెంటకోట ఒకటి.

మా బృందం ఇలా వివరాలు సేకరిస్తుంటే, నేను ఈ దిశలో జరిగిన అధ్యయనాలను సేకరించాను. గతంలో నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్.ఆర్.ఎస్.సి.) తో పనిచేసిన అనుభవం మాకుంది. మనదేశంలో ఇంతవరకు ఈ దిశలో కృషి జరగలేదని తెలుసుకున్నాక, అనుకోకుండా అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజివారి ప్రాంగణంలోగల సెంటర్ ఫర్ ఇన్నోవేటివ్ పాలసీ స్టడీస్ (సిప్స్) డైరెక్టర్ డా.నివేదిత హరన్‌ను, అక్కడ సలహాదారుగా ఉన్న రచయిత, వీరభద్రుడుతో కలిసాము.

వారు అక్టోబరు 4న నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఇన్కొఇస్ (ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ స్టడీస్); ఎన్.ఆర్,ఎస్.సి.ఐ; ఇ.పి.టి.ఐ.(ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్); చెన్నైలో జీవవైవిధ్య బోర్డుసలహాదారు, ఏ.పి.సాక్. కర్ణాటక సాక్ (స్టేట్ రిమోట్ సెన్సింగ్ సెంటర్) నుండి శాస్త్రవేత్తలతో పాటు, విశాఖ జిల్లానుండి మత్స్యకార సంఘాలప్రతినిధులు పాల్గొన్నారు.

ఇన్కొఇస్‌వారు ఇచ్చే, జారీచేసే సలహాలు మత్స్యకారులకు అందనంత దూరంలో, లోతులో వేటాడే ట్రాలర్లకు,రింగ్ సైన్ (సోనా) పడవలకు మాత్రమే ఉపయోగపడుతున్నాయని, మత్స్యకారులు తమ జ్ఞానం మీదనే ఆధారపడి మనుగడ సాగిస్తున్నారని స్పష్టమైంది. కాబట్టి ఒక చిన్న ప్రాంతానికి హై రిజొల్యూషన్ మ్యాప్‌ను తయారుచేసి, ఒక గ్రిడ్ ద్వారా మత్స్యకారులు పిలుచుకునే తావులతో అనుసంధానించడం సాధ్యమేనని, ఇరు వర్గాల సమాచారాన్ని ఒక సంవత్సరంపాటు పోల్చిచూడాలని ఇందుకు కావలసిన ప్రతిపాదనలను ఎన్.ఆర్.ఎస్.సి సలహాదారు డా.కె. హనుమంతరావు తయారు చేస్తారని, ఆ ప్రతిపాదనలను సంబంధించిన సంస్థలతో పంచుకుని కార్యరూపంలోకి తేవడానికి 'సిప్స్' కృషి చేయాలని నిర్ణయించారు. ఈ కృషి

తరువాయి 36 వ పుటలో...

జానపదం

తెన్నాటి తెలుగుపాటలు



సామల మురళి



మిడిగ వళ్ళియమ్మ
(40)
రాగలబావి క్రిష్ణాపురం.

ఇప్పటి తమిళనాడు, తిరుపూరు జిల్లా, ఉడుమలపేట తాలూకాలోని రాగలబావి క్రిష్ణాపురం అనే పల్లెలో సేకరించిన పల్లెపాట ఇది. వాన కురవడంతో మొదలై జొన్నపంట పండి, పండిన గింజల్ని దాచిపెట్టడం వరకూ సాగే పాట ఇది. కేరళ ఎల్లకు ఆనుకొని ఉండే, ఇప్పటి ఆంధ్ర ఎల్లకు పొత్తేలేని తావు ఉడుమలపేట. ఆ తాలూకాలోని వందల పల్లెల్లో వేల పల్లెపాటలు తెలుగులోనే సాగుతున్నాయి ఇంకా. ఇక్కడి పల్లెపాటల్లో తమిళం పాటలు నాలుగయిదు నూర్వాలు కూడా ఉండవు. అంత తెలుగుమయం ఈ తావు. ఉడుమలపేటలో 'తెలుగువాణి' వితమరి (కార్యకర్త)గా పనిచేసిన సామల మురళి సేకరించిన పాట ఇది. సామల మురళి సొంతవూరు హోసూరు తావునున్న కొత్తపల్లి అనే పల్లెటూరు. ఈ పాటను పాడిన తల్లిపేరు మిడిగ వళ్ళియమ్మ, వయసు నలబై ఏండ్లు, కులం మాదిగవారు.

1. వానలు కురిసేనా....

వానలు కురిసేనా మామిడి వానలు కురిసేనా
ఈ నా మంచి నెల్లో మామిడి వానలు కురిసేనా
దుక్కులు దున్నేనా మామిడి దుక్కులు దున్నేనా
ఈ నా మంచి నెల్లో మామిడి దుక్కులు దున్నేనా
యితనాలిత్తేనా మామిడి యితనాలిత్తేనా
ఈ నా మంచి నెల్లో మామిడి యితనాలిత్తేనా
మొలకంట ముట్టేనా మామిడి మొలకంట ముట్టేనా
ఈ నా మంచి నెల్లో మామిడి మొలకంట ముట్టేనా
పైరంట ఉండేనా మామిడి పైరంట ఉండేనా
ఈ నా మంచి నెల్లో మామిడి పైరంట ఉండేనా
దంటంట ఉండేనా మామిడి దంటంట ఉండేనా
ఈ నా మంచి నెల్లో మామిడి దంటంట ఉండేనా
పీటంట తీసేనా మామిడి పీటంట తీసేనా
ఈ నా మంచి నెల్లో మామిడి పీటంట తీసేనా
యెన్నంట తీసేనా, మామిడి యెన్నంట తీసేనా
ఈ నా మంచి నెల్లో మామిడి యెన్నంట తీసేనా
సుంకంట పట్టేనా మామిడి సుంకంట పట్టేనా
ఈ నా మంచి నెల్లో మామిడి సుంకంట పట్టేనా
పాలంట పట్టేనా మామిడి పాలంట పట్టేనా
ఈ నా మంచి నెల్లో మామిడి పాలంట పట్టేనా
జొన్నంట ముదిరేనా మామిడి జొన్నంట ముదిరేనా
ఈ నా మంచి నెల్లో మామిడి జొన్నంట ముదిరేనా
దంటంట కోసేమా మామిడి దంటంట కోసేమా
ఈ నా మంచి నెల్లో మామిడి దంటంట కోసేమా
ఆరంట వేసేమా మామిడి ఆరంట వేసేమా
ఈ నా మంచి నెల్లో మామిడి ఆరంట వేసేమా
కట్టంట కట్టేమా మామిడి కట్టంట కట్టేమా
ఈ నా మంచి నెల్లో మామిడి కట్టంట కట్టేమా
కుచ్చంట ఊనేమా మామిడి కుచ్చంట ఊనేమా
ఈ నా మంచి నెల్లో మామిడి కుచ్చంట ఊనేమా

* * *

కుచ్చి కావిలికి నేడు ఓరినంపేది
నాకూడా పుట్టిండే నా తమ్ముడ్డంపండ
దుప్పటి లేకుండా తమ్ముండు పోలాపనేండు
నే దుప్పటిచ్చేను తమ్ముణ్ణి పొమ్మంట సెప్పండ
కట్టె లేకుండా తమ్ముండు పోలాపనేండు
ఈ కట్టె ఇచ్చేను తమ్ముణ్ణి పొమ్మంట సెప్పండ
బీడీ లేకుండా తమ్ముండు పోలాపనేండు
నే బీడీ ఇచ్చేను తమ్ముణ్ణి పొమ్మంట సెప్పండ
నిప్పెట్టి లేకుండా తమ్ముండు పోలాపనేండు
ఈ నిప్పెట్టిచ్చేను తమ్ముణ్ణి పొమ్మంట సెప్పండ
బేటరు లేకుండా తమ్ముండు పోలాపనేండు
నే బేటరిచ్చేను తమ్ముణ్ణి పొమ్మంట సెప్పండ
సెప్పుల్లేకుండా తమ్ముండు పోలాపనేండు
ఈ సెప్పులిచ్చేను తమ్ముణ్ణి పొమ్మంట సెప్పంట
కూడు లేకుండా తమ్ముండు పోలాపనేండు
నే కూడు ఇచ్చేను తమ్ముణ్ణి పొమ్మంట సెప్పండ

* * *

యెన్నంట కోసేము మామిడి యెన్నంట కోసేము
ఈ నా మంచి నెల్లో మామిడి యెన్నులు కోసేము
కల్లము అలికేము మామిడి కల్లము అలికేము
ఈ నా మంచి నెల్లో మామిడి కల్లము అలికేము
యెన్నూ ఎత్తేము మామిడి యెన్నూ ఎత్తేము
ఈ నా మంచి నెల్లో మామిడి యెన్నూ ఎత్తేము
కల్లాన వేసేము మామిడి కల్లాన వేసేము
ఈ నా మంచి నెల్లో మామిడి కల్లాన వేసేము
తాంబు తోలేము మామిడి తాంబు తోలేము
ఈ నా మంచి నెల్లో మామిడి తాంబు తోలేము
తూరుపు ఎత్తేము మామిడి తూరుపు ఎత్తేము
ఈనా మంచి నెల్లో మామిడి తూరుపు ఎత్తేము
వచ్చిన గింజల్లా నేండు ఎంచి పెట్టేము
ఈ నా మంచి నెల్లో మామిడి ఎంచి పెట్టేము

* * *



8.బౌద్ధానికి సవాళ్ళు

ఆత్మభావన పుట్టుక

మానవ సమాజాల్లో ఆత్మభావన బుద్ధునికి పూర్వం ఎప్పటి నుండో ఉంది. ఈ భావన ఒక్క భారతఖండంలోనే కాదు, చైనా, గ్రీకు, మెసపటోమియా, ఈజిప్టు మొదలైన పురాతన నాగరికతలు ఉన్న అన్ని సమాజాల్లో ఉంది. కొద్దిగా అటూ ఇటుగా చిన్నచిన్న తేడాలతో ఉంది తప్ప, దాదాపుగా అన్ని సమాజాల్లో ఒకే తీరుగా ఉంది.

అసలు 'ఆత్మ' అనేది ఒకటి ఉందని మొదటిగా తెలియ జెప్పింది ఎవరు? అనే ప్రశ్నకి ఠక్కున జవాబు దొరకడం కష్టమే. పుట్టడం గిట్టడం అనేవి సృష్టి సహజాతాలు. పుట్టుక, మనుగడ, మరణం...ఈ మూడూ క్రియల అనంత ప్రవాహమే ఈ సృష్టి. మరణించేది మరలా పుడుతుందా? పుడితే అదే రూపంగా, అదే జీవిగా, అదే స్త్రీగా, అదే పురుషునిగా పుడుతుందా? – ఈ ప్రశ్నలు అనాది నుండి ఇప్పటి వరకూ వస్తూనే ఉన్నాయి. వీటిపై తెగని వాదోపవాదాలు సాగుతూనే ఉన్నాయి. రకరకాల తాత్త్విక దృక్పథాలకి పుట్టిల్లు అవుతూనే ఉన్నాయి.

అసలు ఈ ఆత్మభావన మనిషికే ఉందా? మిగిలిన జీవులకూ ఉందా?– అనేది ఆలోచిస్తే, అసలు ఆత్మభావన పుట్టడానికి మూల కారణం ఏదో తేలిగ్గానే తెలుస్తుంది.

ఆత్మభావన 'ఆత్మభవం' కాదు. స్వయంభూ కాదు. అంటే తనకు తనుగా పుట్టింది కాదు.

"ఇదిగో, నేను ఆత్మను. నేను పరమాత్మను" అని ఆత్మ స్వయం గా ప్రకటించిందీ కాదు.

అది మనుషుల ఊహల్లో అలలుగా తేలియాడుతూ కని పించే ఎండమావి లాంటిది. ఎందుకంటే మానవ సమాజాల నాగరిక ఊహల్లో పెద్దది ఈ ఆత్మభావన.

'ఆత్మ' అనే పదానికి జీవం, చైతన్యం, ఎరుక, స్పందన ఇలాంటి నిర్వచనాలు ఎన్నో ఉన్నాయి. నిజానికి చైతన్యమే చరాచర ప్రపంచాన్ని జీవ, నిర్జీవాలుగా వేరు చేసింది. చైతన్యం, స్పందనలు ఉండే వాటిని జీవులనీ, స్పందనలేని వాటిని నిర్జీవులనీ మనిషే వేరు పరచుకున్నాడు. ఈ చైతన్యం కల్గిన జీవుల్లో కూడా బాహ్యస్పందనలు లేకుండా ఒకే ప్రదేశంలో కదలకుండా స్థిరంగా ఉండేవాటిని స్థావరాలు గా(చెట్లు), ఒక ప్రదేశాన్నుండి మరో ప్రదేశానికి కదిలేవి, వెంటనే స్పందనలు చూపించేవాటిని జంగమాలు (జంతు వులు) గా పిలుచుకున్నాడు. వీటిల్లో కదిలే చైతన్యం, బ్రతికే చైతన్యం ఎవ్వరికి ఉందో – వాటికే 'ఆత్మ'లు ఉన్నాయని తొలుత భావించాడు. అంటే చైతన్యమే 'ఆత్మ' అని నమ్మాడు. చనిపోయాక చైతన్యం ఉండదు కాబట్టి, దేహం ఉంటుంది కాబట్టి, మాయమై పోయిన ఆ చైతన్యమే జీవునిగా, ఆత్మగా, – భావించాడు.

గాలి కదులుతుంది. నదులు కదులుతాయి. సముద్రం నిరం తరం స్పందిస్తూనే ఉంటుంది. కాబట్టి వాటికీ ఆత్మలు ఉన్నాయని నమ్మినవారూ ఉన్నారు. చివరికి, కదలకపోయినా 'కనిపిస్తూ ఉన్నాయి' కాబట్టి కొండలకీ, అడవులకీ, ఎడారులకీ ఆత్మలున్నాయనే భావనలూ పుట్టాయి. బాటలు వేయాలంటే చెట్లు కొట్టాలి, అడవులు నరకాలి, గుట్టలు పగులగొట్టి చదును చేయాలి. అంటే వాటి ఆత్మలను క్షోభ పెట్టాలి కాబట్టి రహదారులు నిర్మంచకూడదు – అనే భావన గ్రీకుల్లో ఎంతో కాలం ఉంది.

చైతన్యంపరంగా చూస్తే నిరంతరచైతన్యం కలిగింది సముద్రం. కాబట్టి అన్ని ఆత్మలకూ అదే మూలం అని మరి కొందరు భావించారు. వారే సముద్రంమీద పడవలు, ఓడలు ద్వారా ప్రయాణించడం నేరంగా, పాపంగా నమ్మారు.

ఇలాంటి ఆత్మ భావాలు ప్రపంచంలో అన్ని చోట్లా ఏదో ఒక రూపంలో ఉన్నాయి. ఈ భావనలు ఎక్కడ పుట్టినా వాటికి మూలం మాత్రం పదార్థాల్లో (శరీరాల్లో) కన్పించే చైతన్యమే.

శరీరం, ఇతర భౌతిక రూపాలు మన కంటికి కన్పిస్తాయి. మన జ్ఞానానికి అందుతాయి. కానీ, ఈ చైతన్యం మాత్రం అందదు. కన్పించదు. దాని రంగూ, రుచీ, వాసన, స్పర్శ, సవ్వడి ఏమిటో ఎవ్వరికీ తెలియదు.

కానీ, ఆ చైతన్యం ఉంటేనే జీవి జీవిస్తుంది. పెరుగుతుంది. తిరుగుతుంది. చూస్తుంది. వింటుంది. స్పందిస్తుంది. కోపం, ఆవేశం, ప్రేమ, జాలి, కరుణ, కర్కశాల్నీ చూపెడుతుంది. అలా చేసేది ఎవరు? జీవ ప్రవాహాన్ని నడిపించేది ఎవరు? ఇవేమంత తేలికైన ప్రశ్నలు కావు. మానవ మేధస్సుని ఎన్నో వేల సంవత్సరాలుగా

తోడేస్తున్న ప్రశ్నలు...ఎందుకంటే...

నమ్మకం అదే, నిజం అదే

ఈ ప్రశ్నల్లో ఒక 'నమ్మకం' ఉంది. ఒక 'నిజం' ఉంది. ఇదే ఈ ప్రశ్నల్లోని విశేషం. అందుకే...ఆత్మ గురించిన సాగిన పరిశోధనలూ ఈ రెండు దారులుగా చీలిపోయాయి. 'నమ్మకం' మీద నిలబడి చేసిన విశ్లేషణలన్నీ ఆధ్యాత్మికాలుగా, నిజం మీద నిలబడి చేసిన శోధనలన్నీ వైజ్ఞానికాలుగా రూపొందాయి.

ఈ దారుల్లో బౌద్ధానిది వైజ్ఞానిక దారే.

జీవుల్లో ఉన్న బాహ్య కదలికల్ని చూసి లేదా స్పందనల్ని చూసి మాత్రమే ఆత్మభావన పుట్టింది అని అనుకోవడం సరైనది కాదు. అన్ని జీవులూ తమ తమ జీవుల్లో కదలికల్ని, ఇతర స్పందనల్నీ చూస్తూనే ఉన్నాయి. కోపతాపాలనూ, ప్రేమానురాగాలనూ, కామోద్రేకాలనూ ప్రదర్శించుకుంటూనే ఉంటాయి. అయినా ఆ జీవులకు ఆత్మభావనలు ఉన్న ఆధారాలేవీ ఇంత వరకూ లభించలేదు.

జీవితంలో వాటికి కన్పించే స్పందనలు ఆ స్పందనల తాలూకూ వాటి మెదడులో నిలచి ఉండే ముద్రలు – చాలా చాలా స్వల్పకాలం మాత్రమే ఉండిపోతాయి. సహజాత జీవన క్రియలు తప్ప ఇతర క్రియలూ, వాటి తాలూకూ స్పందనలూ, ప్రతిస్పందనలూ చాలా చాలా కొద్దికాలం మాత్రమే మెదడులో నిలబడతాయి. వాటిని రికార్డు చేసుకుని భద్రపరచుకునే సామర్థ్యం వాటి మెదళ్ళకు లేదు.

అందుకే...పాము తనని తొక్కిన వ్యక్తినో, కొట్టిన వ్యక్తినో... కొన్ని క్షణాల తర్వాత మర్చిపోతుంది. ఆ వ్యక్తినే కాదు, ఆ సంఘటనని కూడా మర్చిపోతుంది. కానీ కొన్ని జీవులు అలా కాదు. చాలా కాలం గుర్తుపెట్టుకుంటాయి. ఇలా దీర్ఘకాలం సంఘటనల్ని గుర్తుపెట్టుకుని, ప్రతిస్పందించే జీవుల్లో మానవుడు మొదటివాడు. లేదా ఒకే ఒక్కడు.

ఈ దీర్ఘ కాలిక ముద్రలే – మనిషిలో ఆత్మ భావనల పుట్టుకకి కారణాలయ్యాయి.

మనస్సులో లేదా మెదడులో దీర్ఘకాలంగా నిలబడే ఈ ముద్రల వల్ల ఏమి జరుగుతుంది?

మనో ముద్రలే కలలు

మనిషికి 'కలలు' వస్తాయి. కలల్ని విశ్లేషించడం, వాటికి మూలమైన చేతన, ప్రాక్‌చేతన, అచేతనలనే మనో అవస్థల్ని విశ్లేషించడం ఇక్కడ ఈ వ్యాస పరిధికి అనవసరం. కాబట్టి అసలు విషయానికే వద్దాం –

మానవులే కలలు కంటారా? మరి కోతులు, చింపాంజీల నుండి మనిషి పరిణామం చెందాడు కాబట్టి నరవానరాలూ 'కలలు' కంటాయా?– అంటే...'కనవు' అనే పరిశోధనలు తేల్చాయి.

మానవ పరిణామ క్రమంలో...5 లక్షల సంవత్సరాలనాడు 'హోమో ఎర్గాస్టర్' అనే ఒక జాతి రూపొందింది. ఈ జాతి మానవుల మెదడు పరిణామం 900 ఘ.సెం.మీ.ఈ జాతి మానవులకు కలలు కనే మనో సామర్థ్యం ఉంది. అంతకు ముందున్న నరవానరాలకి గాని, వానర నరులకి గానీ కలలుగనే సామర్థ్యం లేదు. స్వప్నంలో దృగ్గోచరమైన ప్రపంచాన్ని చూడ్డం ఒక వింత అనుభూతి. స్వప్నంలో సంఘటనల్ని చూసి, ఆనందించడం, భయపడడం కూడా వింత అనుభూతులే!

తన కళ్ళ ఎదుట లేనివారు, దూర ప్రాంతాల్లో ఉన్నవారు, ఎప్పుడో చనిపోయిన వారు కూడా స్వప్నంలో కనిపించడం, వారితో మాట్లాడడం, వారితో సరదాగా గడపడం, కోపతాపాలు ప్రదర్శించడం, ఆకాశంలో పక్షుల్లా తేలిపోవడం...ఇలాంటి కలలన్నీ మనిషిని కలవరపెట్టాయి. ఆలోచింపచేశాయి. భయపడుతూ, ఏడుస్తూ నిద్ర లేవడం, స్వప్నంలో వీర్యం స్ఖలించడం ఇలాంటి విషయాలు ఆలోచనల్ని రేకెత్తించాయి. తనలో మరొకరు ఉన్నారనే భావనలు కలిగించాయి. తనలాగే ప్రతివారిలోనూ 'ఎవరో ఒకరు' ఉన్నారనే ఆలోచనలు రేకెత్తించాయి. దూరప్రాంతాల్లో ఉన్నవాళ్ళు కన్పించడం, అలాగే ఎప్పుడో చనిపోయిన వారూ కన్పించడం అనేది ఎలా సంభవం?

ప్రతి వ్యక్తిలో 'మరొకరు ఎవరో' ఉన్నారు అని అనుకున్ననాడే ఆ 'మరొకరి' ఆలోచనే నెమ్మదిగా ఆత్మభావనగా మారింది. చనిపోయిన వ్యక్తి తన కళ్ళ ఎదుటే నశించి పోయాడు. కాలి బూడిదయ్యాడు. లేదా మట్టిలో కలిశాడు. కానీ ఆ వ్యక్తే తాను నిద్రపోతున్నప్పుడు ఎలా వచ్చి కన్పిస్తున్నాడు, అంటే...ఆ వ్యక్తిలో 'నశించనిది' ఏదో ఉంది అని అనుకున్నాడు. ఆ నశించనిది ఏదైతే ఉందనుకున్నాడో దాన్నే జీవునిగా, ఆత్మగా భావించుకున్నాడు. తాను నిద్రిస్తున్నప్పుడు తనలోని ఆత్మే–ఆ ఇతర ఆత్మల్ని చూస్తుంది, వారితో మాట్లాడు తుంది అనీ ఊహించాడు.

ఈ ఊహ 'నిజం కాకపోవచ్చు' కానీ తప్పు మాత్రం కాదు. ఈ ఊహించే నైపుణ్యమే మనిషి మానసిక స్థాయిని పెంచింది. మెదడు పరిమాణాన్ని పెంచింది. మెదడు పరిణామానికి దారి తీసింది.

ఈ ఆత్మ భావనలు పెరిగి పెరిగి పెద్దవై జీవాత్మ, పరమాత్మ, ప్రేతాత్మ...ఇలా రకరకాల రూపాలు తీసుకున్నాయి. చివరికి శంకరాచార్యుని 'ఏకాత్మ' దాకా సాగి వచ్చాయి.

క్రీ.పూ. వెయ్యి సంవత్సరాల వరకూ ప్రపంచంలో ఉన్న ఆత్మ భావన ఇదే...

'ఆత్మ' ఘోష.

నిద్రించే వ్యక్తి 'ఆత్మ' అతని శరీరాన్ని వదిలి ఎక్కడెక్కడికో వెళ్ళి ఆయా ప్రదేశాల్ని చూసి వస్తుంది. ఆయా వ్యక్తుల్ని కలసి వస్తుంది. అలా వెళ్ళి తిరిగి తన దేహంలోకే వస్తుంది. అలా అది తిరిగి రాగానే మెలకువ వస్తుంది.. అని నమ్మాడు మనిషి. తిరిగి అదే శరీరంలోకి రావడం అనేది మనిషి స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకున్నాకే ఈ భావన పుట్టింది. ఎక్కడెక్కడ తిరిగినా తన 'ఇంటికి' చేరుకొనే సమాజంలో బ్రతికే స్థిరనివాసికి మాత్రమే మూలనివాస ప్రాముఖ్యత తెలుస్తుంది. అందుకే...ఆత్మ ఎక్కడెక్కడ తిరిగినా చివరికి తన 'ఇల్లు' అయిన అదే శరీరానికి వస్తుంది అని నమ్మాడు. ఈ నమ్మకంలోంచే చావుని 'దీర్ఘనిద్ర'గా భావించాడు.

'ఆత్మ ఎప్పటికైనా తిరిగి వస్తుంది' అని బలంగా నమ్మిన సమాజాల్లో – శవాల్ని భద్రపరచే ప్రక్రియలు పుట్టాయి. ఈ 'నమ్మకం' ఈజిప్టులో పిరమిడ్ల రూపంలో, దానిలో భద్రపరిచిన శవాలు 'మమ్మీల' రూపంలో దర్శనమిస్తుంది.



ఈ ఆత్మభావన భారతదేశంలో మరో రూపంలో ఉంది. "మనం చనిపోయాక ఆత్మ స్వర్గానికి చేరుతుంది. అక్కడే ఉండి పోతుంది'. అనేది వేదకాలం నాటి ఆత్మభావన. మనిషితో పాటు బలికాబడ్డ జంతువులు, యజ్ఞక్రియలో పాల్గొన్న చెట్లకు కూడా స్వర్గ ప్రాప్తినిచ్చాయి వేదాలు. వేదాల ప్రకారం ఆత్మలు ఎలాగూ తిరిగి రావు కాబట్టి, ఇక్కడ మమ్మీల్లా మార్చి దేహాల్ని భద్రపరిచే నమ్మకాలు పుట్టలేదు. ఆత్మ పోగా మిగిలిన శరీరాన్ని కాల్చడం, ఖననం చేయడం లాంటి ఆచారాలు పుట్టాయి.

ఏటిలోని పడవలన్నీ అవతలి ఒడ్డుకే చేరి, ఇక తిరిగి రాకపోతే ప్రయాణం ఎలా? అలాగే...వెళ్ళిన ఆత్మలు తిరిగి రాకపోతే "జీవుల ప్రయాణం" ఎలా? పుట్టుకలు ఎలా? – అనే ఆలోచన కలిగి ఆత్మలు తిరిగి వస్తాయనే ఆలోచన ఇక్కడా వుంది.ఈ ఆలోచన క్రీ.పూ800 నుండి ఇక్కడ కన్పిస్తూ ఉంది. బృహదారణ్యక ఉపనిషత్తులో ఈ విషయం తొలిగా కన్పిస్తుంది.

ఆ తర్వాత ఈ ఆత్మలకు కేంద్రంగా ఒక ప్రత్యేక ఆత్మ ఉందని, అదే పరమాత్మ అని, మట్టినుండి రకరకాల కుండలు, ఇటుకలు పుట్టినట్టు అనేక రకాల జీవులూ, మానవులూ పుట్టుకొస్తున్నారనే వాదాన్ని ఉపనిషత్తులు వెలువరించాయి.

ఇదంతా ఉపనిషత్తులు, ఆ తర్వాత వచ్చిన దర్శనాలు – వినిపించిన 'ఆత్మ' ఘోష.

ఆత్మా ? మనసా?

మరి బుద్ధుడు అనాత్మ వాది కదా! బౌద్ధం ఆత్మను ఒప్పుకోదు కదా! – మానవుని మనో ముద్రల్నుండి పుట్టిన స్వప్న సందేశాల పరంపరలు ఆత్మవాద పుట్టుకకు మూలం అయితే – బౌద్ధం ఆ మూలాల్ని ఎలా చూసింది? అనేదే ఇక్కడ ప్రధానాంశం.

కలలు కనేది ఎవరు? అనే విషయమే ఆ విషయాన్ని తేలుస్తుంది. ఆ విషయం తేల్చాలంటే మనం మనకు మనస్సులో ముద్రల్ని ఏర్పరచే వ్యవస్థ దగ్గరకు వెళ్ళాలి. ఆ వ్యవస్థే – జ్ఞానేంద్రియ వ్యవస్థ.

ఈ జ్ఞానేంద్రియ వ్యవస్థ ఒక్క మానవులకే కాదు. అన్ని జీవులకూ ఉంది. అన్ని జీవులూ తమ చుట్టూ ఉన్న ప్రకృతిని తెలుసుకుంటాయి. అలా తెలుసుకుని తదనుగుణంగా నడుచుకుంటాయి. ఈ ఇంద్రియ వ్యవస్థ ఒక్కో జీవిలో ఒక్కో రకంగా ఉంటుంది. కొన్నింటికి ఏదో ఒక వ్యవస్థ మిగిలిన ఇంద్రియాలకంటే బలంగానూ ఉంటుంది.

జ్ఞానేంద్రియాలు ఐదు అని అందరికీ తెలుసు. అంటే..జ్ఞానాలు ఐదు రకాలుగా మనకి అందుతాయి. చూపు, వినికిడి, రుచి, వాసన, స్పర్శ – ఈ ఐదు విధాలుగా మనం జ్ఞానాన్ని పొందుతాం. ఈ ఐదు జ్ఞానాలకూ ఐదు సాధనాలు ఉన్నాయి. చూపుకి కన్ను, వినికిడికి చెవి, రుచికి నాలుక, వాసనకి ముక్కు, స్పర్శకి చర్మం – ఈ సాధనాలే జ్ఞానేంద్రియాలు.

ఈ ఐదు సాధనాలు బాహ్య ప్రపంచ విషయాల్ని మనకి చేరవేస్తాయి. మనకి అంటే...మన మెదడుకి. ఆధ్యాత్మిక వాదంలో చెప్పాలంటే మనలోని ఆత్మకి. 'మన ఆత్మ ఈ సాధనాల ద్వారా విషయాల్ని గ్రహిస్తుంది'. అనేది ఆత్మవాదుల నమ్మకం.

అసలు జ్ఞానం ఈ ఐదు రకాలుగానే ఎందుకు కలగాలి? అనేది మరో ప్రశ్న! – ఎందుకంటే...'జీవ ప్రపంచం అంతా, ముఖ్యంగా మానవ ప్రపంచం ఐదు భూతాల కలయికతో ఏర్పడింది కాబట్టి. ఆకాశం, గాలి, నిప్పు, నీరు, నేల అనేవి పంచభూతాలు. ఈ పంచభూతాల కలయికే జీవుల శరీరం. ఈ శరీరం ఆత్మకి ఆవాసం. ఆత్మ, పంచభూతాల నిర్మితమైన శరీరంతో పంచజ్ఞానాల్ని పొందుతుంది'– దాదాపు ఉపనిషత్తులు, దర్శనాలు అన్నీ ఇదే విషయాన్ని కొద్దిగా అటో, ఇటోగా చెప్పాయి. అయితే కణాదుని వైశేషిక దర్శనం మాత్రం నీటి వివరాల్ని విశేషంగా చెప్పింది.

ఆకాశం, గాలి, నిప్పు, నీరు, నేల అనే ఐదు భూతాలు ద్రవ్యాలు. అంటే భౌతిక పదార్థాలు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు ఈ ద్రవ్యాల గుణాలు.అదిలా ఉంటుంది.

ద్రవ్యం	గుణం
1.ఆకాశం	**శబ్దం** (దీనికి ఒకే గుణం)
2.గాలి	శబ్దం + **స్పర్శ** (దీనికి స్పర్శ ప్రత్యేక గుణం)
3.నిప్పు	శబ్దం + స్పర్శ + **రూపం** (రూపం ప్రత్యేక గుణం)
4.నీరు	శబ్దం+స్పర్శ+రూపం+**రుచి** (రుచి ప్రత్యేకగుణం)
5.నేల	శబ్దం+ స్పర్శ+రూపం+రుచి+**వాసన** (వాసన ప్రత్యేక గుణం)

ఆకాశం కనిపించదు...కేవలం 'శబ్ద' గుణాన్ని బట్టే దాన్ని గమనిస్తాం. గాలీ కనిపించదు. అయినా గాలిని శబ్దాన్ని బట్టి గమనిస్తాం, ఇంకా స్పర్శని బట్టీ గమనిస్తాం. అంటే గాలిని రెండు రకాలుగా గమనించగలం. అలాగే నిప్పుని భగభగ అనే శబ్దాల్ని విని, తాకి కాలడాన్ని బట్టి, ఎర్రగా ఎగసిపడే జ్వాలల్ని చూసి గమనిస్తాం... ఇలా మిగిలిన ద్రవ్యాలు కూడా...

వీటిలో "చూపు" గురించి చూద్దాం.

కంటితో చూడాలంటే...?

చూపుకు సంబంధించిన విశేష గుణం అగ్ని లేదా కాంతి. ఈ 'చూడడం' అనే విషయం అగ్ని గుణమైన కాంతిని బట్టీ గ్రహిస్తాం.

సైన్స్ కూడా ఇదే చెప్తుంది. మనం ఒక వస్తువును చూడాలంటే 'కాంతి' ఉండాలి. పగలు సూర్యుని కాంతి ఉంటుంది. రాత్రి కాంతి ఉండదు. అందుకే పగలు ఏ వస్తువులైతే ఉన్నాయో ఆ వస్తువులన్నీ రాత్రి చీకట్లో కన్పించవు. కాబట్టి కంటి ద్వారా మనం వస్తువుని చూడాలంటే కాంతి ఉండాలి.మనకు వస్తు రూప జ్ఞానం ప్రధానంగా ఆరు అంచెలుగా అందుతుంది.

1. కాంతి ఉండాలి.
2. అది వస్తువు మీద పడాలి
3. అలా పడిన కాంతిని ఆ వస్తువు తన ద్వారా పోనీయకుండా అడ్డుకోవాలి. ...అంటే ఆ వస్తువు కాంతి నిరోధకమై ఉండాలి.
4. ఆ నిరోధక వస్తువు తన మీదపడిన కాంతిని వెనక్కి తిప్పి పంపాలి.
5. అలా తిరిగి వచ్చిన కాంతి కనుపాప (కటకం) గుండా వచ్చి కంటిలోని రెటీనా మీద పడాలి.
6. అలా పడిన కాంతిని గ్రహించి మెదడుకు చేర్చే దృక్ నాడీ వ్యవస్థ ఉండాలి. –

ఈ వ్యవస్థలన్నీ ఉంటేనే మనం ఒక వస్తువుని చూడగలం. చూసి, ఆ వస్తువు తాలూకు జ్ఞానాన్ని పొందగలం. అది ఏ రంగులో ఉందో, ఏ ఆకారంలో ఉందో తెలుసుకోగలం. రంగూ, ఆకారాన్ని తెలుసుకోవడమే 'దృష్టిజ్ఞానం'.

అలాగే మిగిలిన జ్ఞానాలు కూడా! ధ్వని చేయగల వ్యవస్థ ఉండాలి. ధ్వని ప్రయాణం చేయడానికి ఒక యానకం (గాలి; లేదా చెక్క రేకులాంటి పదార్థాలు) ఉండాలి. ఆ ప్రయాణించిన ధ్వని తరంగాల్ని గ్రహించే కర్ణభేరి ఉండాలి. దాని నుండి మెదడుకు తీసుకు పోయే నాడీ వ్యవస్థ ఉండాలి. ఈ వ్యవస్థలన్నీ ఉంటేనే శబ్దజ్ఞానం మనకు కలుగుతుంది.

అలాగే మిగిలిన జ్ఞానాలన్నీ –

అంటే ఈ వ్యవస్థలు లేకుండా. మనం ఏ దృశ్యాన్ని చూడలేం. ఏ శబ్దాల్నీ వినలేం!

ఇది నిజమా? – అంటే... కాదనే చెప్పాలి.

కళ్ళు మూసినా చూడగలం

ఇంతకు ముందు మనం చెప్పుకున్న పై కారణాల్లో ఏ ఒక్కటి లేకపోయినా మనం ఆ జ్ఞానాన్ని పొందలేం. కానీ, ఏ ఒక్కటో కాదు, అన్నీ లేకపోయినా ఈ జ్ఞానాల్ని పొందగలం. చూడగలం, వినగలం, రుచి తెలుసుకోగలం –

నిజమా? సాధ్యమా? ఎలా?

నిజమే! సాధ్యమే! ఇలా...

మీరు ఏ మంత్ర తంత్రాలో ప్రయోగించనవసరం లేదు. తాళ్ళూ తాయెత్తులూ, రుద్రాక్షలూ కట్టుకోనవసరం లేదు. విభూతి రేఖలు పులుముకోనవసరం లేదు.ఇందులో ఏ మాయలూ లేవు – మీరు చేయాల్సింది ఒక్కటే...

తృప్తిగా తిని, హాయిగా నిద్రపోవడం. నిద్రపోతే చాలు. నిద్రలో ఇవ్వన్నీ చేయగలం. నిద్రపోతే "కలలు" కంటాం గదా! ఆ కలల్లో చూడగలం, వినగలం, రుచి చూడగలం, వాసనలు గ్రహించ గలం, స్పర్శ అనుభూతుల్ని పొందగలం.

ఈ పనులన్నీ ఎలా చేయగలం? –

ఈ పనులన్నీ చేసేది 'ఆత్మ' అని ఆత్మవాదులు చెప్పారని మనం ఈ వ్యాసం మొదట్లో చర్చించాం –

కానీ, ఈ పనులన్నీ 'మనస్సు' చేయగలదని బుద్ధుడు ఆవిష్కరించాడు.

ఆధ్యాత్మిక వాదులు 'ఆత్మ' అన్నదాన్ని బుద్ధుడు 'మనస్సు'గా నిర్ధారణ చేశాడు. మనిషికి కేంద్రం 'ఆత్మ', పరమాత్మ' లని ఉపనిష

త్తులు బోధిస్తే – మనిషికి కేంద్రం 'మనస్సు' అని బుద్ధుడు ప్రబోధించాడు. 'మనస్సు'ను మనిషికి కేంద్రంగా చేశాడు.

మనం ఇంద్రియాల ద్వారా పొందేది 'జ్ఞానం'. ఈ జ్ఞానం మనస్సులో (చిత్తంలో) ముద్రలుగా భద్రపరచబడతాయి. దీర్ఘకాలం నిలబడతాయి. ఈ ముద్రలే 'కలలుగా' మనకు ప్రత్యక్షం అవుతాయి. అందుకే బుద్ధుడు జ్ఞానేంద్రియాల్ని ఆరు అని చెప్పాడు. ఆయన దృష్టిలో 'మనస్సు' కూడా ఒక ఇంద్రియమే. ఇలా మనస్సులో ముద్రలుగా ఏర్పడ్డ జ్ఞానమే "విజ్ఞానం".

'జ్ఞానం' అనేది మనం ఇంద్రియాలద్వారా పొందేది.

'విజ్ఞానం' అనేది చిత్తంలో భద్రపరచబడ్డది.

మన మనస్సు అనేక విషయాల్ని సమన్వయం చేసుకొనేది ఈ 'విజ్ఞానం' ద్వారానే!

మనస్సుని, మనోస్థితుల్ని తొలిగా విశ్లేషించింది బౌద్ధమే! మనో వైజ్ఞానిక శాస్త్రానికి పునాదులెత్తిందీ బౌద్ధమే!

ఇంద్రియ జ్ఞానాల్ని 'ఆత్మ, పరమాత్మల' మాయాజాలం నుండి సరైన శాస్త్రీయ కోణంలోకి మలచి మనో ఆవిష్కరణ చేసి, విజ్ఞానాన్ని వైజ్ఞానిక దారులకు మళ్ళించిందీ బౌద్ధమే!

మహాస్వప్న జాతక కథ

బుద్ధునికున్న గతితార్కిక భౌతిక వాద దృష్టే దీనికి కారణం. బౌద్ధంలో కలల్ని విశ్లేషిస్తూ , రాబోయే కాలంలోని ఆర్థిక,సామాజిక, రాజకీయ, నైతిక పరమైన మార్పుల్ని ఊహిస్తూ చెప్పిన " మహాస్వప్న జాతక కథ " ఒక ఆణిముత్యం. ఒక రాజుగారికి వేకువ ఝాములో 16 కలలు వస్తాయి. ఆ కలలు వింతగా విచిత్రంగా తోస్తాయి. రాజుకు భయం వేస్తుంది. నిద్రపట్టదు. వెంటనే ఆస్థాన పురోహితుణ్ణి, జ్యోతిష్యుణ్ణి పిలిపించి తన కలలు గురించి చెప్తాడు. వారిద్దరూ కూడబలుక్కుని "రాజా! ఇవి కీడు కలిగించే కలలు. మీకూ, మీ రాజ్యానికీ చేటు. ఈ కీడు తొలగాలంటే మహాయజ్ఞం చేయాలి" అని భయపెడతారు. రాజు సరేనంటాడు. వారు ఆనందంతో బైటకు రాగానే వారి వెంటే ఉన్న శిష్యుడు "గురువుగారూ! ఈ కలల గురించి గానీ, వీటికోసం చేయాల్సిన యజ్ఞంగురించి గానీ మన శాస్త్రాల్లో ఎక్కడా లేదే? ఇలా చేయడం తప్పు కాదా?" అని అడుగుతాడు. వెంటనే గురువు "ఓరి! నీచుడా! పెద్దగా అరవకు. వారి అజ్ఞానమే మనకు భుక్తి. చూడబోతే నిజం పలికి రాజుకు మేలు, మనకు కీడూ కలిగించేలా వున్నావు. మారు మాటాడకు. చెప్పింది చేయి" అని తిట్టి పోస్తాడు. శిష్యుడు అయిష్టంగానే "సరే" నంటాడు.

ఆ తర్వాత ఈ విషయం రాణికి తెలుస్తుంది. ఆమె రాజు గారితో "ఈ కలల విషయం ఒకసారి బుద్ధభగవానునికి తెలియ జేయండి" అంటుంది. రాజు బుద్ధుని దగ్గరకు వెళ్ళి కలల విషయం, తన భయం గురించి చెప్తాడు. బుద్ధుడు రాజుకు ధైర్యం చెప్పి ఒక్కొక్క కలగురించి చెప్పమంటాడు. అది విని ప్రతీకలగురించి విశ్లేషించి చెప్తాడు.

అందులో...ఒక విషయం చూద్దాం..

రాజు గారి కల :

ముందు, వెనుక రెండు తలలున్న ఒక గుర్రం ఒకేసారి గడ్డీ, గుగ్గిళ్ళు తింటూ ఉంటుంది.

దీనికి బుద్ధుని సమాధానం :

రాబోయే కాలంలో న్యాయం చెప్పాల్సిన న్యాయాధీశులు ఇటు వాది దగ్గర, అటు ప్రతివాది దగ్గర ఇద్దరిదగ్గరా లంచాలు మేస్తారు. అన్యాయమైన తీర్పులు చెప్తారు.

ఇలా 16 కలలకు 16 విశ్లేషణలుంటాయి. ప్రపంచంలో కలల్ని విశ్లేషించిన మొట్టమొదటి మనోవైజ్ఞానిక శాస్త్ర ఆనవాలు ఈ 'మహాస్వప్న జాతకం.

బౌద్ధుల వైజ్ఞానిక దృక్పథం

బుద్ధుని తర్వాత ఈ మనో విశ్లేషణలు బౌద్ధంలో మరింత పెరిగాయి. మహాయాన సంప్రదాయంలో ఒక శాఖ విజ్ఞానవాదం. వసుబంధు దీని మూల తాత్త్వికుడు. నేటి పాకిస్తాన్‌లో ఉన్న పెషావర్ (ఒకనాటి పురుషపురం)లో వసుబంధు, అసంగుడు అనే బౌద్ధ తాత్త్వికులు ఉన్నారు. వీరిద్దరూ అన్నదమ్ములు. ఈ విజ్ఞాన వాదాన్ని 'యోగాచారం' అని కూడా అంటారు. వీరిద్దరితోపాటు ఆర్య మైత్రేయుడు, దిగ్నాగుడు, ధర్మకీర్తి, శాంతి రక్షితుడు – వీరంతా ఈ విజ్ఞానవాద సంప్రదాయానికి చెందిన మేటి బౌద్ధులే!

అసంగుడు రాసిన 'యోగాచార భూమి' బౌద్ధ వైజ్ఞానిక దృక్పథానికి మచ్చుతునక.

బుద్ధుడు చెప్పిన ఆరో ఇంద్రియానికి వీరు మరో రెండు ఇంద్రియాల్ని తోడు జేసి మొత్తం 'జ్ఞానేంద్రియాలు ఎనిమిది' అనే విషయాన్ని ప్రకటించారు. అయితే వీరు ప్రకటించిన ఆ జ్ఞాన సాధనా వ్యవస్థలు రెండూ మనస్సుకు (మెదడుకు) చెందిన వ్యవస్థలే. వీరి విభజన ఈనాటి ఆధునిక మెదడు విభజనకు సరిపోతుంది.

1.జ్ఞానాన్ని అందుకొనడం 2. దాన్ని 'గుర్తింపుగా' మార్చుకోవడం, 3. తిరిగి విజ్ఞానంగా ప్రదర్శించడం –

ఈ మూడూ పెద్ద మెదడు, చిన్నమెదడు, మెదుల్లాలకు సంబంధించిన విషయాలు. ఈ అంశాల్ని బౌద్ధులు భౌతిక నిర్మాణంగా కాకుండా, అవి చేసే చర్యల ఆధారంగా విశ్లేషించారు. ఈ విశ్లేషణలు చూస్తే ఈనాడు మనం చెప్పుకొనే కేంద్రనాడీ మండలం చేసే పనుల్ని విశ్లేషించినట్లు అర్థంఅవుతుంది. పెద్ద మెదడులో జ్ఞానాల నిలువ, చిన్న మెదడులో వాటి సమన్వయం, మెదుల్లాలో వాటి ప్రాసెసింగ్ (కంప్యూటర్‌లో ర్యామ్‌లా) ఉంటుంది. ఈ పేర్లు వారు పెట్టక పోయినా, మెదడుని ఇలా ఆధునికంగా విభాగించక పోయినా అది నిర్వర్తించే మొత్తం పనుల్ని చక్కగా విభాగించారు.

ఈ కృషిలో అసంగుని 'యోగాచార భూమి' అద్వితీయం అనాలి. ఈ గ్రంథంలో జీవి పుట్టుక, గర్భం దాల్చడం, పిండం పెరగడం, ప్రసవం, శిశువు జననం – వృద్ధి – జరా మరణాలూ – జ్ఞానేంద్రియాలు, జ్ఞానం పొందే మార్గాలూ, వాటికి అవరోధాలు – ఇలా మొత్తం విశ్లేషించిన గొప్ప వైజ్ఞానిక గ్రంథం అది – విజ్ఞాన వాదుల జ్ఞానేంద్రియాల విభజన ఇలా ఉంటుంది.

విజ్ఞానం	విషయాలు	జ్ఞానాలు	ఇంద్రియం
1. చక్షువిజ్ఞానం	దృశ్యం	చూడడం	కన్ను
2. శోత్రవిజ్ఞానం	శబ్దం	వినడం	చెవి
3. ఘ్రాణవిజ్ఞానం	వాసన	వాసన చూడ్డం	ముక్కు
4. రసవిజ్ఞానం	రుచి	రుచి గ్రహించడం	నాలుక
5. స్పర్శవిజ్ఞానం	తాకటం	స్పర్శ గ్రహించడం	చర్మం
6. మనోవిజ్ఞానం	ఆలోచన	భావన / యోచన	చిత్తం
7. మానసవిజ్ఞానం	ఎరుక	భావాల అనుభూతి	చిత్తం
8. ఆలయవిజ్ఞానం	విజ్ఞానబీజం	స్మృతి, జ్ఞాపకశక్తి	చిత్తం

ఇదీ విజ్ఞాన వాదులు చెప్పిన ఎనిమిది జ్ఞాన సాధన విధానాలు. వీటితో చివరి మూడు చిత్తానికి (మెదడుకి) సంబంధించిన విభాగాలే.

పై పట్టికలో మొదటి ఆరు ఇంద్రియాల వరకూ ఉన్న సమాచారం బుద్ధుడు ప్రకటించిన విషయాలే – ఇవి పద్దెనిమిది.

6 విషయాలు + 6 జ్ఞానాలు + 6 ఇంద్రియాలు – ఈ పద్దెనిమిదిని ధాతువులు అంటారు. ఈ సమస్త సృష్టికీ మూలం ఈ ధాతువులే. వీటి నిరంతర పరిణామమే (మార్పే) ఈ సృష్టిక్రమం – క్షణం క్షణం మారేవి ఇవే. – మారినా రూపు మాసిపోనివీ ఇవే. నామ రూపాలుగా వ్యక్తం అయ్యేవీ ఇవే!

ఈ పద్దెనిమిదికి తోడు విజ్ఞానవాదులు మరో 6 చేర్చి ధాతువులు 24 అని చెప్పారు.

వీటిలో ఆరోదైన మనస్సుకి అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు.

బౌద్ధానికి సవాళ్ళు

ఆత్మ వాదులు 'ఆత్మ' నశించకుండా తిరిగి మరలా పుడుతుందని నమ్ముతారు. దీన్ని 'పునర్జన్మ' అంటాం. దీన్ని బౌద్ధం అంగీకరించదు. క్షణ క్షణం మారే ప్రపంచంలో మారని 'ఆత్మ' ఉండదు అని చెప్తుంది. ఆత్మ తిరిగి పుట్టదు అని కరాఖండిగా చెప్పింది. –

అయితే – మనిషి మరణంతో శరీరంలోని, మనో విజ్ఞానం (మనస్సు) మాత్రం నశించదు. అది ఎక్కడో ఒకచోట పునర్భవం (తిరిగి పుట్టడం) చెందుతుంది. అని బౌద్ధం ప్రతిపాదించింది. ప్రబోధించింది.

పునర్భవం అంటే ఏమిటి? అది తిరిగి పుడుతుందా? తిరిగి పుడితే పునర్జన్మ అవదా? అనే వాదోపవాదాలు ఉన్నాయి. బౌద్ధానికి సవాలు విసిరే వాదాల్లో 'పునర్భవం' ఒకటి. ఈ సవాళ్ళకి బౌద్ధం దగ్గర సరైన జవాబు ఉందా? లేదా? చూద్దాం మరి!!!

...29 వ పుట తరువాయి

చేపట్టడానికి ఎన్.ఆర్.ఎస్.సి.సూత్రప్రాయంగా అంగీకరించింది.

ప్రళయకావేరిలో సేకరించిన పదాలను స.వెం.రమేశ్ ఒక పటంలోకి తెస్తే, ఏనాటికైనా దాన్ని శ్రీహరికోట రాకెట్ కేంద్రంలో ప్రదర్శించవచ్చు. తరువాత మరిన్ని పదాలు సేకరించి ఈ కృషిని ముందుకు తీసుకుపోవచ్చు.

గ్రామనామాల మీద చాలపరిశోధన జరిగింది. ద్రావిడ విశ్వ విద్యాలయం, దక్షిణాది భాషల్లో స్థల నామాలను సూత్రీకరిస్తే ఈ కృషికి ఉపయోగ పడుతుంది. జంతు సర్వేక్షణ అన్ని భాషలలో చేపల పేర్లను 84లోనె అచ్చు వేసింది.

తెలుగు భాషాభిమానులలో, శాస్త్ర వేత్తలు, వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేసే ఉద్యోగులు ఉన్నారు. వారు ఈ దిశలో యధాశక్తి కృషి చేస్తే, భాష అస్మితను కొంతకాలం కొనసాగుతుంది. బదుగు జీవుల మనుగడకు తోడ్పడుతుంది..

'బతికి ఉండిన శుభములు బడయవచ్చు'.

అనుబంధాలు.

1. 33 గ్రామాల పటం.
2. పెంటకోట సముద్రంలో వనరుల పటం.

కవిత

తల్లి

– శ్రీమతి ఎస్.కాశిం బి
90522 16044


అంటువ్యాధులకు
అడ్డు గోడగ నిలిచి
బిడ్డ ఎదుగుదలకు
దొడ్డ రక్షణగ మారి
జీవితకాలపు పుష్టికి
దోహదపడతాయి...తల్లిపాలు!
భూమి లోతుల్లోకి
బలముగా చొచ్చుకుని
పిల్ల వేళ్ళెన్నింటినో
పెంపుజేసి
తరువు మనుగడకి
తానె ఆధారమౌతుంది తల్లి వేరు!
పరభాష లెన్నింటినైన
పుక్కిటబెట్టు పటిమనిచ్చి
వ్యక్తివికాసాన కీలకపాత్ర పోషించి
సమష్టి సంస్కృతికి కవచమై నిలిచి
తరతరాల ప్రగతికి
తోడ్పడుతుంది...తల్లిభాష!

మౌనంలోని మాటలు 2

సంచారి రావోళ్ళు నాగప్ప ఆత్మకథ

కన్నడ మూలం:
డా. ఆర్. వి. బి. కుమార్

తెలుగు అనువాదం :
రంగనాథ రామచంద్రరావు



గొప్పోళ్ల పెండ్లిండ్లు :

ఏ ధనవంతుల ఇండ్లల్లో పెండ్లిండ్లు జరుగుతున్నా, అక్కడికి మేము గుంపులు గుంపులుగా హాజరయ్యేవాళ్ళం. అప్పట్లో మేమింకా శిబిరదిన్ని పైన ఉన్నాం. ఆ కాలంలో గొప్పింటివాళ్ళ పెండ్లిండ్లు సత్యనారాయణస్వామిగుడి కళ్యాణమంటపంలో జరిగేవి. మా ఆడవాళ్ళు, పిల్లలు జోలెలు వేలాడదీసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకూ కళ్యాణమంటపం ముందు గేటుకు "అమ్మా! యేమన్నా వుంటే యెయ్ తల్లీ" అని నిలబడేవాళ్ళం. పెండ్లింటి వాళ్ళు, "తర్వాత రండి, పోండి" అని కసిరేవారు. గేటుకు ఇటువైపు మేమంతా అంటే సుడుగాడు సిద్దులు – అలమరులు మరియు మా కులం పిల్లలు అంతా ఛాంపియన్లలా కాంపౌండ్ గోడ దూకడానికి తయారుగా ఉండేవాళ్ళం. ఎందుకంటే మమ్మల్ని గేటు నుంచి లోపలికి వదిలేవారు కారు. బయట మేము కాంపౌండ్ గోడ మీదినుంచి దూకడానికి సిద్ధమైతే, లోపల పెద్దకర్ర పట్టుకుని మేము గోడ దూకి రాకుండా చూడటానికి జనం కాపలా ఉండేవారు. మాకేమో పెండ్లికి వచ్చిన జనంతోపాటు బంతిలో కూర్చోని భోజనం చేయాలని ఆశ. అయితే ఆ ఆశ తీరే అవకాశమే లేదు.

ఒక్కొక్కసారి ఎవరి కంటా పడకుండా కాంపౌండ్ గోడదూకి లోపల బంతిలో కూర్చునేవాళ్ళం. అయితే ఏదో విధంగా భోజనం వడ్డించేవాళ్ళు మమ్మల్ని గుర్తు పట్టేవాళ్ళు. మమ్మల్ని గుర్తు పడుతుండగానే పెద్ద గొడవ జరిగేది. మేము భోజనం వడ్డించిన ఆకును వదిలి లేవడానికి సిద్ధమయ్యేవాళ్ళం కాము. అయితే వాళ్ళు భోజనం ఆకు ముందు కూర్చోడానికి వదిలేవారు కాదు. నేరుగా కర్ర పట్టుకుని వచ్చేవాళ్లు. మమ్మల్ని వాళ్లు చేత్తో ముట్టేవాళ్ళు కాదు. కర్రతో బయటికి తరిమేవారు. మేము నిరాశతో బయటికి నడిచే వాళ్ళం. ఇలా చేస్తూ చివరికి ఓడిపోయేవాళ్లం మేమే. అయితే ఎవరో తెలియనివాళ్ళు పెండ్లయిపోయిన తరువాత మిగిలిపోయిన పదార్థాలను ఇంటికి పోయేటప్పుడు మమ్మల్ని పిలిచి పెట్టేవాళ్లు. మరి కొందరు ఏమీ పెట్టకుండా వెళ్లిపోయేవారు.

కళ్యాణమంటపం బయటపారవేస్తున్న ఎంగిలి విస్తర్లను తుడిచి మా బోగాణిలో వేసుకుని ఇంటికి తెచ్చి తినేవాళ్లం. ఈ ఎంగిలి విస్తర్లకు మేము మాత్రమే వారసుదారులం కాదు. మాతో పాటు అలమరులు, సుడుగాడు సిద్దులు, కుక్కలూ, పందులూ ఉండేవి.

ఈ మధ్యన ఎప్పుడైనా ఎవరి పెండ్లికైనా ఈ కళ్యాణ మంటపానికి పోతుంటాను.

అప్పుడు ఈ సంఘటనలన్నీ గుర్తుకొస్తుంటాయి !

పెద్దవాడినైన కథ :

పెద్దవాడవ్వటం అంటే బిచ్చమెత్తడానికి ప్రారంభించే వయసు వచ్చిందని అర్థం. బిచ్చం అడుక్కుంటే కడుపుకు అన్నం! లేకపోతే లేదు. ఊర్లో బిచ్చం అడిగి చద్దన్నం సంపాదించేవాడిని. బస్తాండులో బిచ్చం అడుక్కునేవాణ్ని. రోజంతా అడుక్కుంటే మూడునాలుగు రూపాయలు దొరకటం కష్టం. దొరికిన దుడ్లు (డబ్బును) అమ్మ చేతికి ఇచ్చేవాడిని. అమ్మ తాను అడుక్కుని వచ్చిన దానిలో బాగున్నదేదైనా ఉంటే దాన్ని పక్కకు తీసి ఎవరికి కనిపించకుండా నాకు పెట్టేది. మేమంతా ఇచ్చిన డబ్బును అమ్మ నుంచి నాన్న తీసుకునేవాడు. ఒక్కొక్కసారి అమ్మానాన్నలు సారాయో, కల్లో తాగేవారు. నాన్న తాను



తాగటం కన్నా ఎక్కువగా ఇతరులకు తాగించేవాడు. అట్లా తాగించి తాను మంచివాడని అనిపించుకునేవాడు.

మేము సిరుగుప్ప నుంచి కురుగోడుకి వచ్చాం. దొడ్డ బసప్ప గుడి బయల్లో గుడారం వేసుకున్నాం. నన్ను గుడారంలో పడుకోబెట్టి నా తల్లితండ్రులు బిచ్చానికి వెళ్ళేవాళ్ళు. ఒక రోజు వాళ్ళు బిచ్చానికి వెళ్ళినపుడు గుడారంలో పడుకున్న నాకు మెలుకువ వచ్చి అమ్మను వెదుక్కుంటూ దారి పట్టుకుని బజారులో ఏడుస్తూ పోతున్నాను. ఎవరో పుణ్యాత్ముడు నేను ఏడుస్తుండటం చూసి బిస్కెట్ ప్యాకెట్టు ఇప్పించి గుడారం దగ్గరికి తీసుకుని వచ్చి అమ్మ దగ్గర నన్ను వదిలిపోయాడు. అప్పుడు నాకు మూడునాలుగేళ్ళు ఉండొచ్చు. నాకు జ్ఞాపకం ఉన్న సంఘటనల్లో ఇదే మొదటి జ్ఞాపకం. ఈ సంఘటన జరిగిన తరువాత మేము కంప్లికి వచ్చేశాం.

నేను కాస్త పెద్దవాడిని అవుతుండగా బస్టాండులో గోడలకు అతికిస్తున్న సినిమా పోస్టర్లు నన్ను ఆకర్షించేవి. ఆ కాలంలో ఎన్.టి. రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, కృష్ణ, రాజకుమార్ వీళ్ళందరూ నాకు పోస్టర్ల ద్వారా పరిచయస్థులు. ఆ పోస్టర్లను చూసినప్పుడంతా నాకు సినిమాలు చూడాలని అనిపించేది. ఇలా అనిపించడం మొదల వుతున్నట్టే దొంగతనంగా సినిమాలకు వెళ్ళసాగాను. సంపాదించిన నాలుగైదు రూపాయల్లో ఒక రూపాయి దొంగతనం చేసేవాడిని. అయిదు రూపాయలు బిచ్చంలో సంపాదిస్తే నాలుగు రూపాయలు ఇంట్లో ఇచ్చి ఈ రోజు ఇంతే దొరికిందని చెప్పేవాడిని. మొదట్లో వారానికి ఒక సినిమా చూసేవాడిని. రాను రానూ రోజుకొక సినిమా చూడసాగాను. తర్వాత తర్వాత రోజుకు రెండు సినిమాలు చూడ సాగాను. ఈ విధంగా సినిమా పిచ్చి పెరుగుతున్నట్టే ఇంట్లో ఇవ్వాల్సిన డబ్బులు తగ్గటం మొదలైంది.

నాన్నకు అనుమానం కలగసాగింది. రోజూ లెక్క అడగసాగాడు. ఎవరైతే లెక్క సరిగ్గా తెచ్చి ఇవ్వరో వాళ్ళకు బువ్వ లేదన్నది నాన్న కట్టుబాటు. ఆ రోజు నుంచి గుడారం తలుపు దగ్గర పడు కోసాగాను. గుడారంలోకి వెళ్ళాలంటే నాన్నను దాటిపోవాలి. అమ్మకూ దారి లేదు. సినిమాకు వెళ్ళి ఆలస్యంగా వస్తే బువ్వ లేదు. అయితే సినిమా చూడకుండా ఉండలేకపోయేవాడిని. ఇలా రోజూ ఉపవాసం ఉండటం ఖాయం అయిపోయింది. నాన్న లేస్తాడేమోనని గుడారం వెనుక దాక్కుని కూర్చునేవాడిని. నాన్న లేచేవాడు కాదు. నాకు భోజనం ఉండేది కాదు.

ఇలాంటి ఒక రోజున కడుపు కట్టుకుని ఉండలేక అడుక్కుని రావటానికి పోయాను. కంప్లి సత్యనారాయణపేటలోని ఒక ఇంటి ముందు నిలబడి "అమ్మా తల్లీ, యేమన్నా వుంటే యయ్యమ్మా, ఆకలాయింది" అని అరిచాను.

లోపల భార్యాభర్తలు భోజనాలకు కూర్చున్నట్టున్నారు.

లోపలి నుంచి మగకంఠం వినిపించింది. 'ఎవడ్రా ? కోస్తే ఊరంతటికి సరిపోయేలా ఉన్నావు. దేవరదున్నలా ఒళ్ళు పెంచుకు న్నావు. కష్టం చేసి తినటానికి ఏమైంది? ఏం లేదు పో" అని కసిరిన గొంతు వినిపించింది.

అయినా కడుపాకలి ఊరుకుంటుందా?

"అమ్మా, తల్లీ, అన్నం..." అనే మాటలు నా కంఠం నుంచి బయటికి వచ్చాయి. మగమనిషి ఇంటి నుంచి బయటికి వచ్చాడు. "ఏయ్, ఏమైంది నీకు? అటు బడికి పోవు. ఇటు కష్టపడి పని చేయడానికి పోవు. భూమికి భారంగా ఎందుకున్నావు? సంపాదించు కుని తినటానికి ఏమైందిరా?" అనే మాటలు అతని నోటి నుంచి వచ్చాయి.

అంతలో ఆ తల్లి, ఆ ఆడమనిషి గొంతు వినిపించింది.

"ఎందుకలా కసురుతారు? పాపం, ఆకలివేస్తుండాలి. కొంచెం పెరుగన్నం మిగిలింది. దాన్ని ఆ కుర్రవాడికి ఇద్దాం. పిలవండి" అంటూ అన్నం గిన్నె పట్టుకుని బయటికి వచ్చింది.

నన్ను చూసి, "ఏరా, ఏదైనా గిన్నె ఉందా?" అని అడిగింది.

నా దగ్గర గిన్నె లేదు.

వేరే దారి లేక అంగీనే ముందుకు చాపాను.

అది చూసి ఆమె లోపలికి పోయి ప్లాస్టిక్ కవర్‌లో అన్నం వేసి ఇచ్చింది.

ఆకలికి ఆగలేక అక్కడే గబగబా తిన్నాను.

"అమ్మా, రొన్ని నీళ్ళు పొయ్యండి?" అన్నాను.

ఆమె చెంబులో నీళ్ళు తెచ్చి దోసిట్లో పోసింది. కడుపు నిండా నీళ్ళు తాగి మా గుడారం వైపు కదలబోయాను.

అంతలో ఆ మగమనిషి "ఏయ్, ఆగు, ఎద్దు తిన్నట్టు తిని, నీపాటికి నువ్వు పోతున్నావే? ఈ కాంపౌం డ్‌లో గడ్డి, గాదం బాగా పెరిగింది. రేపు పొద్దున్నే వచ్చి చెలికె తీసుకుని శుభ్రం చేసిపో" అని చెప్పాడు.



వాళ్ళం. ఇంటింటికి వెళ్ళి "అమ్మా తల్లే, ఏమైనావుంటే యయ్యండమ్మా" అనేవాళ్ళం. వాళ్ళు "పోయిరా" అని అంటే ఒక్క మాటకే వెళ్ళేవాళ్ళం కాదు.

"అవ్వా తాయీ" అని కన్నడలో రాగం తీసి అడిగేవాళ్ళం. తెలుగువాళ్ళ ఇండ్లకు వెళితే "తల్లీ" అని పిలవటం సాధారణం. కన్నడిగుల ఇండ్లకువెళితే "తాయీ" అని పిలవటం సాధారణం. ఒకవేళ వాళ్ళు తెలుగు వాళ్ళో, కన్నడవాళ్ళో తెలియకపోతే రెండు భాషల్లోనూ అడుక్కునేవాళ్ళం.

మరుసటి రోజు ఉదయం ఆ ఇంటికి పోయాను.

కాంపౌండ్‌లో ఉన్న చెలికె తీసుకుని ఇంటి చుట్టూ కాంపౌండంతా చక్కగా శుభ్రం చేసి మా ఇంటికి వెళ్ళడానికి సిద్ధమయ్యాను. అంతలో ఆ ఇల్లాలు మళ్ళీ బువ్వ పెట్టింది. అప్పుడు ఆ మనిషి 'అప్పుడప్పుడు ఇటువైపు వచ్చి ఏదైనా పని వుంటే అడిగి చేసిపో' అన్నాడు.

ఆ కారణంగా అప్పుడప్పుడు వాళ్ళింటి వైపు వెళ్ళడం మొదలు పెట్టాను. రాను రాను నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది.

నేను బిచ్చానికి వెళ్ళిన ఆ ఇంటి యజమాని ఒక పశువుల డాక్టర్. ఆయన పేరు రాధాకృష్ణ రెడ్డిగారని తెలిసింది. ఆయనది చిత్రదుర్గ దగ్గర్లోని ఊరైన దొడ్డసిద్ధవ్వనహళ్ళి. డాక్టర్ కుటుంబసభ్యులకూ నా పేరు నాగ అని తెలిసింది.

పాయసపు వడియాలు :

ఊర్లూర్లు తిరుగుతూ బిచ్చం అడుక్కుంటున్న అప్పటి కాలంలో తీపివంటకం అంటే గోధుమ పాయసం, శెనగ బ్యాళ్ళ పాయసం, సేమ్యాలు ఎక్కువగా వండేవారు. మేము బిచ్చానికి వెళితే నిన్నటి రోజున చేసిన మిగిలిపోయిన పాయసం, అన్నం, పప్పుచారు మొదలైన వాటిని వేసేవారు. పాయసం వేయించుకుని వచ్చి మేము తిన్నంత తిన్నాక, మిగిలిన పాయసాన్ని అమ్మ సొండిగలు (వడియాలు) చేసి పెట్టేది. ఆ విధంగా వడియాలు పెట్టి ఎండలో ఆరబెట్టి వాటిని ఒక కుండలో లేదా బట్టలో మూటకట్టి పెట్టేది. ఆ విధంగా జాగ్రత్త చేసిన వడియాలను బిచ్చం దొరకని రోజున బయటికి తీసేవాళ్ళం. అమ్మ వాటిని నీళ్ళల్లో నానబెట్టేది. వడియాలు నీళ్ళల్లో నానిన తరువాత బయల్లో మూడురాళ్ళ పొయ్యిలో పుల్లలు పెట్టి వెలిగించేది. పొయ్యి మీద వేడినీళ్ళు కాచటానికి పెట్టి నీళ్ళు మరుగుతుండగా నాలుగణాలదో, ఎనిమిదణాలదో బెల్లంవేసేది. అలా వడియాలతో చేసిన పాయసాన్ని మాకు వడ్డించేది. మాకం దరికి విందు భోజనం అంటే అలా తయారు చేసిన ఆ వడియాల పాయసమే !

పంచామృతం-పరమాన్నం :

లేనివారికి పరమాన్నం అంటే గోధుమతోపాటు బియ్యపు నూకను కలిపి చేసే పాయసం. అయితే మాలాంటివారికి పరమాన్నం అంటే పాచిపోయిన పదార్థాలే ! మేము ఎప్పుడు బిచ్చానికి వెళ్ళినా ఒక జోలె, ఒక సిల్వర్ బోగాణి లేదా సిల్వర్ గిన్నె తీసుకుని వెళ్ళే

అలా ఇంటిముందు నిలబడి పీడించి, అడుక్కుని పెట్టించుకుని వచ్చేవాళ్ళం. చాలాసార్లు ఇంటివాళ్ళు మా పీడ భరించలేక తిట్టేవాళ్ళు కూడా. పట్టించుకునేవాళ్ళం కాదు. మమ్మల్ని కాదన్నట్టు మొద్దులా కదలకుండా నిలబడేవాళ్ళం. ఒక్కొక్కసారి జనం వేడి వేడి పదార్థాలను వేసేవారు. అలాంటి సమయాల్లో అక్కడే గబగబా మెక్కేవాళ్ళం.

సామాన్యంగా రాత్రిది, పాచింది జోలెలో పడటమే ఎక్కువ. దాన్నంతా తెచ్చి అమ్మకు ఇచ్చేవాళ్ళం. అన్నం అడుక్కోవటానికి నాన్న తప్ప అందరం వెళ్ళేవాళ్ళం. అడుక్కుని వచ్చిన అన్నం, రొట్టెలను అమ్మ ఒక డబ్బాలో వేసేది. దాంట్లో నీళ్ళు పోసేది. బయల్లో మూడు రాళ్ళు పెట్టి కట్టెపుల్లలు తెచ్చి పొయ్యి వెలిగించేది. పొయ్యిమీద తపేలా పెట్టేది. అందులో మొదట అన్ని ఇళ్లలోంచి తెచ్చిన చారును ఉడకడానికి పెట్టేది. చారు ఉడకడం మొదలవ్వగానే నీళ్ళల్లో వేసిన పాచిపోయిన పదార్థాలనంతా బాగా కడిగి చారులో వేసేది. చారు, రొట్టె, అన్నం ముద్ద అన్నింటి మిక్చర్ అది. అది ఉడికి, ఈ మధ్యన హోటల్లో బిసిబేళేబాత్ అని చేస్తారు కదా, ఆ విధమైన వంటకం తయారయ్యేది. అదంతా ఉడికి, ఆరి, చల్లారిన తరువాత అక్కడే చుట్టుపక్కల్లో పెరిగిన సముద్రపాల చెట్టు ఆకులలో కానీ, మోదుగ ఆకులలో కానీ అమ్మ అందరికి పంచిపెట్టేది.

మేమంతా దాన్నే పరమాన్నాన్ని రుచి చూసినట్టు చూస్తూ లొట్టలు వేసుకుంటూ తినేవాళ్ళం. ఒక్కొక్కసారి ఆ వంటకంలో నంజు కోవడానికి అమ్మ ఎండిన నక్క మాంసపు ముక్కలను కాల్చి ఇచ్చేది.

ఇక ఆ రోజు మాకు స్వర్గం మూడు జానెళ్ల దూరం అనిపించేది!

పశుమాంసపు రుచి :

అప్పటికి నేనింకా చిన్నపిల్లవాడిని. నాకు ఏడెనిమిదేళ్లు ఉండొచ్చు. బళ్ళారివైపు నుంచి దేశదిమ్మరులుగా తిరుగుతూ తిరుగుతూ రెగ్యులేటరీ క్యాంప్ వైపు వచ్చి అక్కడే గుడారం వేసు కున్నాం. అప్పట్లో రెగ్యులేటరీ క్యాంపులో ఎనిమిది, పది దళితుల కుటుంబాలు ఉండేవి. అంటే దేవసముద్రం, కృష్ణానగర, హంపదేవన హళ్లి భూస్వాములకు చెందిన భూములు వీటిచుట్టూ ఉన్నాయి. ఆ భూముల్లో కూలీలుగా పనిచేసే దళిత కుటుంబాలు అవి. వారి గుడిసెలకు కొంచెం దూరంలో మా గుడారాలు ఉన్నాయి. ఈ క్యాంపు నుంచి చుట్టుపక్కల పల్లెలకు అమ్మా, నాన్న, మేమంతా బిచ్చానికి వెళ్లేవాళ్లం. మా పశువులను, ఆవులను అక్క మేపుకుని వచ్చేది. ఒక రోజు మా

పశువుల మందలో ఒకదానికి ఏమైందో ఏమో హఠాత్తుగా చని పోయింది. ఆ చనిపోయిన పశువును దళితులు కొద్దిదూరం తీసుకుని పోయి దాన్ని కోసి మాంసం పంచుకున్నారు. అదే రోజున ఆంధ్ర రెడ్ల ఎనుము కూడా చనిపోయింది. దాని మాంసాన్ని కూడా ఈ దళిత కుటుంబాలు పంచుకున్నాయి. ఆ క్యాంపులోని దళిత కుటుం బాల అన్ని ఇండ్లలో మసాలా వాసన గుమ్మంటూ వస్తోంది.

నేను యధాప్రకారం వీధిలో బిచ్చానికి వెళ్ళాను. ఏ ఇంటికి వెళ్ళినా నా జోలెలో ముక్కలు పడుతున్నాయి. ఇలా చాలా ఇళ్ళల్లో ముక్కలు వేయించుకుని దార్లోనే వాటిని రుచి చూస్తూ నడవసాగాను. అక్కడే ఉన్న ఒక వ్యక్తి నా చేతికి కోసిన ఎనుము తోక ఇచ్చాడు. మా నాన్న బిచ్చానికి వెళ్ళేటప్పుడు రోజూ ఈర్‌గోల్‌ను భుజం మీద వేసు కుని వెళ్ళటం చూసేవాడిని. ఈ ఎనుము తోక కూడా నాకు ఈర్‌గోల్ మాదిరి కనిపించింది. దాన్ని భుజం మీద వేసుకుని, ఒక్కొక్క ముక్క తింటూ నడవసాగాను. నేను అట్లా రావటం మా చిన్నమ్మ చూసేసింది.

“లో, అది మన దూడది తుణక, మన దూడది తుణక మనం తినేదెట్లా? అది తినవద్దరే” అని అరుస్తూ నా వెంటపడింది.

నేను ముక్కలు తినడం ఆపలేకపోయాను. నేను పరుగెత్త సాగాను. నా వెనుక చిన్నమ్మ కేకలు పెడుతూ పరుగెత్తసాగింది. ఆమె కేకలు విన్న అమ్మా, అన్నా కూడా నా వెనుక పరుగెత్తసాగారు. నేను గాభరపడి మరింత వేగంగా పరుగెత్తసాగాను. అలా పరుగె డుతూ పరుగెడుతూ ఒక రాయికి బొటనవేలు తగిలి బోర్లాపడ్డాను. చేతిలో ఉన్న ముక్కలన్నీ చెల్లాచెదురుగా నేలమీద పడ్డాయి. ఏడుస్తూ ఆ ముక్కలను ఏరుకుని అంటుకున్న మట్టిని తుడిచి తినాలనుకుంటే అమ్మ, అన్న, చిన్నమ్మ నా చుట్టూ కమ్ముకున్నారు. చేతికి దొరికిన ముక్కలను ఒక చేతిలో, మరొక చేతిలో ఎనుము తోకను పట్టుకుని వాళ్ళ నుంచి తప్పించుకుని పరుగెత్తసాగాను. అలా పరుగెడుతూ కొత్త కాలువ కింది సొరంగంలో దాక్కున్నాను. మా అన్నయ్య నన్ను గమనిస్తూనే ఉన్నాడు. నేను అన్నను చూడలేదు. అక్కడే ఉన్న ఒక పెద్దమనిషి దగ్గర అగ్గిపెట్టె ఇప్పించుకుని సొరంగంలో మొలచిన ఒక పొదకు నిప్పుపెట్టాడు. నా చేతిలోని తోకను లాక్కుని ఆ నిప్పుల్లో వేశాడు. అయితే నేను ఆ తోకను కాల్చుకుని తినాలని అనుకున్నాను. కానీ మంటల్లో కాలిపోతున్న తోకను బయటికి తీయడం కష్టమైంది. అంతలో అన్నయ్య ఒక కర్రపట్టుకుని తిడుతూ వచ్చాడు. ఆ సొరంగం నుంచి బయటికి వచ్చి మళ్ళీ పరుగుతీశాను. అన్నయ్య చేతికి నేను దొరకలేదు. అక్కడ ఇక్కడ తిరిగి చీకటి పడిన తరువాత వచ్చి కాలువ పక్కన పడుకున్నాను. మరుసటి రోజు పొద్దున్నే నేనున్న చోటికి అన్న వచ్చి నన్ను పిల్చుకునిపోయాడు.

అక్కయ్య కారం సేవ :

ఆ రెగ్యులేటరీ క్యాంపులోఉండగా జరిగిన సంఘటన ఇది!

మేము ఊరి నుంచి ఊరికి తిరగాల్సి వస్తే మా కోళ్ళని, గుడా రాన్ని, సామాన్లు మోసుకునిపోవటానికి పశువులను సాకేవాళ్ళమని చెప్పాను కదా! ఆ పశువులు గ్రామీణుల పొలాల్లో పడకుండా చూసు కునే జవాబుదారి కూడా మామీద ఉండేది. ఎందుకంటే మా పశు వులు పొగరుపడి గ్రామస్థుల గడ్డీగాదం మేసేస్తే జనం మమ్మల్ని వెంటనే ఆ ఊరి నుంచి తన్ని తరిమేవారు. లేదా మా పశువులను బంజరుదొడ్డిలో కట్టేసేవారు. బంజరుదొడ్డిలో కట్టివేస్తే ఆ పశువులకు విడిపించడానికి దండన విధించేవారు. ఆ దండన చెల్లించడానికి మా దగ్గర డబ్బులు ఎక్కడి నుంచి వస్తాయి? అందుకోసం పశువులను జాగ్రత్తగా కాపలా కాసే పని కూడా మాదే.

ఒక రోజు కూలీపనులకు మనుషులు తక్కువయ్యారని అక్కను, అమ్మను కూలీకి పిలిచారు. దొరక్కదొరక్క కూలీ దొరికిందని అక్క సంతోషంతో ఉంది. నిజానికి మా పశువులను కాసే పని ఆమెది. పశువులను మేపుకొచ్చిన తరువాత ఊళ్ళో బిచ్చానికి పోవాలి. కూలీ దొరికినందువల్ల పశువులు కాసేపని అక్క నాకు చెప్పింది. నేను కాయనన్నాను. అక్క బుజ్జగించినా నేను వినలేదు.

అక్కడే పొలం పక్కన మిరపకాయల మొక్కలు వేశారు. అక్క నాలుగు మిరపకాయలయ తెంచుకుని వచ్చింది. రోట్లో వేసి రుబ్బి నున్నగా చట్నీ చేసింది. తరువాత నన్ను బుజ్జగిస్తున్నట్టు దగ్గరికి పిలిచింది. నేను ‘రానుపో’ అన్నాను. ‘పదిపైసాలు ఇస్తాను రా’ అంది. సంతోషంతో ఆమె దగ్గరికి పోయాను. దగ్గరికి పోతుండగానే నా రెక్క పట్టుకుని ‘పశువులు కాయరా అంటే కాయనంటవా?’ అని అంటూ తాను అరగదీసిన మిరపకాయల కారాన్ని కళ్ళకు మెత్తింది.

ఒక్కసారి కళ్ళు భగ్గుమన్నాయి.

ఆ మంటను భరించలేక నేను గంతులు వేయసాగాను.

చివరికి నా బాధ చూడలేక మా అక్క నా ముఖాన్ని కడిగి నన్ను దగ్గరికి తీసుకుంది.

పాయిఖానా క్లీనర్ పని :

పై సంఘటన జరిగి 12-13 ఏళ్ళ వాడినయ్యానేమో ! నేను బిచ్చానికి వెళ్ళినపుడు ఎన్నడూ ఏ గొప్పింటివాళ్ళు ఎన్నడూ పిడికెడు అన్నం పెట్టలేదు. తమ కాంపౌండ్ లోపల నన్ను పిలిచి తమ పాయి ఖానా చూపించేవారు. మొదట్లో ఏం చేయాలో నాకు తోచేదికాదు. వెళ్ళి ఊరకే నిలబడితే కసిరేవారు. బిచ్చానికి వచ్చావు కదా ! నిన్ను కోస్తే ఊరు మొత్తానికి సరిపోయేలా ఉన్నావు. ఈ పాయిఖానా కడుగు అనేవాళ్ళు. వాళ్ళు పెట్టే చద్దన్నం కోసం పాయిఖానా కడిగాను. ఇప్పుడు తలుచుకుంటే వాంతికి వస్తుంది. అంత గబ్బుగా ఉండేవి ఆ పాయిఖానాలు. పాయిఖానాలు కడిగిన తరువాత నా బోగాణిలో మిగిలిపోయిన పదార్థాలు వేసేవాళ్ళు. నాకు మృష్టాన్నం దొరికినట్టు అనిపించేది. అన్నం దొరుకుతుందనే ఆశతో పాయిఖానా కడిగే పనికి వెళ్ళేవాడిని. అప్పట్లో అది నాకు అవమానం అనిపించేది కాదు. అయితే ఇప్పుడు తలుచుకుంటే కళ్ళల్లో నీళ్ళు వస్తాయి.

అన్నంకోసం ఎంతటి అవమానకరమైన పనులు చేశానో కదా!

నాలుగణాల దోసె :

ఉదయం, సాయంత్రం బోగాణి పట్టుకుని బిచ్చానికి వెళ్ళేవా డిని. పగటిపూట ఎవరైనా కూలీమనుషులు దొరకనపుడు మట్టిమోసే కూలీపనికి పిల్చుకుని పోయేవాళ్ళు. కూలీకి వెళ్ళిన రోజున నాకు తప్పనిసరిగా దోసె ఉండేది. దోసెమీది ఆశతో కూలిపనికి వెళ్ళేవాడిని. మా గుడారం దగ్గర ఒక వడ్డెరల కుటుంబం ఉండేది.

కంప్లిలోని సత్యనారాయణపేటలో అప్పట్లో ఇంకా పాయిఖా నాల కోసం అండర్ గ్రౌండ్ కాలువలు లేవు. అందరూ పాయిఖానా కోసం గుంతలు తవ్వించేవాళ్ళు.

తరువాయి 42 వ పుటలో...

నిగమశర్మకు అక్క వ్రాసిన లేఖావళి-2

-గజానన్ తామన్
9440211285

మంత్రపురి.

ప్రియమైన తమ్ముడు చి॥ నిగమశర్మకు

నీ అక్క చిరాయువు కమ్మని దీవిస్తూ వ్రాయు రెండవ జాబు. నేను క్షేమం. నీవు క్షేమమని తలుస్తాను.

ఇటీవల ప్రపంచవ్యాప్తంగా భూతాపం పెరిగిపోయి, మానవ జీవనం దుర్భరమైపోయింది. ఈ పరిస్థితికి మనవూరు ఎలా అతీతం కాగల్గుతుంది?ఇంటిపనులన్నీ వదిలేసి పొద్దస్తమానం కూలర్లముందు కూచోలేముకదా!

ఇక అసలు విషయం తెలుగు-దాని భవితను గూర్చి రేయింబ వళ్ళు మన ఆలోచన - తపన. తాపత్రయాలను పక్కకు నెట్టి దానికి వద్దాము. మన పొరుగువారైన తమిళులకు తమ అమ్మనుడి యెడ మాటల్లో చెప్పలేని మమకారం. సాధ్యమైనంతమేరకు తమిళులు తమ భాషలో అన్యభాషాపదాలకు చోటివ్వరు. పరిచితులు ఎదురైనచో 'వణక్కమ్' అంటారేతప్ప మనలా 'నమస్కారం' అనడానికి వారి మానసం ఒప్పుకోదు. అయినను మాతృభాషను ప్రాణప్రదంగా ప్రేమించే తమిళ విద్వాంసులు పాడటానికి మన త్యాగరాజులవారి కీర్తనలనే ఎన్నుకుంటారు. ఎందుకో తెలుసా? గాంధర్వానికి అనువైన భాష మన తెలుగుభాష. రాయప్రోలువారి 'రమ్యాలోకము' లోని తేటగీతిని ఓమారు గుర్తుకు తెచ్చుకో!

"ఏ ప్రపుల్ల పుష్పంబుల నీశ్వరునకు
పూజ సల్పితినో ఇందు పుట్టినాడ!
కలదయేని పునర్జన్మ కల్గుగాక
మధుర మధురంబయిన తెల్గు మాతృభాష"

ఇది ఇలా ఉండగా అప్పయదీక్షితులు నుడివినది విస్మరించ తగినది కాదు.

'ఆంధ్రత్వ మాంధ్రభాషాచ
బహుజన్మ తపఃఫలమ్'

మహానుభావులైన వీరు ఇలా సెలవిస్తూంటే ఇంగ్లీషు వానిగా పరకాయ ప్రవేశంచేసి తెలుగును వీడి ఇంగ్లీషులో చదువులు వెలగబెడతా మని అఘోరించడం దేనికి?

తెలుగు తేజమైన మన త్యాగరాజస్వామి జన్మించింది తంజా వూరులో! ఆయన కృతులు కేవలం గానయోగ్యమే కాదు. అందులో అజరామరమైన సాహిత్యం ఉంది. ఎనలేని భక్తిభావ కుశలత! అదీ అలతి అలతి పదాలలో! కేరళీయుడైన యేసుదాసో లేక మనవాడైన బాలమురళీకృష్ణనో పాడగా ఆకీర్తనలు విన్నప్పుడు నాకు కలిగే ఆనం దానికి మేరలుండవు. 'నగుమోము గనలేని నీజాలి తెలిసి' 'పక్కాలా నిలబడి కొలిచే ముచ్చట' ఎందరో మహానుభావులు' వంటి వారి కీర్తనలు ఎన్నిమార్లు విన్నా ఓ కవి అన్నట్లు 'క్రొత్తలవుచుండు'. ఈ కీర్తనల్లో ఎక్కడోతప్ప అచ్చతెలుగు పదాలే ఎక్కువగా సాక్షాత్కరిస్తాయి. సాంప్రదాయక వాద్యాలకు మారుగా పాశ్చాత్య వాద్యబృందం సహకా రంగా ఇటీవల వచ్చిన గానాన్ని విన్నాను. మధుర గాయని శ్రీరంజని కోడంపల్లినే గాక ఓ పాశ్చాత్య గాయకుణ్ణి విన్నాను. ఇట్టి త్యాగయ్యకు దూరమైన తెలుగు జీవనం నిస్సారమైంది.

రామభక్తిలో త్యాగయ్య తర్వాత పేర్కొనదగిన వాగ్గేయకారుడు కంచర్ల గోపన్న. ఆయన రామదాసుగా వినుతికెక్కాడు. "నను బ్రోవమని చెప్పవే' "సీతమ్మకు చేయిస్తి" మున్నగునవి ఆయన కీర్తనలు. సర్కారు పైకంతో భద్రాద్రిలో రామాలయ నిర్మాణం కావించి కటకటాల పాలై నాడు. ఆయన కీర్తనలను మన మంగళంపల్లివారు పాడి తెలుగువారి బ్రతుక్కి ధన్యతను ఆపాదించాడు.

ప్రాతఃస్మరణీయుడు అన్నమయ్య. ఆయన రచనల్లో భక్తి శృంగార రసాల మేళవింపు ఉంది. మధుర భక్తి సంప్రదాయానికి చెందినవాడు కదా! "అదిగో అల్లదిగో హరివాసము" అనేకృతి తిరుమ లేశునియెడ ఆయన భక్తిభావాన్ని చాటుతుంది. - "ఇంత తెలిసి యుండి ఈ గుణమేలర" అనే ఆయన జావళి అమలిన శృంగార రసానుభూతిని కలిగిస్తుంది.

ఈ ముగ్గురు కవుల రచనల్లో ఏలాటి కృత్రిమత లేదు. భావ దరిద్రతను శబ్దాడంబరం మాటున దాచిన తీరు లేదు. తత్సమపద బాహుళ్యంతో సామాన్యునికి అందుకోజాలని ఆనందదాయినులు కావు. కాళిదాసు మహాకవివలె తన్నుతాను వామనునిగా ఎంచి 'ఉస్సుర'న వలసిన పనిలేదు.

అన్యభాషాపదాలను అరువు తెచ్చుకొనకున్నా 'స్వయం పూర్ణ'గా నిలువగలిగిన భాష మన తెలుగుభాష. సంస్కృతంలో వలె గాక ఆంగ్లంలోని ఆంగ్లోసాక్జన్ పదాలవంటి అలతి అలతి పదాలు కల్గి నది.'నిక్కమైన నీలమొక్కటి చాలు' వేమన ఆటవెలది మొదటిపాదం ఇందుకు ఉదాహరణ.

భాషావిషయంలో జర్మనులు శుద్ధీకరణవాదులు. యూరప్ మొత్తానిది ఒకదారైతే వారిది మరోదారి. గ్రీక్, లాటిన్ పదాలను తమభాషనుండి తొలగించారు. వారి శుద్ధీకరణోద్యమం జాత్యహంకార జన్యం. తమిళులను, జర్మనులను అనుకరించాల్సిన అవసరం మనకు లేదు. తెలుగులో సంస్కృతాది భాషలకు చెందిన పదాలున్నవి. అన్య భాషాపదాలుగా గుర్తుపట్టలేనంత ఒదిగిపోయినవి. తెలుగుపదాల్ని వాటికి పర్యాయాలుగా కల్పించవలసిన అనివార్యత ఏమాత్రంలేదు.

సిద్ధాంతవ్యాసం వ్రాయగల్గిన వైదుష్యం నాయొద్ద లేదు. అయినా తెలుగుసాహిత్యం నాకు ఆరవప్రాణం. గైడ్ల సహాయంతో గాక ఎంతోకొంత చదివి బి.ఎ.డిగ్రీని అందుకొన్నాను. తెలుగు ఆరా ధన అభిమానాలు మనకు అమ్మానాన్నలనుండి అబ్బిన సంస్కారాలు.

తమ్ముడూ! భక్తిరసప్రధానమైన మన ఉదాత్త సాహితీసంపద ఇదివరకు పేరుకొన్న ముగ్గురితో ముగియలేదు. ఆధునికుల్లో చెప్ప కోదగినవారు దేవులపల్లికృష్ణశాస్త్రి. వారి శ్రవణపేయమైన 'మ్రోయింప కోయి మురళి' 'పదములె చాలు' గీతాలు చాలాసార్లు వినేఉంటావు. 'నీ దయ గౌతమి గంగా రామయ, నీ దాసులు మునుగంగా' అనే పాదంలో యమకం ఎంత చక్కగా ఒదిగిపోయింది! నాదమాధురి గల పదాల పొహళింపులో దేవులపల్లివారిని మించిన కవిలేదు.

షెల్లీగా కాక జయదేవునిగా ఆయనను చెప్పుకోవాలి. "తీయతేనియ బరువు బతుకు మోయలేని' విధంగానే తెలుగు గేయం బరువైన సంస్కృతపదాలను మోయలేదు.

'మహాప్రస్థానం' కర్త శ్రీశ్రీ విప్లవ కవిగా తెలుగు సాహితీ జగత్తుకు పరిచితుడు. ఓ ధార్మిక తత్వాన్ని హృదయాన్ని స్పర్శించే పాటగా మలిచాడు.

'బొమ్మనుచేసి ప్రాణము పోసి
ఆదేవు నీకిది వేడుక'

ఇలా వ్రాసినందుకు 'అరసం' కవులు ఆయనపై కినుక వహించారు. శ్రీశ్రీ గొప్పగా వ్రాశాడనడానికి ఈ ఉదంతం చాలు.

తెలుగును మింగివేసే సంస్కృత పదాలతో రూపొందిన కావ్య రచన జనామోదం పొందజాలదు. అలా అని సంస్కృత పదాల్ని పూర్తిగా పరిహరించి అచ్చతెలుగు పదాలే 'శయ్య'గా గల్గిన పొన్న గంటి తెలగనార్యుని యయాతి – మణిప్రవాళశైలిలోని మనుచరిత్రను మించిన ఖ్యాతిని గడించలేదు. 'గమికర్మ కృతనైకనీవృతుడనై' వంటి సమాసాలను నైషాధానువాదంలో ప్రయోగించిన శ్రీనాథునినాటి విమర్శకులు తెగనాడకుండా వదలిపెట్టలేదు. తత్సమశబ్ద బాహుళ్యం కల్గిన పద్యాలు వ్రాసినందులకు నేటి జలరుక్' శాస్త్రిగారు విశ్వనాథ వారికి 'పాషాణప్రభు'వనే కితాబు ఇచ్చారు. శ్రీనాథుడుగాని విశ్వనాథ వారుగాని అన్ని పద్యాలు అలాగే వ్రాశారా? 'రిక్కించుకొని యున్న రెక్కమొత్తము తోడి' 'తల్లి మదేక పుత్రిక' వంటి శ్రీనాథుని పద్యాలు 'లేద'నే సమాధానమిస్తాయి. విశ్వనాథవారివి వెదికి పట్టుకోవడం నీకు వదులుతాను.

కావ్యరచనలో అచ్చతెలుగు పదాలకే పెద్దపీట వేస్తానని ప్రతిన బూనిన పాలకుర్కి సోమన పండితారాధ్య చరిత్రలోని ఈ పద్యాన్ని ఉటంకించకుండా ఉండలేను. శ్రీనాథుని ఊహాజలధి తరగల్లో ఈదు లాడే హంసనువీడి మనదైన ఈ జగత్తులో మనకు సుపరిచితమైన కుక్కుటరాజు జనాల్ని నిదుర నుండి మేలుకొల్పే ఈ పద్యాన్ని నీవు ఓపిగ్గా చదవాలని కోరుతాను.

'తొలి కోడి కనువిచ్చి నిలిచి మైపెంచి
జలజల రెక్కలు సడలించి నీల్గి
గ్రక్కున కాలార్చి కంఠంబు విచ్చి
ముక్కున ఈకలు సక్కొల్పి కడుపు
నిక్కించి మెడసాచి నిక్కి మిన్సూచి
కొక్కొరో కుర్రని కూయక మున్న'

మహా వైభవోపేతమైన భాషా సంస్కృతులు మనవి. ఆంగ్లభాషా సంస్కృతుల వ్యామోహంలో పడి వాటిని ఉపేక్షించడం క్షంతవ్యంకాని అవివేకమౌతుంది.

కిన్నెరసాని నడకలోని సొబగులను విశ్వనాథ హృదయంగ మంగా వర్ణించాడు. భాషలో, ఆహార్యంలో, ఆలోచనల్లో ఆదాన ప్రదా నాల్లో తెలుగు జీవనానికి ఎనలేని సొబగులున్నాయి. అవి అంతరించ కూడదు. అవి వృద్ధిగతం కావాలి.

సోమన కుక్కుటారావం తెలుగుజాతికి మేలుకొల్పు కావాలి.
మరికొన్ని విషయాలు వచ్చే జాబులో....

నీ ప్రగతిని, క్షేమాన్ని కోరే
నీ అక్క

...40 వ పుట తరువాయి

ఆ వడ్డెరల ముసలివాడు అలాంటి గుంతలు తవ్వేవాడు. గుంత తవ్వటానికి చేతికింద మనిషిగా నన్ను పిల్చుకుని పోయేవాడు. నేను ఎన్నడూ ఇంత కూలి ఇవ్వమని అడగలేదు. అతడు ఇచ్చిందే కూలి. నన్ను పిల్చుకుని పోవటం వల్ల ఆ ముసలివాడికి కూలీలో లాభం ఉండేది. ఆ కారణంగా నన్నే పిల్చుకునిపోయేవాడు.

కూలీకి వెళ్ళిన రోజున ముసలివాడు నాకు ఒక దోసె, ఒక టీ ఇప్పించేవాడు. ఇప్పుడు శికారీలు ఉన్నారు కదా ! ఆ ఇంటికి దగ్గరలో ఆ హోటల్ ఉండేది. ఆ హోటల్‌ను ముసల్మానులు నడిపేవారు. మొత్తం కంప్లిలో అప్పట్లో ఒక దోసె ఖరీదు పదహైదు రూపాయలు ఉంటే, ఈ హోటల్లో మాత్రం నాలుగణాలకు ఒక దోసె ఇచ్చేవారు. పదిపైసాలకు ఒక టీ ఇచ్చేవారు. ఒక దోసె తిని, ఒక టీ తాగి రోజంతా మట్టిని మోసేవాడిని. ముసలివాడు ఇచ్చిన కూలీ డబ్బులు అమ్మ చేతికి ఇచ్చేవాడిని. అయితే ప్రతీ రోజు కూలీ పనులు ఉండేవి కావు. కూలి దొరికినపుడు మాత్రం నాలుగణాల దోసె తప్పేది కాదు.

యక్షప్రశ్నలు :

నాకు పది పన్నెండేళ్ళు ఉన్నప్పుడు జరిగిన సంఘటన ఇంకా నన్ను యక్షప్రశ్నగా వేధిస్తూనే ఉంది. అప్పట్లో ఇంకా మేము ఊర్లూర్లు తిరిగి బిచ్చం అడుక్కుని బతికేవాళ్ళం. మా దగ్గర ఒక దేవుడి బుట్ట ఉండేది. నాన్న ఈర్‌గోల్, చాకు, గంట తీసుకుని దేవుడి బుట్టను మోసుకుని ముందుకు నడిచేవాడు. నాన్న వెనుకే అమ్మ నాన్న పాటకు తగినట్టు ఉరుమ వాయిస్తూ వంత పాడేది. ఇక మంగళవారం, శుక్రవారం రోజుల్లో మా దేవుడికి బిడువే లేదు. ఉదయమే బిచ్చానికి వెళితే తిరిగి రావడం మళ్ళీ సాయంత్రమే. బిచ్చానికి పోయిన అమ్మా, నాన్నల వెంట దేవుడి బుట్ట ఉండేది. దాదాపు రోజూ నాన్న కత్తితో చెయ్యి కోసుకుని రక్తం చిందించి బిచ్చం అడుక్కునేవాడు. పెద్దవాణ్ణి యిన తరువాత నేనూ అదే చేశాను! రక్తం కార్చుకుని బిచ్చం ఎత్తిన నాన్న, అతని వెంబడి వెళ్ళిన అమ్మ ఆ రోజున కొంచెం తీర్థం (సారాయి) తాగేవాళ్ళు. బహుశా నొప్పిని భరించడానికి తాగేవాళ్ళను కుంటాను. అడుక్కుని తెచ్చిన అన్నం, రొట్టెలు మొదలైనవాటిని మాకు తినడానికి పెట్టి, వాళ్ళూ తిని ఒక వైపు బయలులో పడుకునేవాళ్ళు. దేవుడిని మాత్రం గుడారం లోపల పెట్టేవాళ్ళు.

నాన్న, అమ్మ, అక్క, అన్నలంతా పడుకున్న తరువాత నేను నగ్నమై గుడారంలో దేవుడి బుట్ట చుట్టూ తిరిగేవాడిని.

అలా ఎందుకు దేవుడి చుట్టూ తిరిగానో ఈ రోజుకూ నాకు అర్థం కాలేదు.

అదొక యక్షప్రశ్నలా నన్ను ఈ రోజుకూ వెంటాడుతూనే ఉంది.

అన్ని విద్యాదశల్లోనూ మాతృభాషే
మాధ్యమంగా ఉండాలి
– కొఠారి కమిషన్


భాషోద్యమ కథానిక

రావి ఎన్ అవధాని
94405 84777

వజ్రసంకల్పం

"తాతయ్యా! రేపు మాతృభాషా దినోత్సవం! మా తరగతిలో పిల్లలందరూ మాతృభాష ఆవశ్యకత దాని గొప్పతనం గురించి మూడేసి నిముషాలు మాట్లాడాలని చెప్పారు. నాకు దాని గురించి చెప్పు తాతయ్యా!" అంది పావని.

పరంధామయ్యగారు మనవరాలి వేపు చూసి చిరునవ్వు నవ్వి "పావనీ! మన మాతృ భాష తెలుగు. మరే భాషకూ లేనట్లు దీనికి రెండు పేర్లు ఉండడం విశేషం. అవి తెలుగు భాష...ఆంధ్రభాష...ఆంధ్రజాతి మాట్లాడే భాష తెలుగు. ఆంధ్రజాతి ఉనికి నిలిచేది తెలుగు భాషతోనే ఇలా ఏ జాతి ఉనికిని వాళ్ళ మాతృభాషే నిలుపుతుంది. మన మాతృభాష ద్వారా మన గురించి తెలుసుకుంటాం. అందుకే అందరూ కనీసం ప్రాథమికస్థాయి వరకైనా మన మాతృభాషలో విద్యని అభ్యసించాలి. మాతృభాష ఎంత బాగా నేర్చుకుంటే మిగతా భాషలంతా బాగా వస్తాయి. అందుకనే ప్రపంచంలో అందరూ మాట్లాడాలి. మాతృభాష ప్రాధాన్యం తెలుసుకోవాలనే ప్రపంచ వ్యాపితంగా మాతృభాషా దినోత్సవం జరుపుకుంటున్నాం. దేశంలో అధిక జనులు మాట్లాడే భాషలలో ప్రథమ స్థానం హిందీ. రెండో స్థానం తెలుగు భాష. సుమారు 18 కోట్ల మంది ప్రజలు తెలుగు మాట్లాడుతున్నారు తెలుసా?"



"మానవునికి భావ ప్రకటనా స్వాతంత్ర్యం కలిగించేది భాషే. ఒక జాతి సంస్కృతిని ప్రభావితం చేసేది భాషే! భాష లేకుంటే జాతి లేదు. సంస్కృతికి ఆయువు పట్టు భాష. భాష వల్ల నిలబడేది చరిత్ర.

"తాతయ్యా! అసలు "భాష" అంటే ఏమిటి? దాని ఉపయోగం ప్రయోజనం ఏమిటి? అంది పావని.

"మంచిప్రశ్న వేశావమ్మా! సమాజంలో ఒకరి భావాలు మరొకరికి తెలియ జేయడానికి వీలుగా ఏర్పడిన ధ్వని సంకేతాలు భాష. సమాజం దీనిని సమిష్టిగా సృష్టించుకుంది. సాధనంగా వాడుకుంటోంది. భాషకు విశిష్టమైన ప్రయోజనం ఉంది. భాష జన సమూహం సామాజిక జీవనాన్ని ప్రభావితం చేస్తుంది. జనులలో స్నేహం, అనురాగం, ప్రేమ, దయ, ద్వేషం, విరోధం, పగ కలిగించేది భాష అని కూడా చెప్పవచ్చు. యుగ యుగాల చరిత్ర, సంస్కృతి సంప్రదాయాలు, భాష రూపంలోనే ముందు తరాల వారికి తెలుస్తుంది. భాషకుండే ప్రధాన ప్రయోజనం ఇదే!. "భాష అనేది ఏ ఒక్కరికో పరిమితమయింది కాదమ్మా! ప్రత్యేక మానవ సమూహానికి చెందింది. తర తరాలుగా జీవనదిలా ప్రవహిస్తూ మానవ భౌతిక, ఆధ్యాత్మిక మేధో వికాసంతో పాటు వికశించింది".

"మానవునికి భావ ప్రకటనా స్వాతంత్ర్యం కలిగించేది భాషే. ఒకజాతి సంస్కృతిని ప్రభావితం చేసేది భాషే! భాష లేకుంటే జాతి లేదు. సంస్కృతికి ఆయువుపట్టు భాష. భాష వల్ల నిలబడేది చరిత్ర.

–సంస్కృతి అంటే ఏమిటితాతయ్యా?"

సంస్కృతి అంటే వారి కట్టు, బొట్టు, ఆచార వ్యవహారాలు, అలవాట్లు,పండుగలు,

పబ్బాలు, నోములు, వ్రతాలు, పెళ్ళి పేరంటాలు వగైరా. "మన తెలుగు వారికి కూడా మంచి సంస్కృతి ఉందమ్మా! ప్రతి సమాజం, జాతి తమకంటూ ఓ ప్రత్యేక భాషను సృష్టించుకొని ఆ భాష ద్వారా తమ భావాలను, అభిప్రాయాలను వ్యక్తీకరించడం వల్ల పురోభివృద్ధి సాధించగలిగారు. భాష వల్ల భావాలు సులభంగా అర్థమవ్వాలి. అంటే భాష సరళంగా ఉండాలి".

– మాతృభాష తల్లి పాలవంటిదనీ రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారు. "దేశ భాషలనందు" తెలుగు లెస్స!" అని శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని గురించి ఎందరో ప్రముఖులు వ్యాఖ్యానించారు". కారణాలు ఏవైనా నేడు ప్రజలు తమ మాతృభాష తెలుగును చిన్న చూపు చూస్తున్నారు. నేడు విద్య వ్యాపారంగా మారిపోయింది. కాన్వెంట్ విద్యా సంస్థలు వాడవాడలా వెలిశాయి. ఈ విద్యా సంస్థల మధ్య పోటీ పెరిగింది. తల్లిదండ్రులు వారికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ప్రోత్సహిస్తూ తమ పిల్లల్ని తెలుగు భాషకు దూరం చేస్తున్నారు.

– మాతృభాష వల్ల లాభం ఏమిటి తాతయ్యా?"


– మాతృభాష వల్ల ఎన్నో లాభాలున్నాయమ్మా! భావాన్ని వ్యక్తీకరించడానికి గ్రహించడానికీ వీలవుతుంది. లోతైన అవగాహన కలుగుతుంది. వ్యక్తులతో మంచి సంబంధాలు, సమైక్యతా భావం పెరుగుతుంది. తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలు తెలుస్తాయి. ఆత్మ గౌరవం పెరుగుతుంది. మానసిక వికాసం సహజ వికాసం కలుగుతుంది. మాతృభాషా సాహిత్యం చదవడం వల్ల విజ్ఞానం పెరుగుతుంది. ఇన్ని ప్రయోజనాలున్న తెలుగు భాషను ప్రజలు, ప్రభుత్వం వారు పరిరక్షించాలి.

– మాతృభాషను పరిరక్షించడం కోసం ఏమి చెయ్యాలి తాతయ్యా?"

పాఠశాల విద్యలో కనీసం ప్రాథమిక విద్యను తెలుగు మాధ్యమంలో నేర్పాలి. అన్ని పాఠశాలలలోను ప్రాథమికస్థాయి నుండి ఉన్నతస్థాయి వరకు తెలుగును ఒక భాషగా తప్పని సరి చేయాలి. సచివాలయాల్లో అన్ని ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరపాలి. శాసన సభ, రాజ్య సభల్లో తెలుగులోనే మాట్లాడాలి. న్యాయ స్థానాల్లోను, ప్రభుత్వ కార్యాలయాల్లోను కార్యకలాపాలు తెలుగులోనే జరగాలి. తెలుగు మాధ్యమంలో చదివిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించాలి. రైళ్ళు, బస్సులపై తెలుగులోనే వివరాలు రాయాలి. ఇంటా బయటా తెలుగులోనే మాట్లాడాలి. తల్లిదండ్రులు తమ పిల్లలకి తెలుగులో రాయడం చదవడం నేర్పాలి. అటు ప్రజలు, ఇటు ప్రభుత్వం వారు వజ్రసంకల్పంతో ఈ నిర్ణయాలు అమలు పరిస్తే తెలుగుభాష పరిరక్షించబడుతుంది పావనీ!" అన్నారు,

తాతయ్యా! ఇప్పుడు నాకు మాతృభాష గురించి 'మన మాతృభాష తెలుగులో విద్యాబోధన గురించి మంచి అవగాహన ఏర్పడింది. రేపే విషయాలన్నీ మాతృభాష దినోత్సవాలు జరుపుకునేప్పుడు మాతృభాషలో మాట్లాడతా.

"కొన్ని కొన్ని విషయాలు కేవలం మాట్లాడుకుంటే సరిపోదమ్మా! అందరూ ఆచరణలో పెట్టాలనీ చెప్పమ్మా" అన్నాడు తాతయ్య నవ్వుతూ.



– సన్నిధానం నరసింహశర్మ
92920 55531



స్మృతిరంగంలో శ్రీరంగంశ్రీనివాసరావుగారు

శ్రీశ్రీని గురించి తెలియని వారెవ్వరుంటారు? ఆయన నీడ పడకుండా, ఆయన జాడ చూడకుండా, మహాప్రస్థానాది కవిత్వాలు చదవకుండా ఎవరుంటారు? ఆధునిక కవిత్వంలో ఆయన కాలం ఒక శకం వంటిదేమో!

శ్రీశ్రీగారితో నాకు పరిచయాలున్నాయడం కన్నా ఆయన్ని దర్శించిన సందర్భాలు తీపిగురుతులుగా ఉన్నాయనడం వాస్తవం అవుతుంది. అంత పెద్దాయనను నేను కలవడమా అని ఓ పెద్దరికపు భయం వెంటాడేది. గురజాడ కన్యాశుల్కంలో సంభాషణలు ఎన్నో ఎందరికో కంఠస్థంగా ఉండేవి. ఇప్పటికీ కొందరు లేకపోలేదు.

బ్రతికిన బ్రతుకుకు భగవద్గీతా పారాయణం ఆధ్యాత్మికరంగ ప్రేమికులకు ఎటువంటిదో– కవితారంగ ప్రేమికులకు మహాప్రస్థాన కవితల పఠనం అటువంటిదిగా ఉండేది. వీరావేశంతో నేను ఆ కవితల్ని రాజమండ్రి కళాశాల కేంటీన్ల దగ్గర, చెట్లవద్ద సోదరవిద్యార్థులకు వినిపించేవాణ్ణి. శ్రీశ్రీగారిని అనుకరిస్తూ "దినాలూ వారాలూ/ పగలూ రాత్రులూ/ వగలూ పగలూ/ నవ్వులూ నగుబాట్లూ/ ఎడబాటులు తడబాటులు/ అర్థం లేకుండా వుందీవ్యర్థ ప్రపంచం/ అర్థంకాకుండా వుందీ స్వార్థ ప్రపంచం" అంటూ కవితలు రాసే వాణ్ణి...కొందరికి నా దీర్ఘ గేయం చదివి ఎవ్వరిదో చెప్పండి అనేవాణ్ణి. శైలి అనుకరణం అని తెలియనివారు శ్రీశ్రీదా అని అడిగేవారు. అలా అంటేనే ఏదో ఓ పిచ్చానందం, వెర్రానందం పొంగులుగా వచ్చేవి. నిజానికి నక్కకీ నాగలోకంకి వున్న తేడా నాకే తెలిసిపోయేది.

శ్రీశ్రీగారి సభలో నేను చేసిన తప్పు:

ప్రసిద్ధ సినీనటి జయప్రద మా రాజమండ్రి అమ్మాయే. ఆమెచే బాబాయి అని పిలవబడే రవణం శ్రీరాములుగారు సి.పి.ఐలో వుండే వారు. జయప్రద అసలుపేరు లలితారాణి. ఆమె పేరుతో రాజమండ్రి లో లలితాలాడ్జి అని వుండేది. అది రవణం శ్రీరాములుగారిది కావ డంతో ఆయన సాహిత్య, కళాభిమానం వల్ల శ్రీశ్రీ, నటరాజ రామ కృష్ణ వంటి వారక్కడ దిగేవారు. వారి ఆతిథ్యమర్యాదల్ని శ్రీరాములు గారు శ్రద్ధగా చూసేవారు.

శ్రీశ్రీగారు ఆ వసతి కేంద్రంలో ఉన్నారని తెలిసి నేనూ, కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణగారు ఆయన దర్శనంకై వెళ్ళాం. నేను అప్పట్లో మా సాంప్రదాయక గురువులు మెచ్చుకోవాలనే తపనతో నాలో పెద్దగా భక్తిభావాలూ అవీ లేకపోయినా కొన్ని గుళ్ళకి వెళ్ళి విభూతి, బొట్టు కనపడేటట్లు పెట్టుకుని గురుగృహాలకి వెళ్ళి వాళ్ళ అనుగ్రహా లకు పాత్రుడవడానికి వెళ్ళేవాణ్ణి. అటువంటి వేషధారణతో; ఆంధ్ర పురాణ పద్యకావ్యం, అమృతం కురిసిన రాత్రి చేతుల్లో ఉండగా శ్రీశ్రీగారి గదిలోకి వెళ్ళాం. కాటా నారాయణరావుగారు నన్ను అభిమా నంగా పరిచయం చేస్తే మహాకవి శ్రీశ్రీ నాముఖంకేసి, నా చేతిలో పుస్తకాలు చూసి మీరేం చెప్పక్కరలేదు. ఈయనేమిటో నాకు తెలిసింది అన్నారు, నర్మగర్భంగా. కొత్తపల్లి సత్య శ్రీమన్నారాయణ తమ వెలు తురు పిట్టల కావ్యప్రతిని శ్రీశ్రీగారికిచ్చి 'చదివి మీరు కొన్ని వాక్యాలు రాస్తే బాగుంటుందని మొహమాట పడుతూ అడిగారు. అప్పుడు శ్రీశ్రీ 'మీ పుస్తకానికి మా సోమసుందరే పీఠిక రాశాడుగా ఇంక నేను రాయక్కర్లేదు' అన్నారు సుందర గౌరవంగా. శ్రీశ్రీగారిలో నాకు కనిపించిన అనిపించిన విశేషమేమిటంటే – తాను అంత కవినని ఇంత జ్ఞాన సంపన్నుణ్ణనే భేషజం ఇసుమంతైనా లేకపోవడం నావంటి యువకవులతో మాట్లాడుతున్నప్పుడు కూడా ఒక ప్రేమ పూరిత సమభావన. సాదాసీదాగా ఉండి, పంటలు పండించే సత్తెకాలపు రైతు ఎలా హాయిగా ఉంటారో అలా వుండడం. మధునాపంతులవారు ఓసారి "ఆలోచనల పరంగా, భావపరంగా విశ్వనాథవారు మాకు ముఖ్యులు అయితే 'ఎందుకో శ్రీశ్రీ అంటే ఎంతో ఇష్టం' ప్రాచీన సాహిత్యాన్ని అంతగా మథించినవారు కవుల్లో తక్కువమంది వుంటా రనేవారు.

శ్రీశ్రీగారు రాజమండ్రి వైశ్యసేవాసదనంకి ఉపన్యాస నిమిత్తం రానుండగా ఆయనకి స్వాగతం చెప్పడానికి సదనం మెట్లమీద కూర్చొంటే ఇక్కడ కూర్చున్నారేమిటంటే వచ్చే ఆయన శ్రీశ్రీ అన్నారు.

శ్రీశ్రీగారు 1960 దశకంలో చైనా దురాక్రమణ (1962) తదుపరి రాజమండ్రి వచ్చారు. విక్రమహాలు ఎదురుగా సుబ్రహ్మణ్య మైదానంలో శ్రీశ్రీ భూమికోసం భుక్తికోసం వంటి అంశాలపై సామా న్యుల గురించి ఏకధాటీగా ఉపన్యాసమిస్తున్నారు. ఆకాలంలో చైనా దురాక్రమణ తదితర అంశాల్లో చైనాను మనం ఇంకా అర్థం చేసుకో వాలనే తపన కమ్యూనిస్టు వర్గాల్లో కొంతమందికి వుండేది. నాకు రాజకీయ పరిజ్ఞానం అంతగాలేని యౌవనపు రోజులు. చాలా పత్రికల్లో నా కవితలు వచ్చేవి. దేశభక్తితో *కం॥ హరిహరయనుచును బిరబిర/ చెరచెర చెండాడి శత్రు శిరముల నేలన్/ దొరలన్ వెనుకాడక సం/ గరమును పలుపంగదయ్య కవ్వడి కరణిన్*– ఇలా దేశభక్తి పద్యాల్ని రాస్తున్న కాలం.

వేల జనం వింటున్న సభలో మహాకవి శ్రీశ్రీ ప్రసంగిస్తున్న సందర్భాన మధ్యలో ఆయనకు ఒక ప్రశ్నతో కూడిన కాగితం చేరింది.

దాంట్లో 'అయ్యా శ్రీశ్రీగారూ! మీరు దున్నేవాడిదే భూమి; భూమికోసం వంటి అంశాలపై మాట్లాడుతున్నారు. చైనావారు ఆక్ర మించిన పదునాలుగు వేల చదరపు మైళ్ళ భూమికోసం మీరేం

తరువాయి...47వ పుటలో

- ఈమని శివనాగిరెడ్డి (స్థపతి)
98485 98446

విజయనగర చక్రవర్తుల బిరుదులు - 3

(సాళువ నరసింహరాయలు, ఇమ్మడి నరసింహరాయలు, తుళువ వీర నరసింహరాయలు, శ్రీకృష్ణ దేవరాయలు)

సాళువ నరసింహరాయలు: కుమార కంపరాయలి ద్వారా, చంద్రగిరి ప్రాంతంలోని నారాయణ వనాన్ని అమర నాయంకరంగా పొందిన సాళువ మంగు, మనుమడైన సాళువ నరసింహ రాయలు, చంద్రగిరి రాజ్యాన్ని తీర్చిదిద్ది, రెండో విరూపాక్ష రాయల తరువాత విజయనగర సింహాసనాన్నధిష్ఠించాడు క్రీ.శ. 1485లో. సాళువ నరసింహరాయలు క్రీ.శ. 1485 నుంచి క్రీ.శ. 1490 దాకా పాలించాడు. ఇతడు కవులను పోషించాడు. ఇతని కాలంలో, రాజనాథ డిండిముడు సాళువాభ్యుదయాన్ని పిల్లలమర్రి పిన వీరభద్రుడు శృంగార శాకుంతలము, జైమినీ భారతములను రచించారు. అంతటి పరిపాలనా దక్షుడు కాకపోయినా విజయనగర సామ్రాజ్యాన్ని నిలపటంలో తనవంతు కృషి చేశారు. ఇతనికి **అరిరాయవిభాడ, అష్టాదశ విద్యా ప్రవీణ, కఠారి సాళువ, ధరణి వరాహ, పిన్నశౌరి రాజ తనూజ, పూర్వదక్షిణ పశ్చిమోత్తర చతుసముద్రాదీశ్వర, మహామండలేశ్వర, మూరు రాయరగండ, మేదినీ మీసరిగండ, రాజకులాభరణ, శౌర్యగరిష సకల కళా విశారద, అసహాయ శౌర్య, సుమేరు ధైర్య** అనే బిరుదులను ధరించాడు.

ఇమ్మడి నరసింహరాయలు (నరసన్న నాయక): క్రీ.శ. 1490-1505 ఇమ్మడి నరసింహరాయలు సింహాసనమెక్కినా తుళువ నరసానాయకుడే పాలనా బాధ్యతల్ని వహించాడు. అంతర్గత కలహాలవల్ల నరసా నాయకుడు, పెనుగొండ దుర్గాన్ని ఆక్రమించుకొని, నరసింహరాయల్ని ఆ దుర్గంలో బంధించాడు. అయినా ఇమ్మడి నరసా నాయకుడే రాజుగా కొనసాగాడు. ఇతనికి **అఘటిత మహా పుణ్యదర్శన అతులభుజ బల పరాక్రమ, అరిరాయ విభాడ, ఈశ్వరేంద్ర వరపుత్ర, కందనాడు కొండుకొండ నాద కూడద రాయరగండ, కఠారి సాళువ, చేరచోళ పాండ్యాది వైభూభుజ మదభంజన, తౌళ (తుళు) వంశాబ్ధి చంద్ర, దక్షిణ సముద్రాధిపతి, జాషగి తప్పువరాయగండ, శరణాగత రక్షక, సద్ధర్మ చారిత్ర, స్వామి కార్యదురంధర** అనే బిరుదుల్ని ధరించాడు.

తుళువ వీర నరసింహరాయలు (క్రీ.శ. 1505-1509): తుళువ నరసా నాయకుని భార్య తిప్పాంబ వల్ల జన్మించిన వీరనర సింహరాయలు, క్రీ.శ. 1505లో పట్టాభిషిక్తుడైనాడు. దీనితో సాళువ వంశం అంతరించింది. తుళువ వంశం విజయనగర పాలనా బాధ్యతల్ని చేపట్టింది. కేవలం ఆరేళ్ళపాటు మాత్రమే పాలించిన వీర నరసింహరాయలు అనేక యుద్ధాల్ని ఎదుర్కోవలసి వచ్చింది. ఆదోని రాజు కాసప్ప, ఉమ్మత్తూరు పాలకుడు దేవరాజు, శ్రీరంగ పట్టణ రాజు గుండరాజు, బహమనీ సుల్తాన్ ఆదిల్‌ఖాన్‌లు వీరనరసింహునితో యుద్ధానికి దిగారు. అయితే కర్నూలును పాలిస్తున్న ఆరవీటి రామ రాజు, ఆదిల్‌షాని తిప్పికొట్టడంలో సహకరించినందుకు, వారికి కర్నూలుతోపాటు ఆదోని రాజ్యాలను బహుమతిగా ఇచ్చాడు వీరనర సింహరాయలు. ఉమ్మత్తూరు పోరులో పాల్గొన్న నరసింహరాయని అతను లొంగకపోయేసరికి ఉమ్మత్తూరును విడిచిపెట్టి, శ్రీరంగ పట్టణంపై దాడికి పూనుకొనగా, శ్రీరంగపట్టణ ప్రభువైన గుండరాజు, ఉమ్మత్తూరు, తలకాడు రాజుల సహకారంతో వీరనరసింహరాయల్ని ఓడించాడు. అతడు క్రీ.శ. 1509లో మరణించాడు. ఇతని కాలంలో పోర్చుగీసు వారితో గుర్రాల సరఫరా ఒప్పందం కుదరటంతో విజయ నగర అశ్వికదళం పటిష్టమైంది. ప్రజల బాగోగులను పట్టించుకొన్న రాజుగా వీర నరసింహరాయలు, **భుజబలరాయ, మూవరు రాయరగండ, రాజ పరమేశ్వర, వీర ప్రతాప, సమస్త వేదశాస్త్ర పురాణాగమాది ప్రవర్తక** అనే బిరుదుల్ని పొందాడు. ఇతని తరువాత నరసా నాయకుడు, నాగాంబికలకు పుట్టిన వాడు శ్రీకృష్ణదేవరాయలు.

శ్రీకృష్ణదేవరాయలు (క్రీ.శ. 1505-1529): మధ్యయుగ భారతదేశంలో మహోన్నత చక్రవర్తిగా విజయనగర సామ్రాజ్య అధినేతగా, రాజనీతి జ్ఞానిగా సాహితీ కళారంగాల పోషకునిగా, ప్రజారంజకమైన పాలన నందించిన శ్రీకృష్ణదేవరాయలు, క్రీ.శ. 1509 ఆగస్టు 7వ తేదీన విజయనగర సింహాసన మధిష్ఠించాడు. (విజయనగర సామ్రాజ్యమనే పాళ్యకట్టు కడితంలో ఈ విషయం ప్రస్తావించబడింది. అయితే హంపీకి దక్షిణంగా 4 కి.మీల దూరంలో నున్న సింగనాయకనహళ్ళిలోని శ్రీకృష్ణదేవరాయలు విడుదల చేసిన కన్నడ శాసనంలో, తాను పట్టాభిషేకం చేసుకొన్న సందర్భంగా (పట్టవకుట్టికొండు సింహాసన దమేలే చిత్తయిసి) క్రీ.శ. 1510 జనవరి 24న విరూపాక్ష దేవునికి అదే గ్రామాన్ని దానం చేసినట్లు చెప్పటంతో అతడు ఇదే తేదీన పట్టాభిషిక్తుడైనాడనీ తెలుస్తుంది. ఇతడు అద్వితీయ విక్రమశీలి, పరాక్రమశాలి. శత్రురాజులపైకి కత్తిదూసి అరివీర భయంకరుడు, అసహాయ శూరుడని పేరు గాంచాడు. బహమనీ రాజ్యంపై దండెత్తి సుల్తానును ఖైదునుంచి విడిపించి, సింహాసనంపై నిలిపి, యవనరాజ్య స్థాపనాచార్య బిరుదును పొందాడు. కృష్ణా - తుంగభద్ర అంతర్వేదిని జయించాడు. తూర్పు దిగ్విజయ యాత్రలో ఉదయగిరి, కొండవీడు, కొండపల్లి, బెల్లంకొండ, వినుకొండ, తంగెడ, కేతవరం, నల్లగొండ, ఉండ్రుగొండ, ఖమ్మం, కప్పలవాయి, అరవపల్లి మొదలైన దుర్గాలను జయించాడు. దక్షిణ దిగ్విజయ యాత్రలో శ్రీరంగపట్టణం, ఉమ్మత్తూరు, శివ సముద్రాలను స్వాధీనం చేసుకొన్నా అటు తరువాత బీజపూరు, రాయచూరు రాజ్యాలను ఆక్రమించాడు. సాగునీరు, తాగునీటికోసం చెరువులు కాలువలను నిర్మించాడు. అపురూప ఆలయాలను నిర్మించి శిల్ప, చిత్ర కళలను ప్రోత్సహించాడు. కవిత్వమల్లి కవులను పోషించి కవన చక్రవర్తి, ఆంధ్రభోజునిగా ప్రసిద్ధిగాంచాడు. ఆంధ్ర భోజునిగా కీర్తించబడిన శ్రీకృష్ణదేవరాయలు **అతి బహుళ చతురంగ బలసమోపేత, అధర్మ సంహారక, అనేక నూతనాగ్రహార**

పాలక, ఆశ్చర్య అప్రతిమ సాహస, భుజబల పరాక్రమి అరిరాయ మనో భయంకర, అరిరాయ పభాండ, శక్తిశాలి, అష్టదిక్కు రాయ మనోభయంకర, ఐవత్తూరు మాండలికరగండ, కఠారి త్రినేత్ర కఠారి సాళువ, కండనాడు కొండుకొండనాడ కోడద పూర్వ దక్షిణ పశ్చిమోత్తర చతుస్సముద్రాధిపతి, కన్నడరాజ రమారమణ, కర్ణాటక సింహాసన స్థాపనాచార్య, కర్నాట రాజ్య రక్షామణి, కర్ణాట రాజ్యలక్ష్మీ మనోహర, కర్నాట సింహాసనారూఢ, కుతూహలిక కీర్తి, కుల దేవతా సహచర, కృతయుగాంత ప్రవర్తక, గండభేరుండ, గజపతి గజకూట పకలి, గజపతి విభాగజాశ్వపతి, చతుసముద్రాధీశ్వర, ధర్మ ప్రతి పాలన ధర్మప్రతిపాలనం, దుష్ట శార్దూల మర్దనం, పరనారీ సహోదర, పర రాయ భయంకర, ప్రత్యక్ష కృష్ణావతారి, ప్రథమ ప్రజాపతి, పూర్వ దక్షిణ సముద్రాధీశ్వర, పూర్వ సింహాసనాధీశ్వర, భోష గెతప్పు వరాయ గండ, మహారాజాధిరాజ, మూరురాయరగండ, మేదినీయ మీసయర గండ, యవన రాజ్య స్థాపనాచార్య, యాదవకులాంబర ద్యుమణి, రాజపరమేశ్వర, రోషకృతప్రతిపార్థివ, విచార విశారద, విజయనగర రత్నసింహాసస్థ, వీరప్రతాప, శరణాగత రక్షక, శ్రీ కర్నాట మహిష, శేషభుజక్షితి రక్షణ శౌండ, శౌచవీర, సంగీత సాహిత్య సమరాంగణ సార్వభౌమ, సకల దేశాధీశ్వర, సకల భూమీశ్వర, సకలలోక రక్షక, సమస్త దుర్గ గర్వమదభంజన, సమస్త వేదశాస్త్ర పురాణాగమాది ప్రవర్తక, హరిశ్చంద్రాది చక్రవర్తి సమోపేత సత్యకీర్తి ప్రతాప, హిందూ రాయ సురత్రాణ, రాజాధిరాజ, మహారాజాధిరాజ, రాజపరమేశ్వర, శ్రీకర్ణాట విజయనగరాధీశ్వర, గజపతి విభాపముక్తా తులాంగహః, షోడశమహాదాన చండ, సంతత కమల వసంత, త్యాగలక్ష్మీనివాస అనే బిరుదులున్నట్లు అతని తెలుగు, తమిళ, కన్నడ, సంస్కృత శాసనాలు, ఆకాలపు సాహిత్యం తెలియ జేస్తున్నాయి.



...45 పుట తరువాయి

చెబుతారు?– ఇట్లు వేలూరి వేంకట రత్నాజీ.

శ్రీశ్రీగారా తడాఖా? మెక్‌మోహన్ రేఖ, ఇంగ్లీషువారు, అంతర్జాతీయ అంశాలు ఇలా ఎన్నో చెబుతూ ఆయనకోణంలో జవాబిచ్చారు. సభ అయిపోయింది. మర్నాడు గౌతమీ గ్రంథాలయానికి దాని కమిటీ అధ్యక్షులు, శ్రీశ్రీ సభానిర్వాహకులు రవణం శ్రీరాములుగారు వచ్చారు. నేను గ్రంథభాండాగారిని.

శర్మగారూ నిన్న శ్రీశ్రీ సభకి వచ్చారుగా.

'వచ్చానండి'

శ్రీశ్రీకి రత్నాజీ ప్రశ్నవేశాడు. దానికి శ్రీశ్రీ సమాధానం చెప్పారు. విన్నారా?

"విన్నానండి"

'ఆ సమాధానం మీకే'.

"నాకాండీ, ప్రశ్న వేసింది రత్నాజీకదాండీ"

ఆ రత్నాజీనే మేం గట్టిగా అడిగితే "సన్నిధానంగారు చీటీపై ప్రశ్నరాసి – క్రింద సంబంధంలేని నాపేరును వ్రాసి పంపారండి అది నేను శ్రీశ్రీగారికిచ్చాను అంతే." అని ఆ మాదగ్గర ఒప్పుకున్నాడు.

దొరికి పోయిన దొంగను ఏమనగలను? కానీ మహాకవి శ్రీశ్రీ గార్ని దొంగపేరుతో సభలో ప్రశ్నించాననే బాధ దహించింది. నన్నెంతో ప్రేమించే చలసాని ప్రసాదుగారితో ఈ సంగతి చెప్పగా అయితే తరువాతేనా దొంగపేరులతో ప్రశ్నించడాలు మానుకున్నావా? అన్నారు. ఆ సంఘటన దెబ్బకు నా భయం తా అయిపోయిందండి అన్నాను. శ్రీశ్రీవల్ల నీకు భయం పోవడం సంతోషించదగ్గ అంశం అన్నారు. సిప్రాలి వంటి శ్రీశ్రీ గ్రంథాల్లో చలసాని ప్రసాదుగారు నా సహకారాన్ని ప్రస్తావించ దానికి ఎంతో ఇదిగా పొంగిపోతుంటాను, అక్కర్లేనంతగా.

మరోమారు గౌతమీ గ్రంథాలయంలోని యోగాసన కేంద్రాన్ని శ్రీశ్రీ సభకి నిర్వాహకులు దరఖాస్తుచేస్తే ప్రభుత్వ వ్యతిరేక కవి ఆయన, ఇవ్వం అని అప్పటి కమిటీ అధికారులు అంటే నేను పాలకవర్గ సభ్యుల్లో మోతుబరైన ముఖ్యుల వద్దకు వెళ్ళి సభకి అంగీకారపు సంతకాలు చేయించి మధ్యాహ్నం 2 గంటలకు గ్రంథాలయం బోర్డుపై శ్రీశ్రీసభ కార్యక్రమం వ్రాసి మరీ ఇంటికెళ్ళి భోజనం తృప్తిగా చేశాను. శ్రీశ్రీ సభను సరస్వతి తిరస్కరించలేదు కదా! గౌతమి తన గుండెను కెరటాలతో కొట్టుకోదూ?

ములుగు పాపయారాధ్యులు దేవీ భాగవతంలో మహాప్రస్థానావసరంబు దాసె జగదంబా జన్మ జన్మాలకున్ అనే చివరి వాక్యంతో కొన్ని పద్యాలున్నాయి.

జగదంబను స్వర్గం (మహాప్రస్థానం) కావాలని కోరుకున్న పద్యాలవి.

దేశపుటమ్మను సోషలిజం మహాప్రస్థానాన్ని కోరుకోవడానికి అన్యాపదేశంగా ఆ పద్యాలను భావించుకుంటూంటాను. నిరుపమాన మహాకవి శ్రీశ్రీ స్ఫూర్తితో.

పిట్టచూపు

చలసాని నరేంద్ర
9849569050

'పద్మావతి' చిత్రంపై రాద్ధాంతం ఎందుకు!

రాజ్‌పుట్ వీర వనిత పద్మావతి జీవితం ఆధారంగా ప్రముఖ బాలీవుడ్ చిత్రనిర్మాత సంజయ్‌లీలా బన్సాలీ నిర్మించిన పద్మావతి' చిత్రంపై పెద్ద ఎత్తున రాద్ధాంతం చెలరేగడంతో డిసెంబర్1న కావల సిన విడుదలను వాయిదా వేసుకోవలసి వచ్చింది. చిత్ర నిర్మాత, నటీనటులపై భౌతిక దాడులు జరుపుతామని బహిరంగ సభలలో హెచ్చరికలు చేస్తూ ఉండటం, కనీసం మూడురాష్ట్రాల ముఖ్య మంత్రులు ఆ చిత్రాన్ని తమరాష్ట్రాలలో ప్రదర్శింపబోమని హెచ్చ రికలు జారీచేయడంతో చిత్రం విడుదలను వాయిదా వేయక తప్ప లేదు.

కనీసం సెన్సార్ బోర్డు పరిశీలన కాకుండానే బాధ్యతగల హోదా లలో ఉన్నవారు ప్రజల ఉద్రిక్తతలను ఆసరా చేసుకొని ఇటువంటి హెచ్చరికలు చేయడం, చిత్రం పట్ల చెలరేగిన వివాదాల గురించి తగు వివరణ ఇవ్వడానికి నిర్మాత సిద్ధం కాకపోవడంతో ఇటువంటి పరిస్థితి ఏర్పడింది. కీలకమైన కేంద్ర సమాచార శాఖ మంత్రి స్మృతి ఇరానీ ఈ విషయంలో ప్రేక్షక పాత్ర వహించారు. కనీసం చిత్రరంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అయినా వివాదాన్ని పరిష్కరిం చేందుకు ఎటువంటి చొరవ తీసుకోకుండా మౌనం వహించడం గమనార్హం.

వాస్తవానికి కార్నిసేన నేతలు చాలముందు నుండే రాణి పద్మావతి పాత్ర పోషిస్తున్న దీపికా పదుకొనే, అలావుద్దీన్ ఖిల్జీ పాత్ర పోషిస్తున్న రణ్వీర్ సింగ్‌ల మధ్య శృంగారం సూచించే సన్నివేశాలు ఏమైనా ఉన్నాయా అనే వివరణ కావాలని, ఈ విషయమై నిర్మాతలతో కలసి మాట్లాడాలి అనుకొంటున్నామని కోరుతూ వచ్చారు. ప్రతికూల ప్రచారం జరిగితే చిత్రంపట్ల ఆసక్తి పెరిగి విడుదల తరువాత తమపై కనకవర్షం కురిపిస్తుంది అని అనుకున్నారో ఏమోగాని చిత్ర నిర్మాతల వైపు నుండి తగు సమాధానం లేదు. దానితో మాట, మాట పెరిగి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

దానితో కార్నిసేనలో అసహనం పెరిగినట్లు కనిపిస్తున్నది. ఇటువంటి సమయంలో అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని సామరస్యంగా వివాదం పరిష్కరించే ప్రయత్నంచేసి ఉండ వలసింది. ఆ విధంగా చేయకపోగా అధికార పక్షానికి చెందిన పలువురు నాయకులు అగ్నికి ఆజ్యం పోసే రీతిలో వ్యవహరించారు. ఈ విషయంలో రాజపుట్‌లకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఒక్కటున్నట్లు కనిపిస్తున్నది. వారి అవకాశవాద, బాధ్యతారాహిత్య ధోరణిని మాత్రమే వెల్లడి చేస్తున్నది.

ఈ మధ్య బిజెపికి మద్దతుదారుడిగా మారిన రిపబ్లిక్ టివి అధిపతి అర్నబ్ గోస్వామి ఈ చిత్రాన్ని చూసి అందులో ఎటువంటి అభ్యంతరకరమైన దృశ్యాలు లేవని స్పష్టం చేశారు. రాజపుట్‌ల గౌరవానికి భంగం కలిగించే మాటలుకూడా లేవని తెలిపారు. పైగా పద్మావతి, ఖిల్జీ పాత్రలు కలసి ఉన్న దృశ్యాలే లేవన్నారు. అంటే జరిగిన రాద్ధాంతం అంతా ఉద్దేశ్య పూర్వకంగా వేర్వేరు ప్రయోజనాలు ఆశించి సృష్టించినవే అని భావించవలసి ఉంటుంది.

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పాలిత రాష్ట్రాలైన ఉత్తర ప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు, గుజరాత్‌లో అసెంబ్లీ ఎన్నికలలో ప్రతికూల పవనాలు వీస్తూ ఉండకపోతే ఇటువంటి పరిస్థితి ఏర్పడి ఉండెడిదా ? వాస్తవ చరిత్రను వక్రీకరించి, రాణి పద్మావతికి కళంకం తెచ్చేరీతిలో చిత్రం నిర్మించారని ఆరోపణలు చెలరేగడంతో కొన్ని వర్గాల ప్రజల మనసులు గాయపడడంతో ఉద్రిక్త పరిస్థితులు నెల కొన్నాయి.

కనీసం రెండు రాష్ట్ర ప్రభుత్వాలు–రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ ఈ చిత్రంపై వ్యక్తం అవుతున్న తీవ్రమైన అభ్యంతరాలు, నిరసనలు దృష్ట్యా సెన్సార్ బోర్డు వాటిని పరిగణనలోకి తీసుకోమని సూచించాలని కోరుతూ కేంద్ర సమాచారశాఖ మంత్రి స్మృతి ఇరానీకి లేఖలు కూడా వ్రాసారు. పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరేందర్ సింగ్ సహితం చరిత్రను వక్రీకరించడం తగదని స్పష్టం చేశారు. యుపి, రాజస్థాన్, హర్యానా ముఖ్యమంత్రులు తమ రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని ప్రదర్శింప బోమని స్పష్టం చేశారు.

సెన్సార్ కూడా పూర్తి కాని ఈ చిత్రంలోని అభ్యంతరకర సన్నివేశాలను తొలగించడానికి సుప్రీంకోర్టు సహజంగానే నిరాకరించింది. ఈమేరకు దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని తోసిపుచ్చింది. సినిమాలో అభ్యంతరకరంగా ఉన్న దృశ్యాలను తొలగించాలన్న పిటిషనర్ అభ్యర్థనను తిరస్కరించిన జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం అలాంటి చర్య అపరిపక్వ చర్య అవుతుందని పేర్కొన్నది.

"సెన్సార్ బోర్డు చట్టబద్ధమైన సంస్థ. సినిమాటోగ్రఫీ చట్టం ఏం చెప్తుందో చూసి దానికి అనుగుణంగా వారు చర్యలు తీసుకుంటారు. వారి పనిలో మేం జోక్యం చేసుకోం" అని ధర్మాసనం పేర్కొంది. అటువంటి పరిపక్వతను రాజకీయ నాయకత్వం ప్రదర్శించలేక పోయింది. పద్మావతి చిత్రంలో ఎలాంటి అభ్యంతకర దృశ్యాలు లేవని, దానిపై అగ్రహించడంలో అర్థమే లేదని బాలీవుడ్ నటుడు షాహిద్ కపూర్ చెబుతున్నా ఎవ్వరూ పట్టించుకోలేదు.

పైగా దీపిక, బన్సాలీల తలలను నరికినవారికి రూ.10కోట్లు నజరానాగా ఇస్తామని హర్యానా బీజేపీ నేత సూరజ్‌పాల్ అమూ చేసిన ప్రకటనపై ఆయనకు కేవలం పార్టీ షోకాజ్ నోటీసు ఇవ్వడంతో సరిపెట్టుకొంది. ఆ విధంగా రెచ్చగొట్టే ప్రకటనలు చేసినవారిపై చట్ట ప్రకారం చర్యలకు ఉపక్రమించే ప్రయత్నం చేయడం లేదు. ఏదో ఒక కేసు నమోదుచేస్తే సరిపోదు. చట్టబద్ధ పాలనపట్ల ఏ మాత్రం నమ్మకం ఉన్నా తగు విధంగా స్పందించ వలసిందే.

రామాయణంలో శూర్పణఖకు పట్టినగతే దీపికకు పడుతుం దని, కర్ణిసేన రాజస్థాన్ రాష్ట్రశాఖ అధ్యక్షుడు మహిపాల్ సింగ్ మక్రానా



మొరసునాడు పాటలు - 1,2 : మూడు రాష్ట్రాల్లో విస్తరించియున్న తావుల్లో తెలుగు ప్రజల నోళ్ళలో ఇంకా పలుకుతున్న జానపద పాటలెన్నో ఉన్నాయి. వాటిలో రామాయణం, భారతం, భాగవతం, ఇంకా అనేక కతలకూ జానపద పాటలున్నాయి. ఆయా తావుల్లోని జనుల జీవన సుగంధాలూ ఉన్నాయి. వాటిని సేకరించి కృష్ణగిరి జిల్లా తెలుగు రచయితల సంఘం వంద పుటల పుస్తకాలను రెండు వెలువరించారు. మొదటి పుస్తకాన్ని స.రఘునాథ సంకలనం చేశారు. రెండవ పుస్తకాన్ని కెం.మునిరాజు కూర్చారు. ఒక్కొక్కటి వెల.రు.80లు. ప్రతులకు : కృష్ణగిరి జిల్లా తెలుగు రచయితల సంఘం, 2-1095, ఆవులపల్లి రోడ్డు, బస్తి, హోసూరు - 635109. కృష్ణగిరిజిల్లా, తమిళనాడు. ఫోన్ : 91 - 897391, 91-9489240967.





సాకిరేవు కతలు : తెలుగు భాషోద్యమ కార్యకర్తగా, కథా రచయిత్రిగా సుపరిచితురాలైన శ్రీమతి పూదోట శౌరీలు. 'పూదోట వెలువరింతలు' పేర ఒకపుస్తక ప్రచురణ సంస్థను మొదలుపెట్టి ఇప్పటికి నాలుగు కతల పొత్తాలను వెలువరించారు. ఈ ఐదవ పుస్తకం చాకలివృత్తి / కులంవారి జీవితాల్లోంచి వచ్చిన అనుభవాల దొంతర. మూరిశెట్టి గోవింద్ ఈ కతల్ని నోటితో చెప్తున్నట్లే వ్రాశారు. ఇందులో ప్రతి కతా చదివిస్తుంది. ప్రతి కతా వాస్తవ సంఘటనల్లోంచి వచ్చిందేనని, వాటిలోని పాత్రలన్నీ సజీవాలేనని' రచయిత తన మాటగా పుస్తకం మొదట్లోనే పేర్కొన్నారు. ప్రతివారి జీవితాలతో పెనవేసుకొనిపోయిన ప్రత్యేకత చాకలి వృత్తి కులానిది. మన గ్రామీణ సమాజాన్ని లోతుగా అర్థం చేసుకోవడానికి ఈ కతలు ఎంతో ఉపకరిస్తాయి.

సాకిరేవు కతలు : రచయిత మూరిశెట్టి గోవింద్; పుటలు : 130, వెల : రు. 120/-; ప్రతులకు : పూదోట శౌరీలు, 1-2-740, హనుమాన్ మందిరం దగ్గర, రాకాసిపేట, బోధన్ - 503 180, నిజామాబాద్ జిల్లా, తెలంగాణ. ఫోన్ : 9010153505.

బహిరంగంగా హెచ్చరించారు. రాజస్థాన్‌లో పద్మావతి చిత్ర యూనిట్‌పై జనవరిలో కర్ణిసేన కార్యకర్తలు దాడిచేసి సినిమా సెట్లను ధ్వంసంచేశారు. బన్సాలీపై దాడిచేసి కొట్టారు. వీరందరిపై ఐపీసీలోని సంబంధిత నిబంధలు ప్రకారం కేసులు నమోదు చేసి, తగు చర్య తీసుకోగల నైతిక స్థైర్యం, నిబద్ధత రాజస్థాన్‌లోని బిజెపి ప్రభుత్వానికి ఉన్నాయా?

ఈ మొత్తం ఉదంతాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకొనేందుకు బీజేపీ, ఇతర రాజకీయ పక్షాలు పోటీపడినట్లు స్పష్టం అవుతుంది. దేశంలో భావవ్యక్తీకరణ స్వేచ్ఛను ఒక పథకం ప్రకారం అణగదొక్కుతున్నారని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ చిత్రంపై వ్యక్తం అవుతున్న అభ్యంతరాల పట్ల నిరసన వ్యక్తం చేసారు. ఒక రాజకీయపక్షానికి అనుకూలంగానే ఈ తరహా వివాదాలు ప్రారంభమవుతున్నాయని ఆమె ఆరోపించారు. అందులో పద్మావతి వివాదం కూడా ఒకటని అంటూ దేశంలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు.

కాగా, చారిత్రక అంశాలను వక్రీకరిస్తే పద్మావతి చిత్రాన్ని తమ రాష్ట్రంలో విడుదల కానివ్వమని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు. శతాబ్దాలుగా రాణి పద్మావతిని భారతీయ మహిళలు తమ ప్రతీకగా భావిస్తున్నారని, అందుకే ఏటా రాష్ట్రమాత పద్మావతి పేరిట అవార్డును ఇవ్వాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన చెప్పారు.

ఇట్లా ఉండగా అసలు రాణి పద్మావతి కల్పిత గాధ అంటూ కొందరు వాఖ్యానాలు మొదలు పెట్టారు. కల్పిత గాధ అయినా, ఈ దేశంలో ఎందరో ఆమెను చారిత్రిక మహిళగా ఆరాధిస్తూ ఉండటం మాత్రం వాస్తవమే గదా. వారి మనోభావాలను దెబ్బతీసే విధంగా, వారు భావిస్తున్న చరిత్రకు భిన్నంగా చిత్రం తీసే అధికారం నిర్మాతలకు ఉందనుకోలేము. ఇటువంటి వితండ వాదనల వలన ప్రయోజనం ఉండదు. ఇటువంటి వివాదాలను నాగరికంగా, ప్రజాస్వామ్య సంప్రదాయాల ప్రకారం పరిష్కరించుకొనే ప్రయత్నాలు జరుగక పోవడం దురదృష్టకరం.

రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాలకోసం, ప్రజలలో పలుకుబడి పెంచుకోవడం కోసం అసహనం వ్యక్తం చేయడంలో పలు వర్గాలు పోటీపడటం కారణంగానే ఇటువంటి రాద్ధాంతం ఏర్పడినట్లు భావించ వలసి వస్తున్నది. అయితే చిత్రాల పై వివాదాలు చెలరేగడం, కొన్ని వర్గాల ప్రజలు భౌతిక దాడులకు దిగుతామని హెచ్చరికలు జారీచేయడం ఇదే మొదలు కాదు. అటువంటి సమయాలలో అధికారంలో ఉన్న రాజకీయ పక్షాలు రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చాయిగాని సామరస్యంగా వివాదాలను పరిష్కరించే ప్రయత్నం చేయలేదు. ఈ విషయంలో ఏ రాజకీయ పక్షం కూడా నిర్దోషి అని చెప్పలేము.

సినిమా కథలలో నాటకీయత ఉండటం సహజమే. కోట్లాది ప్రజలు ఆరాధించే శ్రీరాముడు, కృష్ణుడు పాత్రలను చులకనచేస్తూ గతంలో కూడా ప్రముఖ నటులే అనేక చిత్రాలు నిర్మించారు. వామపక్ష భావాలుగల వారు సినీ రచయితలుగా మారిన తెలుగు, తమిళ్ వంటి భాషలలో ఇటువంటి రుగ్మతలు దశాబ్దాల కాలంగా జరుగుతూనే ఉంది. వివాదాలు సృష్టించడం ద్వారా ప్రేక్షకులను ఎక్కువగా థియేటర్‌లలోకి వచ్చేటట్లు చేయవచ్చనే ఉద్దేశ్యంతో రామ్ గోపాల్ వర్మ వంటి దర్శకులు చాలాకాలంగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

ఒక చిత్రం విడుదలను బలవంతంగా వాయిదా వేయించడం ద్వారా తాత్కాలిక ప్రయోజనాలు కొందరికి సిద్ధించినా సమాజంలో అసహనం, విద్వేషంలను రెచ్చగొట్టినట్లు అవుతుందని మరచిపోలేము. ఇటువంటి వివాదాలపై సినీమా రంగంలోని అగ్ర నటులు, దర్శకులు, నిర్మాతలైనా జోక్యం చేసుకొని ఉంటే హుందాగా ఉండెడిది. అటువంటి ప్రయత్నాలు కూడా జరుగకపోవడం విచారకరం.

గ్రంథాలయం



శ్రీ దాస్యం లక్ష్మయ్య కథలు : రచయిత: శ్రీ దాస్యం లక్ష్మయ్య; పుటలు: 52, వెల : రు.70/-, ప్రతులకు: శ్రీమతి. గోదాదేవి, ఇం.నెం. 11-73/2, హన్మకొండ రోడ్, హుస్నాబాద్ - 505 467. సిద్ధిపేట జిల్లా, సెల్ : 9440155240.



నది అంచున నడుస్తూ : కవితా సంపుటి, రచన : డా॥సి. భవానీదేవి. పుటలు :128, వెల:రు.150/- ప్రతులకు:అన్ని పుస్తక విక్రయ కేంద్రాలు మరియు డా॥సి. భవానీ దేవి, హిమబిందు పబ్లికేషన్స్, 102, గగన్ మహల్ అపార్ట్‌మెంట్స్, దోమల గూడ, హైదరాబాద్ - 500 029. ఫోన్ నెం : 040 - 27636172



సొల్లుఫోను : కథానికలు. రచన: ఎస్.హనుమంతరావు ; పుటలు: 130, ప్రచురణ: శ్రీవేదగిరి కమ్యూనికేషన్స్, హెచ్.ఐ.జి. - 1, బ్లాక్ - 6, ఫ్లాట్ - 10, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్ - 500 044, ఫోన్ : 9391343916



అంతశ్చేతన: కవితా సంపుటి సేకరణ : శ్రీమతి ఎస్. కాసింబీ.పుటలు: 90, వెల: రు.100/-, ప్రతులకు: స్ఫూర్తి పబ్లికేషన్స్, 2/1, బ్రాడీపేట, గుంటూరు - 522 002. సెల్ : 9246830320.



తెలుగు పౌరుషం : సంకలనం; సంకలన కర్త : తవ్వా ఓబుల్‌రెడ్డి; పుటలు: 96, వెల : అమూల్యం. ప్రచురణ: తెలుగు సమాజం మైదుకూరు. ప్రతులకు : తవ్వా పార్వతి, ఇంటి.నెం. 13/478 - 1, ఎల్.ఐ.సి.ఆఫీసు వీధి, మైదుకూరు, కడప జిల్లా, సెల్ : 9440024471.



భూత్ బంగళా: రచన: డా॥ డా॥వాసా ప్రభావతి. పుటలు:122, వెల:రు.50/-, ప్రచురణ: వాసా ప్రచురణలు, మలక్‌పేట, మునిసిపల్ కాలనీ, హైదరాబాద్ - 500 036, సెల్ : 9849178196. ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు.



వంచనకు గురైన పంచశీల : రచన:ఈమని శివనాగిరెడ్డి -స్థపతి, కుర్రా జితేంద్రబాబు. పుటలు:104, వెల :25/- ప్రచురణ: పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ, హైదరాబాద్. ప్రతులకు : పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ, హైదరాబాదు, ఫోన్:94402 33669, మరియు అన్ని పుస్తకాల షాపులు.



సూర్య స్పందన: 'రచనా సంకలనం, సేకరణ : వేదం సూర్య ప్రకాశం. పుటలు: 78, వెల: రు.30/- ప్రచురణ: శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్, బ్లాక్ నెం.6, ఫ్లాట్ - 10, హెచ్.ఐ.జి. - 1, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్. సెల్ : 9391343916.



వేదగిరి రాంబాబు వ్యంగ్య కథానికలు : రచన : డా॥వేదగిరి రాంబాబు, పుటలు: 126, వెల : 50/- ప్రచురణ: శ్రీవేదగిరి కమ్యూనికేషన్స్, హెచ్.ఐ.జి. - 1, బ్లాక్ - 6, ఫ్లాట్ - 10, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్ - 500 044, ఫోన్ : 9391343916




ప్రేమ విలాసం: ఖండ కావ్యం. రచన: కొణతం నాగేశ్వరరావు. పుటలు:130, వెల:రు.80/, ప్రతులకు: కొణతం నాగేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు, ఇంటి.నెం.37-12-1817/20, 11వ లైను, శివనాగరాజు కాలని, (బి.ఒ) రెడ్డిపాలెం, (ఎస్.ఒ), పెదకాకాని, గుంటూరు - 522 509, సెల్ : 9985144963



క్షతగాత్ర : కవిత్వం రచన : రొక్కం కామేశ్వరరావు పుటలు: 66, వెల : 50/- ముద్రణ: చరిత ఇంప్రెషన్స్, ప్రతులకు : ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు మరియు రొక్కం కామేశ్వరరావు, ఇం.నెం. 27-8-14, కొత్త నెం. 209, కన్నావారితోట, 3వ లైను, 1వ క్రాస్, గుంటూరు - 522 004, సెల్ : 08143759423



మోహన్ ఒక మరపురాని జ్ఞాపకం; పబ్లిషర్ : టి.ఎస్.ప్రకాష్, ఆనందనగర్ కాలనీ, ఖైరతాబాద్, హైదరాబాద్, తెలంగాణ - 500 004, ఫోన్ : 97045 41559, ప్రతులకు : 87909 98442



దళితుల చరిత్ర : 6వ భాగం రచన : డా॥కత్తి పద్మారావు పుటలు:320, వెల:రు 300/- ప్రతులకు: కత్తి స్వర్ణకుమారి, లోకాయుత ప్రచురణలు, లుంబినీవనం, అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్, అంబేద్కర్ కాలనీ, పొన్నూరు - 522124, గుంటూరు జిల్లా, ఫోన్ : 98497 41695



గునుక పువ్వు : కవిత్వం. రచన: శ్రీ దాస్యం లక్ష్మయ్య. పుటలు:106, వెల:రు.100/- ప్రతులకు: శ్రీమతి ఎం.గోదాదేవి, ఇం.నెం. 11-73/2, హన్మకొండ రోడ్, హుస్నాబాద్ - 505 467, సిద్ధిపేట జిల్లా, (తెలంగాణ) సెల్ : 94401 55240

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136)
RNI-APTEL/2015/62362

విశాఖపట్నంలోతెలుగుదండు సత్యాగ్రహం



నవంబర్1న మొదలుపెట్టి నిరంతరం విశాఖ పట్నంలో సత్యాగ్రహం జరుగుతోంది. తెలుగు దండుస్థాపక సమన్వయకర్త శ్రీ పరవస్తు ఫణిశయన సూరి నాయకత్వంలో నిరసన దీక్షలు జరుగుతున్నాయి. వీరి ప్రధాన నిక్కచ్చులు – జి.ఓ నెం.14ను రద్దు చేయడం, ప్రాధికార సంస్థను నెలకొల్పడం, తెలుగును పరిపాలనలో చిత్తశుద్ధిగా అమలు చేయడం మున్నగునవి. పద్మశ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఆచార్య డి.విశ్వేశ్వరం, ఉపాధ్యాయ నేత సింహాద్రి అప్పడు, లోక్‌సత్తా నేత జయప్రకాశ్ నారాయణ్, తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు డా॥సామల రమేష్‌బాబు,ప్రముఖరచయిత డా॥వేదగిరి రాంబాబు, జానపద కళాకారుడు వంగపండు ప్రసాదరావు మున్నగువారుశిబిరాన్ని దర్శించి మద్దతు పలికారు.

ఈ రోజుకి (నవంబర్ 28 నాటికి) ఇంకా దీక్షలు కొనసాగుతూనే ఉన్నాయి.దీక్షకు రాష్ట్రంలో పలుచోట్ల భాషోద్యమకారులు మద్దతు పలుకుతూ సానుభూతి ప్రదర్శనలు చేశారు. భాషోద్యమకారులకు స్ఫూర్తిదాయకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిన శ్రీ ఫణిశయన సూరి ఆయన సహచర బృందసభ్యులకు అభినందనలు.

చెన్నపురి రచయితల సంఘం 'మదరాసు బదుకులు' పుస్తకం ఆవిష్కరణ



2017, అక్టోబర్ 14 వ తారీఖున మదరాసులోని డా.దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆంధ్ర మహిళా సభ, మైలాపూర్‌లో 'మదరాసు బదుకులు' పుస్తకావిష్కరణ జరిగింది. ముఖ్యఅతిథి, పుస్తకావిష్కర్త అయిన శ్రీనల్లి కుప్పుస్వామిచెట్టి తెలుగులో ఎంతో మక్కువతో ప్రసంగించారు. ఇప్పటికీ సుందరమైన తెలుగుకీర్తనలే మదరాసు మహానగరంలో సంగీతోత్సవాలలో మార్మోగుతున్నాయని అన్నారు. తమిళులతో తెలుగువారు అన్నదమ్ముల్లా కలసిమెలసి సాగుతుండేవారని పేర్కొన్నారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం విడిపోవడం ఇప్పటికీ తనకు బాధ కలిగిస్తూనే ఉంటుందని అన్నారు. తెలుగువాడిగాపుట్టి తెలుగు రాయడం నేర్చుకోలేక పోయాననే అనేబాధ ఇలాంటి తెలుగు సభలకు వెళ్లినప్పుడు కలుగుతుంటుందని ఆవేదన చెందారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంగా ఉన్నప్పుడు దక్షిణాది ప్రాంత పాఠశాలల్లో పది సెక్షన్లకు ఒక సెక్షన్లో తెలుగు బోధన ఉండేదన్నారు. టి.నగర్‌లో 50 శాతం, నార్త్‌చెన్నైలో 60శాతం మంది తెలుగువారున్నారని, వీరంతా తమిళులతో కలిసిపోయినా, తెలుగును మాత్రం మరిచిపోలేదన్నారు. తమ నల్లీ సిల్క్స్ అంగట్లో అత్యధిక శాతం కొనుగోలుదారులు తెలుగువారేనని అన్నారు. తన స్నేహితుల్లో ఎక్కువ శాతం తెలుగు వారేనని, తాము తెలుగులోనే మాట్లాడుకుంటామని చెప్పారు. ప్రముఖ కథారచయిత శ్రీ వాసిరెడ్డి నవీన్ మాట్లాడుతూ, 'మదరాసు బదుకులు' అన్న పుస్తకం తెలుగు సాహిత్య చరిత్రలో ఒక మైలురాయి అని పేర్కొన్నారు. చెన్నై నగరంలో అరవ యాసతో మాట్లాడుతున్న తెలుగును కూడా అచ్చమైన తెలుగు భాషాభేదంగానే గుర్తించాలన్నారు. ఇక్కడి రచయితలు, ఈ వ్యవహారిక తెలుగును మార్చేందుకు ప్రయత్నించకూడదన్నారు. తెలుగువాణి సంస్థ గౌరవ కార్యదర్శి, శ్రీ స.వెం.రమేశ్ మాట్లాడుతూ, తెలుగురాష్ట్రాలకు బయటనున్న వివిధ ప్రాంతాల నుండి, ఇటువంటి రచనలు మరిన్ని రావలసిన అవసరముందని పిలుపునిచ్చారు. ఈ సభకు ఆకాశవాణి తిరుపతి డైరెక్టర్, చెన్నరసం గౌరవాధ్యక్షులు డా.నాగసూరి వేణుగోపాల్ అధ్యక్షత వహించారు.

– డా రాయదుర్గం విజయలక్ష్మి

అమ్మనుడి (తెలుగుజాతి పత్రిక)
AMMANUDI (Telugu Monthly)
December 2017, **Vol.3, Issue** 10

Date of publication : 1st of every month
Date of posting : 4th of every month

RNI-APTEL/2015/62362
Postal Reg. No.TEN/12/2015-17

If not delivered, please return to : 'The publisher, AMMANUDI monthly,
8-386, Jivaka bhavanam, ANGALAKUDURU (po), TENALI- 522 211, Guntur (dt) A.P. Cell: 9440 448244